
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత్ శక్తి®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal



సంపుటి: 19 సంచిక:243 హైదరాబాద్ ఆదివారం, 27 ఏప్రిల్ 2025 పేజీలు: 12 వెల: 1.00

## అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే మా లక్ష్యం: రేవంత్ రెడ్డి



%హైదరాబాద్: సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దీనికోసం అనేక పథకాలను తీసుకొచ్చామన్నారు. దేశంలోనే అతిపెద్ద రైతు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఇప్పటికే రూ.20 వేల కోట్లు రుణమాఫీ చేశామని చెప్పారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు.

" రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నాం. వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. పట్టభద్రులు సర్టిఫికెట్ తీసుకుంటున్నారు. కానీ ఉద్యోగాలు లేవు. యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చాం. ప్రజలకు ఏ సమయంలో ఏది అవసరమో కాంగ్రెస్‌కు బాగా తెలుసు" రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమ్మిట్‌కు పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతల, విదేశీ ప్రతినిధులు హాజయ్యారు. వివిధ అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయి. బహుళత్వం-వైవిధ్యం, పోలరైజేషన్‌ను అధిగమించడం, వేగవంతమైన న్యాయం, అనిశ్చితికాలంలో ఆర్థిక న్యాయం, ప్రపంచ శాంతి, న్యాయంపై చర్చలు జరుగుతున్నాయి.



## రాజకీయాల్లోకి కొత్త తరం రావాలి: రాహుల్ గాంధీ


హైదరాబాద్: గత పదేళ్లలో ప్రపంచ రాజకీయాలు మారిపోయాయని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఆధునిక సామాజిక మాధ్యమాలతో అంతా మారిపోయిందన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో కొనసాగుతున్న భారత్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లోకి కొత్తతరం రావాలని ఆకాంక్షించారు. అప్పుడే కొత్త ఆలోచనలు పుట్టుకొచ్చి, దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలకు ముందు కన్యాకుమారి నుంచి సుమారు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినట్లు రాహుల్ గుర్తు చేసుకున్నారు. పాదయాత్రకు ముందు చాలా ఆలోచించానని, అయితే, మొదలు పెట్టిన తర్వాత వెనకడుగు వేయలేదని అన్నారు. ఆ తర్వాత చాలా మంది తనతో కలిసి నడవడం మొదలు పెట్టినట్లు చెప్పారు.

## భారీ అగ్ని ప్రమాదం..

## 400 గుడిసెలు దగ్ధం..

హైదరాబాద్, ఏప్రిల్ 26: హయత్‌నగర్ కుంట్లూరులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. రావి నారాయణ రెడ్డి నగర్‌లో పేదల గుడిసెలకు మంటలు అంటుకున్నాయి. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతున్నాయి. మంటలు భారీగా ఎగసిపడటంతో స్థానిక ప్రజలు భయంతో తమ తమ గుడిసెల్లోంచి బయటకు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది.. హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. 4 ఫైరింజన్ల సహాయంతో మంటలను అదుపు చేశారు. సిలిండర్లు పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు నిర్ధారించారు.ప్రమాదంపై జిల్లా ఫైర్ ఆఫీసర్ కేశవులు మాట్లాడారు. తమకు గంట క్రితం ఫైర్ స్టేషన్‌కి కాల్ వచ్చిందని.. కుంట్లూరు రావి నారాయణరెడ్డి కాలనీ సమీపంలో గుడిసెలు తగలబడిపోతున్నాయని సమాచారం ఇచ్చారని తెలిపారు. వెంటనే ఎల్బీనగర్, హయత్‌నగర్‌లోని తమ సిబ్బందిని అలర్ట్ చేసి 5 ఫైర్ ఇంజిన్లను పంపించామన్నా. సుమారుగా 300 నుంచి 400 వరకు గుడిసెలు దగ్ధమైనట్లు తెలిపారాయన. ఇప్పటి వరకు దాదాపుగా మంటలు అదుపులోకి వచ్చాయని.. మరో 2 ఫైరింజన్లు వస్తున్నాయని ఫైర్ ఆఫీసర్ కేశవులు తెలిపారు.అబ్దుల్లాపుర్‌మెట్ ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. కుంట్లూరు రెవెన్యూ పరిధిలో రావి నారాయణరెడ్డి కాలనీ సమీపంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుందని సమాచారం వచ్చింది. తాము కూడా ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాము.

## పాక్ ప్రధాని షెహబాజ్‌కు ఒమర్ అబ్దుల్లా కౌంటర్



పహల్గాంలో పర్యటకులపై ఉగ్రదాడిపై తటస్థ దర్యాప్తునకు తాము సిద్ధమేనని పాక్ ( ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ( తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ పాశవిక ఘటనను తొలుత పాకిస్థాన్ తోసిపుచ్చిందని, భారత్‌పైనే నిందలు వేసిన విషయాన్ని గుర్తుచేస్తూ విమర్శలు గుప్పించారు.

"పహల్గాంలో జరిగిన ఘటనను కనీసం వాళ్లు గుర్తించలేదు. ఆ ఘటన వెనక భారత్ ఉందని మొదట ఆరోపించారు. మనపై ఆరోపణలు చేయడంలో ముందుండే వాళ్లకు ఇప్పుడేమీ చెప్పలేం. వారి ప్రకటనలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వాలనుకోవడం లేదు. దురదృష్టకరమైన ఆ ఘటన జరిగి ఉండాల్సింది కాదు" అని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు.

పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వాలోని (%ఖుఎఅర్ఖుఅ%) మిలిటరీ అకాడమీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని షెహబాజ్ షరీఫ్.. తాజా ఉద్రిక్తతలపై స్పందించారు. "పహల్గాంలో ఇటీవల జరిగిన విషాదకర ఘటనతో మరోసారి మన దేశం నిందలు ఎదుర్కొంటోంది. ఆ ఘటనపై తటస్థ, పారదర్శక, విశ్వసనీయ దర్యాప్తులో పాల్గొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. శాంతికే మా ప్రాధాన్యం" అని షరీఫ్ తెలిపారు. ఉగ్రవాదాన్ని తాము కూడా ఖండిస్తామంటూ పేర్కొనడంపై జమ్మూ కశ్మీర్ సీఎం విమర్శలు గుప్పించారు.

## పాక్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలుంటాయ్
## తుపాకీ పట్టినోడు ఆ తుపాకికే బలిగాక తప్పదు
### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్

ఉగ్రవాదుల రాక్షసత్వానికి పరాకాష్ట పెహల్ గాం ఘటన. 30 ఏళ్లుగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నామని ఆ దేశ రక్షణ మంత్రి అంగీకరించారు.

బిచ్చమెత్తుకునే దుస్థితికి చేరినా పాక్ బుద్ధి మారడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. అభివృద్ధిలో దూసుకు పోతున్న భారత్ ను చూసి ఓర్వలేక పోతోంది. మోదీ సర్కార్ తీసుకునే కఠిన నిర్ణయాలకు అండగా నిలవండి. రోజ్ గార్ మేళా మోదీకి ఇష్టమైన కార్యక్రమం. 10 లక్షల ఉద్యోగాల భర్తీ మార్క్ కు చేరుకున్నాం. కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు హ్యాట్సాప్. ఇష్టపడి పనిచేసి దేశానికి సేవ చేయండి. సంక్షేమ పథకాలు చిట్టచివరి వ్యక్తికి కూడా అందేలా చేయండని అన్నారు.

హైదరాబాద్ ఎంసీహెచ్ఆర్డీ లో రోజ్ గార్ మేళా లో పాల్గొన్న కేంద్ర మంత్రి, ఉద్యోగాలకు ఎంపికైన 100 మందికి అపాయిట్ మెంట్ లెటర్లు అందజేసారు.

తుపాకీ పట్టినోడు చివరకు ఆ తుపాకీకే బలికాక తప్పదని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగా పాకిస్తాన్ వెన్నులో వనుకు పుట్టేలా చర్యలుండబోతున్నాయని అన్నారు. ఈ విషయంలో మోదీ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోబోతోందని, ఇందుకు యావత్ దేశం అండగా నిలవాలని కోరారు.

హైదరాబాద్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన రోజ్ గార్ మేళా, కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు జీఎస్టీ చీఫ్ కమిషనర్లు సందీప్ ప్రకాశ్, వి.సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంతో కష్టపడి చదువుకుని ఉద్యోగం సాధించిన మీరంతా ఇకపై మీకప్పగించిన బాధ్యతలను ఇష్టపడి నిర్వర్తించి మంచి గుర్తింపు తెచ్చుకోండి. ఎప్పటికప్పుడు కొత్తగా వచ్చే టెక్నాలజీని,



ఉ... నేర్చుకుంటూ ముందుకు సాగండి. మీకు తెలుసు. ఉద్యోగావకాశాల సృష్టికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నది మోదీ సంకల్పం. అందుకే 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసుకోగలిగాం. మాట ఇస్తే నెరవేర్చే ప్రభుత్వం నరేంద్రమోదీదే. గతంలో క్రమం తప్పకుండా వివిధ శాఖల్లోని ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసిన దాఖల్లేవు. ఆ ఘనత మోదీకే దక్కుతోంది.

అంతేగాకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారత్ ఆర్థిక ప్రగతిలో అగ్రభాగాన నిలిచేందుకు నిరంతరం క్రుషి చేస్తున్నారు. గతంలో 11వ స్థానంలో ఉన్న భారత్ ను 5వ స్థానంలో నిలిపారు. మరో మూడేళ్లలో 3వ స్థానానికి తీసుకువచ్చే దిశగా పనిచేస్తున్నారు. అట్లాగే భారత్ కు స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి 100 ఏళ్లు పూర్తి కానున్న సందర్భంగా అప్పటికి అమెరికా, చైనాను అధిగమించి భారత్ ప్రపంచంలోనే నెంబర్ వన్ కావాలన్నదే మోదీ ఆకాంక్ష. మోదీ కృషిలో మీరంతా భాగస్వాములు కావాలని కోరుకుంటున్నానని అన్నారు. .

## దానం కారులో ఖర్చీఫ్

హైదరాబాద్, ఏప్రిల్ 26

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీకి దూరం అయ్యేటట్లే కనిపిస్తున్నారు. ఆయన చేస్తున్నవ్యాఖ్యలు, చేస్తున్న పనులు మళ్లీ బీఆర్ఎస్ కు దగ్గరయ్యేందుకేనన్నది స్పష్టంగా అర్థమవుతుంది. అందుకే తరచూ ఆయన చేస్తున్న కామెంట్స్ అధికార పార్టీకి వ్యతిరేకంగా, తాను ఎన్నికై బయటకు వచ్చిన బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా మారుతున్నాయి. ఈ సౌండ్ విన్న వారికి ఎవరికైనా దానం నాగేందర్ ఖచ్చితంగా తిరిగి కారు ఎక్కేందుకేనన్నది చిన్న పిల్లాడికి కూడా అర్థమవతుంది. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఖైరతాబాద్ నియోజకవర్గంలో గెలిచిన దానం నాగేందర్ తర్వాత కాంగ్రెస్ కు అనుకూలంగా మారారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.మొదటి నుంచి అంతే... అంతటితో ఆగకుండా సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కూడా 2024లో పోటీ చేసిన దానంనాగేందర్ ఓటమి పాలయ్యారు. అయితే గత కొంతకాలంగా అధికార పార్టీ నిర్ణయాలను బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారు. హైడ్రా కూల్చివేతలను ఆపేయాలనంటూ ఆయన హుకుం జారీ చేశారు. హైడ్రా వల్ల ప్రభుత్వ ప్రతిష్ట మరింత దిగజారి పోతుందని కూడా అన్నారు. అంతటితో ఆగకుండా దానం నాగేందర్ తన నియోజకవర్గంలో హైడ్రా కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం కూడా చేశారు. దానం నాగేందర్ మూసీ నది ప్రక్షాళన జరగాలంటూనే అదే సమయంలో పేదల ఇళ్లను కూల్చితే తాను ఒప్పుకోనని తెగేసి చెబుతున్నారు. దానం నాగేందర్ కు మంత్రి పదవి వస్తుందని భావించినా అది సాధ్యంకాలేదు. దీంతో నాగేందర్ ఫ్రస్టేషన్ కు లోనవుతున్నట్లు కనిపిస్తుంది. తేలని నిర్ణయం తాజా వ్యాఖ్యలతో... ఇక మరో అడుగు ముందుకు వేసి హైదరాబాద్ యూనివర్సిటీ భూముల వివాదంలో నోటీసులు అందుకున్న ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ కు కూడా అండగా నిలిచారు. స్మితా సబర్వాల్ రీట్వీట్ చేసిన విషయాల్లో తప్పేమీ లేదని అనడంతో దానం నాగేందర్ నేరుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగానే వ్యాఖ్యానించినట్లు స్పష్టమవుతుంది. స్మితా సబర్వాల్ కాంగ్రెస్ ను ఉద్దేశించి ఏమీ అనలేదని దానం నాగేందర్ వెనకేసుకొచ్చారు. మరొక వైపు ఈనెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభ విజయవంతమవుతుందని కూడా దానం నాగేందర్ అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో ఈ సభకు భారీ సంఖ్యలో జనం హాజరవుతారన్న ఆయన కేసీఆర్ ను చూసేందుకు, ఆయన మాటలను వినేందుకు ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని అని కారులో కర్చీఫ్ వేసినట్లయింది.

భారత శక్తి
VOICE OF INDIAN

# ఇంకా ఆ పీడకలే....

జమ్ము కశ్మీర్ లో ప్రసిద్ధ పర్యటక ప్రాంతమైన పహల్గాంలో జరిగిన తీవ్రవాదుల దాడిలో 26 మంది పర్యటకులు చనిపోవడంతో ఆ ప్రాంతంలో భయాందోళనలు పెరిగాయి.జమ్ము కశ్మీర్ నుంచి తిరుగు పయనమైన పర్యటకుల సంఖ్య పెరిగిపోయింది. పర్యటకులను శ్రీనగర్ విమానాశ్రయానికి చేర్చే టాక్సీలు బారులు తీరుతున్నాయి. హైవేలపై కూడా తిరుగు ప్రయాణికులను తీసుకువెళ్లే వాహనాల సంఖ్య పెరుగుతోంది."మాకు భయంగా ఉంది. టెర్రరిస్టులు ఎక్కడ ఉన్నారో, తర్వాత ఏం జరుగుతుందో తెలియదు" అని గౌతమ్ అనే టూరిస్ట్ చెప్పారు. జమ్ము కశ్మీర్‌లో పర్యటించేందుకు ఆయన బోలెడు ప్రణాళికలతో వచ్చారు. కానీ ఇప్పుడాయన ఇంటికి తిరిగి వెళ్లిపోయే హడావుడిలో ఉన్నారు.జమ్ము కశ్మీర్ దశాబ్దాలుగా హింసకు కేంద్రంగా ఉన్నప్పటికీ, పర్యటకుల మీద దాడులు జరగడం చాలా అరుదు."ఇటీవలి సంవత్సరాలలో సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడుల్లో ఇది చాలా పెద్దది" అని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు.1947లో బ్రిటిషర్ల నుంచి స్వాతంత్ర్యం పొందిన తర్వాత ఈ రెండు దేశాలు ముస్లింలు మెజార్టీగా ఉన్న కశ్మీర్ కోసం రెండు యుద్ధాలు చేశాయి. 1980, 90లలో భారతదేశ పాలనకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో చెలరేగిన అసంతృప్తి తిరుగుబాటుకు దారి తీసింది. దీనికి పాకిస్తాన్ నిధులు అందిస్తోందని భారతదేశం ఆరోపిస్తోంది. ఈ సంఘర్షణలో వేల మంది చనిపోయారు.

అయితే ఇటీవలి సంవత్సరాలలో హింస తగ్గిందని ప్రభుత్వం చెబుతోంది.2004- 2014 మధ్య 7217 టెర్రరిస్ట్ సంఘటనలు జరిగాయని, అయితే 2014 నుంచి 2024 మధ్య వాటి సంఖ్య 2242కి తగ్గింది" అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో చెప్పారు.సంప్రదాయంగా ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు అతి పెద్ద చోదకశక్తిగా ఉన్న పర్యటకం, ఇటీవల బాగా పుంజుకుంది.2023లో జమ్ము కశ్మీర్‌ను 2 కోట్ల మంది పర్యటకులు సందర్శించారని భారత పర్యటక శాఖ తెలిపింది. కోవిడ్‌కు ముందున్న సంఖ్యతో పోలిస్తే ఇది 20శాతం ఎక్కువ.అయితే పహల్గాం దాడి తర్వాత ఈ పరిస్థితికి ముప్పులా కనిపిస్తోంది.''అంతా అయిపోయింది. నాకు కన్నీళ్లు వస్తున్నాయి" అని పహల్గాంలో శాలువాలు అమ్ముకునే షకీల్ అహ్మద్ చెప్పారు."మా జీవితం అంతా పర్యటకుల మీద ఆధారపడి ఉంది. నేను బ్యాంకు నుంచి అప్పు తీసుకుని ఈ వ్యాపారం చేస్తున్నాను. ఇప్పుడు నా వస్తువులను కొనుక్కోవడానికి ఎవరూ లేరు'' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు."పాశవికమైన, క్రూరమైన దాడి. ఇది కశ్మీర్‌కు, ఈ ప్రాంత పర్యటక పరిశ్రమకు చెడ్డవార్త " అని స్థానిక హోటల్ వ్యాపారి జావెద్ అహ్మద్ చెప్పారు.అహ్మద్ హోటల్‌లో రూములు జూన్ వరకు బుక్ అయ్యాయి. అయితే ఇప్పుడీ సంఘటన కారణంగా పర్యటకులు రావడం ఆగిపోయినా, బుకింగ్స్ రద్దు చేసుకున్నా, తన వ్యాపారం దెబ్బ తింటుందని ఆయన ఆందోళన చెందుతున్నారు.జమ్ము కశ్మీర్‌లో పర్యటక రంగానికి ఇది కీలకమైన సీజన్. వేసవి ఎండల నుంచి ఉపశమనం కలిగించే స్వర్గధామంలా ఈ ప్రాంతాన్ని పరిగణిస్తుంటారు. పాఠశాలలకు వేసవి సెలవుల కారణంగా దేశం నలుమూలల నుంచి కుటుంబసమేతంగా ఇక్కడకు వస్తుంటారు.అయితే ఈ సెలవుల సీజన్ భిన్నంగా ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే కశ్మీర్ లోయ ఇప్పుడు భద్రతా చట్రంలో చిక్కుకుపోయింది.ప్రస్తుతం శ్రీనగర్‌లోని పర్యటకులలో భయం ఏర్పడిందని, త్వరలో వెళ్లాలనుకుంటున్న వారిలో ఆగ్రహం, భయం ఉన్నాయని ముంబయి కేంద్రంగా గ్రూప్ టూర్స్‌ను నిర్వహించే అభిషేక్ హాలిడేస్ సంస్థ అధిపతి అభిషేక్ సంసారే చెప్పారు.బుకింగ్‌లను రద్దు చేయాలని అనేకమంది ఫోన్లు చేస్తున్నారు" అని ఆయన చెప్పారు.ఈ దాడిని ప్రపంచ దేశాల నాయకులు ఖండించారు. దాడికి పాల్పడిన వారిని శిక్షిస్తామని ప్రధానమంత్రి మోదీ, హోంమంత్రి అమిత్‌షా చెప్పారు.బాధితులకు న్యాయం జరగాలని కోరుతూ కశ్మీరీలు నిరసన ప్రదర్శనలు చేశారు.పహల్గాం లైన్ ఆఫ్ కంట్రోల్ నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉంది.

కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి తొలగించిన తర్వాత ఈ ప్రాంతంలో పర్యటక రంగానికి ఊపు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. 2023లో జీ ట్వంటీ టూరిజం వర్క్‌షాప్ గ్రూప్ సమావేశానికి శ్రీనగర్ ఆతిథ్యమిచ్చింది. ఈ సమావేశానికి అనేక మంది విదేశీ అతిథులు హాజరయ్యారు.ప్రత్యేక ప్రతిపత్తి తొలగించిన తర్వాత తొలిసారి 2024లో శ్రీనగర్‌లో పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్థానికంగా వ్యవసాయ, పర్యటక రంగాల అభివృద్ధికి 6,400 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రకటించారు."అభివృద్ధిలో జమ్మూ కశ్మీర్ కొత్త ఎత్తుల్ని తాకుతోంది. ఎందుకంటే అది ఇప్పుడు స్వేచ్ఛా వాయువుల్ని పీలుస్తోంది. ఈ ప్రాంత అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న ఆర్టికల్ 370 తొలగించిన తర్వాత స్వేచ్ఛ వచ్చింది" అని ప్రధాని మోదీ అన్నారు.ఆర్టికల్ 370 తొలగించిన తొలినాళ్లలో, పరిస్థితులు ఇంకా చక్కబడకముందే పర్యటకుల సంఖ్య పెరుగుతోందని కొందరు ఆందోళన చెందారు."పర్యటకం అంటే సాధారణ స్థితి కాదు. ఇది ఆర్థిక కార్యకలాపాలకు సూచిక. సాధారణ స్థితి అంటే భయం లేకపోవడం. టెర్రరిజం లేకపోవడం, ఉగ్రవాదుల దాడులు తగ్గడం, ప్రజాస్వామిక పాలన వల్ల కశ్మీర్ ప్రస్తుతం సాధారణంగా ఉంది" అని ప్రస్తుత ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 2022లో అన్నారు.2024లో జరిగిన ఎన్నికల్లో గెలిచి ఆయన ముఖ్యమంత్రి అయ్యారు.పహల్గాం దాడి ఘటనపై ఆయన ఎక్స్‌లో స్పందించారు. "టెర్రరిస్టుల దాడి తర్వాత పర్యటకులు కశ్మీర్ లోయ నుంచి వెళ్లిపోవడం చూస్తుంటే హృదయ విదారకంగా ఉంది" అని ఆయన అందులో పేర్కొన్నారు.పచ్చని పచ్చిక బయళ్లతో ప్రకృతి సౌందర్యంతో పర్యటకులకు మరపురాని అనుభూతిని పంచుతుంది.

# అధికారులకు కలిసిరాని ఇంటెలిజున్స్ బ్యూరో
# నిన్న ఏవీబీ...ఇవాళ పీఎస్ ఆర్

విజయవాడ, ఏప్రిల్ 26,

ఆంధ్రప్రదేశ్‌లో ఐపీఎస్ అధికారులకు ఇంటెలిజెన్స్ బాధ్యతలు పెద్దగా అచ్చి రావడం లేదు. గత పదేళ్లలో ప్రభుత్వాలకు కళ్లు, చెవులుగా పనిచేసిన ఇద్దరు డీజీ స్థాయి అధికారులు తర్వాతి కాలంలో చిక్కుల్లో పడ్డారు. 2014-19 మధ్య కాలంలో ఇంటెలిజెన్స్ బాధ్యతలు చూసిన ఏబీ వెంకటేశ్వరావు వైసీపీ ప్రభుత్వంలో వేధింపులకు గురైతే, 2019-24 మధ్య కాలంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన పిఎస్సార్ ఆంజనేయులు ఏకంగా జైలుకు వెళ్లాల్సి వచ్చింది.ఏపీలో రాజకీయాలకు ప్రభుత్వ అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వాలను నడిపించే నేతల ఆదేశాలను తూచ తప్పకుండా పాటించడమే వారికి శాపంగా మారుతోందనే విమర్శలు ఉన్నాయి. గత పదేళ్లలో ఇద్దరు డీజీ స్థాయి అధికారులు ఎదుర్కొన్న పరిణామాలు చర్చనీయాంశంగా మారాయిఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన నగరాల్లో విజయవాడ పోలీస్ కమిషనరేట్ ఒకటి. హైదరాబాద్ తర్వాత కమిషనరేట్ హోదా పొందిన విజయవాడ నగరంలో పనిచేయడం ఐపీఎస్ అధికారులు గుర్తింపుగా భావించేవారు. రాష్ట్ర విభజన తర్వాత విజయవాడ సీపీలుగా పనిచేసిన ఇద్దరు ఐపీఎస్ అధికారులు ఇంటెలిజెన్స్ చీఫ్‌లు అయ్యారు.రాష్ట్ర విభజన తర్వాత 2014లో ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఏపీలో పాలన మొదలైంది. 2014లో తొలి ఏడాది పాలనలో కుదురుకోడానికి, రాజధాని నగరాన్ని ఎంపిక చేసుకోవడంలోనే కాలం గడిచి పోయింది. అప్పట్లో ఆంధ్రప్రదేశ్ పాలనా యంత్రాంగం మొత్తం హైదరాబాద్ నుంచి నడిచేది.విజయవాడలో సీఎం చంద్రబాబు తాత్కాలిక బస ఏర్పాటు చేసుకోడానికి కూడా ఏడెనిమిది నెలల సమయం పట్టింది. ఇరిగేషన్ శాఖకు చెందిన పులిచింతల ఎస్ఈ కార్యాలయాన్ని దశల వారీగా సిఎం క్యాంపు ఆఫీసుగా మార్చుకున్నారు. అప్పట్లో ఇంటెలిజెన్స్ బాధ్యతలు ఐపీఎస్ అధికారి ఏఆర్ అనురాధ పర్యవేక్షించేవారు.2015 మే నెలలో హైదరాబాద్‌లో జరిగిన రాజకీయ పరిణామాలతో టీడీపీ ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జరిగిన ఘటనలు ఏపీ, తెలంగాణల మధ్య రాజకీయంగా తీవ్రమైన ఒత్తిడికి కారణమైంది.అదే ఏడాది జులైలో అనురాధను ఇంటెలిజెన్స్ బాధ్యతల నుంచి తప్పించారు. ఆ సమయంలోనే విజయవాడ సీపీగా ఉన్న ఏబీ వెంకటేశ్వరరావుకు ఇంటెలిజెన్స్ బాధ్యతలు అప్పగించారు.విజయవాడ సీపీగా గౌతమ్ సవాంగ్‌ను నియమించారు. ఏబీ వెంకటేశ్వరరావు ఆ తర్వాత 2019 వరకు ఆయన ఆ పదవిలో కొనసాగారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిఘా విభాగంలో అక్రమాలు జరిగాయంటూ ఆయనపై వైసీపీ ప్రభుత్వం సస్పెన్షన్ వేటు పడింది. ఆయనపై పలు అభియోగాలు నమోదు చేశారువైసీపీ అధికారంలోక వచ్చిన తర్వాత అంతకు ముందు ప్రభుత్వంలో వైసీపీకి వ్యతిరేకంగా జరిగిన పరిణామాలకు ఆయన్ని బాధ్యుడిని చేశారనే ఆరోపణలు ఉన్నాయి. 2014-19 మధ్య కాలంలోగా చంద్రబాబు ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన అధికారులంతా జగన్ హయంలో కీలక బాధ్యతలు దక్కించుకున్నారు. సిఎంఓ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన సతీష్ చంద్ర వంటి అధికారులకు కూడా కీలక పోస్టింగులు దక్కాయి. ఏబీ వెంకటేశ్వరరావు మాత్రం పోస్టింగ్ కోసం వైసీపీ నాయకుల వద్దకు వెళ్లాలని సన్నిహితులు సూచించినా తాను వెళ్లలేదని చెప్పేవారు.ఈ క్రమంలోనే ఏబీ వెంకటేశ్వరరావు దాదాపు నాలుగున్నరేళ్ల పాటు ఎలాంటి పోస్టింగ్ లేకుండా ఉండాల్సి వచ్చింది. 2019-24 మధ్య కాలంలో పోస్టింగ్ కోసం హైకోర్టు, సుప్రీం కోర్టులలో న్యాయ పోరాటం చేయాల్సి వచ్చింది. ఉన్నత పోస్టింగ్‌లో ఉండాల్సిన అధికారి చివరి క్షణం వరకు పోస్టింగ్ కోసం పోరాడారు. చివరకు కోర్టు ఆదేశాలతో చివరి రోజు ప్రింటింగ్ అండ్ స్టేషనరీ విభాగంలో పదవీ విరమణ చేయాల్సి వచ్చింది.టీడీపీ హయంలో 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడానికి ఏబీ వెంకటేశ్వరరావు కారణమనేది వైసీపీ వర్గాల ఆరోపణ. రాజకీయ నిర్ణయాలతో తనకు సంబంధం లేదని ఆయన పలు సందర్భాల్లో ప్రకటించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు ప్రాధాన్యత లభిస్తుందని భావించినా ప్రభుత్వం ఇచ్చిన పోస్టింగ్ స్వీకరించలేదు. ఇటీవల రాజకీయాల్లోకి వస్తున్నట్టు ప్రకటించారు.2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదట్లో కొద్ది నెలల పాటు తెలంగాణ క్యాడర్‌కు చెందిన స్టీఫెన్ రవీంద్ర ఏపీ ఇంటెలిజెన్స్ బాధ్యతలు ఇవ్వాలని జగన్ భావించారు. స్టీఫెన్ బదిలీకి కేంద్ర ప్రభుత్వం నుంచి అమోదం లభించకపోవడం, తెలంగాణలో తగినంత క్యాడర్ స్ట్రెంగ్త్ లేకపోవడంతో ఆయన డిప్యూటేషన్‌కు కేంద్రం అనుమతించలేదు.2019 ఎన్నికల సమయంలో ఈసీ ఆదేశాలతో ఏబీ వెంకటేశ్వరరావును తప్పించి మనీష్ కుమార్ సిన్హాకు ఇంటెలిజెన్స్ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత స్టీఫెన్ రవీంద్ర డిప్యూటేషన్ రాకపోవడంతో నిఘా విభాగం బాధ్యతలు తాత్కలికంగా ఇతరులకు అప్పగించారు. ఆ తర్వాత పిఎస్సార్ ఆంజనేయులుకు అవకాశం లభించింది. ఏపీపీఎస్సీ బాధ్యతలతో పాటు ఇంటెలిజెన్స్ విభాగాన్ని కూడా పర్యవేక్షించారు.పిఎస్సార్ ఆంజనేయులు గతంలో 2010-11లో విజయవాడ పోలీస్ కమిషనర్‌గా పనిచేశారు. అప్పట్లో నాటకీయ పరిణామాల మధ్య విజయవాడ సీపీ బాధ్యతల నుంచి ఆయన్ని తప్పించారు. దీంతో ఆయన కేంద్ర సర్వీసులకు వెళ్లిపోయారు. టీడీపీ నాయకుడు వల్లభనేని వంశీతో తలెత్తిన వివాదాలు చివరకు ఆయన బదిలీకి కారణం అయ్యాయి.అప్పట్లో టీడీపీ నగర అధ్యక్షుడిగా ఉన్న వంశీ వాహనాల కాన్వాయ్‌తో నగరంలో తిరిగే వారు. కాంగ్రెస్ నాయకుడు దేవినేని నెహ్రూకు, వంశీకి రాజకీయ విభేదాలు ఉన్నాయి. టీడీపీలో దేవినేని ఉమా వర్గంతో పడేది కాదు. ఈ క్రమంలో వంశీ కాన్వాయ్‌లో షికార్లకు పిఎస్సార్ బ్రేకులు వేశారు. ఆ తర్వాత కమిషనరేట్‌లో వంశీని కౌన్సిలింగ్‌కు పిలిపించడం చర్చనీయాంశం అయ్యింది.ఈ వివాదాల నడుమ ఓ మహిళా డాక్టర్ అంశం తెరపైకి వచ్చింది. పిఎస్సార్ ఆంజనేయులు మహిళను వేధిస్తున్నారంటూ వల్లభనేని వంశీ వ్యక్తిగత ఆరోపణలు చేయడం,మీడియాలో పెద్ద ఎత్తున వాటిని హైలైట్ చేయడంతో పిఎస్సార్‌ను అప్పటి ప్రభుత్వం బదిలీ చేసింది.ఏపీలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పిఎస్సార్ ఆంజనేయులు అనూహ్యంగా ప్రాధాన్యత పెరిగింది. వైసీపీ నాయకుల ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేశారంటూ టీడీపీ పలు సందర్భాల్లో ఆరోపించింది. టీడీపీ నేతలపై కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం వెనుక పిఎస్సార్ ఉన్నాడని ఆ పార్టీ భావించింది.ఈ క్రమంలో ముంబైకు చెందిన సినీ నటి కాందబరి జెత్వాని వ్యవహారంలో ఆయనపై కేసు నమోదు చేశారు. ఇదే కేసులో విజయవాడ సీపీ కాంతిరాణా తాతా, విశాల్ గున్నీ, ఏసీపీ హనుమంతరావు, సీఐ సత్యనారాయణలపై కూడా కేసు నమోదైంది. ఈ కేసులో పిఎస్సార్ మినహా మిగిలిన వారంతా ముందస్తు బెయిల్ పొందారు. జెత్వానీ వ్యవహారంలో తాను ఏ తప్పు చేయలేదని పిఎస్సార్ చెబుతూ వచ్చారు. అరెస్టైన తర్వాత కూడా కోర్టులో ఇదే వాదించారు. కేసుల విచారణలో తన ప్రమేయం లేదని, తనను ఇరికించారని ఆరోపించారు.ప్రభుత్వాలను నడిపే పాలక పార్టీలు రాష్ట్రంలో జరిగే పరిణామాలను ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ ద్వారా తెలుసుకుంటుంది. ఈ క్రమంలో రాజకీయ కక్ష సాధింపులకు అదే ఇంటెలిజెన్స్ విభాగాన్ని బాధ్యుల్ని చేసే ధోరణి ఏపీలో కొనసాగుతోంది. ఇప్పటికే ఇంటెలిజెన్స్ బాధ్యతలు తమకొద్దని ఐపీఎస్‌లు తప్పుకునే వాతావరణం ఏపీలో వచ్చేసిందని పోలీస్ అధికారులు చెబుతున్నారు

# అన్నదమ్ముల మధ్య 100 కోట్ల దావా

విజయవాడ, ఏప్రిల్ 26

కేశినేని బ్రదర్స్ మధ్య గొడవ ముదురుతోంది. విశాఖలో ఉర్సా కంపెనీకి భూముల కేటాయింపు నేపథ్యంలో విజయవాడ మాజీ ఎంపీ అయిన కేశినేని నాని.. ప్రస్తుత ఎంపీ, సోదరుడు అయిన కేశినేని చిన్నిపై ఇటీవల ఆరోపణలు చేశారు. జవాడ బ్రదర్స్ కేశినేని నాని, కేశినేని చిన్నిల మధ్య యుద్ధం పీక్ కు చేరుకుంది. గత రెండు రోజులుగా కేశినేని నాని చేస్తున్న ఆరోపణలపై ప్రస్తుత విజయవాడ ఎంపీ కేశినాని చిన్ని స్పందించారు. వంద కోట్ల రూపాయల పరిహారం కోరుతూ లీగల్ నోటీసులు పంపారు. అయితే లీగల్ నోటీసులకు కేశినేని నాని స్పందించారు. తాను పది సంవత్సరాల పాటు పార్లమెంటు సభ్యుడిగా పనిచేశానని, జవాబుదారీతనం పారదర్శక,సమగ్రతతో పనిచేశానని చెప్పారు. తాను చేసిన ఆరోపణలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని అన్న కేశినేని నాని తాను మౌనంగా ఉండబోనని, అక్రమాలపై ప్రశ్నలు వేస్తే సమాధానాలు చెప్పకుండాబెదిరింపులకు దిగుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కేశినేని నాని లేఖ కూడా రాశారు. ఈ నేపథ్యంలో వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు.. విదేశీ కంపెనీలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని కేశినేని చిన్ని (కేశినేని శివనాథ్) మండిపడ్డారు. పెట్టుబడులు రాకూడదనే ఉద్దేశంతో విషం చిమ్ముతున్నారంటూ విమర్శించారు. ఈ క్రమంలోనే కేశినేని నానిపై కేశినేని చిన్ని వంద కోట్లకు పరువు నష్టం దావా వేస్తూ లీగల్ నోటీసులు పంపించారు. ఈ నేపథ్యంలో కేశినేని చిన్ని పరువు నష్టం దావాపై కేశినేని నాని స్పందించారు. ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.కేశినేని చిన్ని పంపించిన లీగల్ నోటీసుపై కేశినేని నాని సోషల్ మీడియా ద్వారా కౌంటర్ ఇచ్చారు. రూ. 100 కోట్లు కాదు లక్ష కోట్లకు పరువు నష్టం దావా వేసినా ప్రజల సంపద దోచుకునే వారిపై తన పోరాటం అగదని కేశినేని నాని స్పష్టం చేశారు. విజయవాడ ప్రజలు తనకు పదేళ్లు ఎంపీగా పనిచేసే అవకాశం ఉచ్చారని.. అలాంటి ప్రజల పట్ల తాను జవాబుదారీతనం, పారదర్శకత, నిజాయతీతో ఉంటానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాసిన లేఖలోని ప్రతీ మాటకు తాను కట్టుబడి ఉన్నట్లు కేశినేని నాని స్పష్టం చేశారు.కేశినేని చిన్ని తనకు పంపించింది కేవలం లీగల్ నోటీసు మాత్రమే కాదని.. విమర్శలను బెదిరించడానికి , మౌనంగా ఉంచడానికి, నోరు మూయించడానికి చేస్తున్న ప్రయత్నమని ఆరోపించారు. అయినా తాను మౌనంగా ఉండే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.భూ లావాదేవీలు, పేర్ల దుర్వినియోగం, అక్రమాలపై ఆరోపణలు, ప్రశ్నలు వచ్చినప్పుడు సమాధానాలు చెప్పాలి కానీ బెదిరించడం కాదని ఎద్దేవా చేశారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు తాను దేని కోసం నిలబడ్డానో తెలుసని. తాను భయంతో కాదు, వాస్తవాలతో స్పందిస్తానని పేర్కొన్నారు. సత్యం ఎప్పటికీ బెదిరింపులకు భయపడదన్న కేశినేని నాని.. తాను కూడా భయపడనని, రాజీపడబోనని స్పష్టం చేశారు.

# తిరుమలలో గట్టి నిఘా...

తిరుపతి, ఏప్రిల్ 26

జమ్మూ కశ్మీర్ పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో టీటీడీ అప్రమత్తమైంది. జమ్మూ కశ్మీర్‌లోని ప్రస్తుత పరిస్థితికి తోడు నిఘావర్గాల హెచ్చరికల నేపథ్యంలో శ్రీవారి భక్తుల భద్రత కోసం తిరుమల తిరుపతి దేవస్థానం అనేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా తిరుమలలో క్యాబ్‌లు నడుపుతున్న వారితో టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ హర్షవర్ధన్ రాజు సమావేశమయ్యారు. 400 మంది క్యాబ్ డ్రైవర్లు, 50 మంది యజమానులతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో.. ఆలయ పరిసరాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలపై వారికి అవగాహన కల్పించారు. తిరుమలలో భక్తుల భద్రతకు సంబంధించి డ్రైవర్లది కీలకమైన పాత్ర అని హర్షవర్ధన్ రాజు తెలిపారు.తిరుమలలో క్యాబ్‌లు, వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే నిషేధిత వస్తువులను తిరుమలకు తీసుకురాకూడదని టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ హర్షవర్ధన్ రాజు స్పష్టం చేశారు. నిషేధిత వస్తువులను ఎవరైనా తీసుకువచ్చినట్లు గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. తిరుమలలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. దొంగలు, నేరస్థులు తమ వాహనాలను ఎక్కినట్లు క్యాబ్ డ్రైవర్లు గుర్తిస్తే పోలీసులకు కానీ, డయల్ 112కు గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. తిరుమలలో ప్రతి ఒక్కరూ ఓ సైనికుడిలా పనిచేయాలని.. తమ దృష్టికి ఎలాంటి అనుమానాస్పద సమాచారం వచ్చినా పోలీసులకు తెలియజేయాలని సూచించారు.మరోవైపు పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో తిరుమలలో భద్రతా దళాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఉగ్రవాదులు చొరబడితే ఏం చేయాలి, ఎలా వ్యవహరించాలనే దానిపై టీటీడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. భక్తులను ఎలా రక్షించాలనే దానిపై తిరుమల లేపాక్షి సర్కిల్ వద్ద ఉన్న సుదర్శన్ సత్రంలో భద్రతా దళాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఒకటిన్నర గంటపాటు ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్‌లో ఆక్టోపస్ కమాండోలు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, పోలీసులు, ఏపీఎస్పీ సిబ్బంది పాలుపంచుకున్నారు. ఉగ్రదాడి జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే దానిపై టీటీడీ నిఘా, భద్రతా సిబ్బందితో పాటుగా సివిల్, రిజర్వు పోలీసులకు, ఆలయ సిబ్బందికి వివరించారు.

# ప్రైవేటు బస్సు బోల్తా.. ప్రయాణికులకు స్వల్ప గాయాలు

నరసరావుపేట

నరసరావుపేట శివారు శాంతి నగర్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్ నుండి చీరాల వెళుతుండగా జరిగిన ప్రమాదం జరిగింది. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, నరసరావుపేట డిఎస్పీ , నాగేశ్వరరావు,ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

# కరోనా నుంచి కోలుకోని మెట్రో...

హైదరాబాద్, ఏప్రిల్ 26,

హైదరాబాద్ నగర ప్రజల నుంచి విశేషమైన ఆదరణ పొందినప్పటికీ.. మెట్రో రైల్ ఆర్థికంగా కుదేలవ్వడానికి అనేక కారణాలు ఉన్నాయి. 2020-21 మధ్య ప్రపంచాన్ని వణికించిన కోవిడ్-19 మహమ్మారి సమయంలో విధించిన లాక్‌డౌన్ కారణంగా దాదాపు ఒక సంవత్సరం పాటు మెట్రో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ సమయంలో ప్రయాణికుల రాకపోకలు పూర్తిగా స్తంభించడంతో ఆదాయం భారీగా పడిపోయింది.మరోవైపు.. మెట్రో ప్రాజెక్ట్ కోసం తీసుకున్న భారీ రుణాల చెల్లింపుల భారం సంస్థపై తీవ్రంగా ఉంది. వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలకు అధిక వడ్డీలు చెల్లించాల్సి రావడంతో ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. ప్రయాణికుల సంఖ్య కోవిడ్ ముందు స్థాయికి చేరుకోవడానికి దాదాపు రెండేళ్లు పట్టడం కూడా నష్టాలకు ఒక ప్రధాన కారణం.

ఈ అంశాలన్నీ కలిసి మెట్రోకు రూ. 4,828.55 కోట్ల నష్టం వాటిల్లిందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. గతేడాది మెట్రో తన కొన్ని ఆస్తులను తాకట్టు పెట్టడం ద్వారా కొంతమేరకు ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నించింది.టికెట్ల విక్రయం.. ప్రకటనల ద్వారా మెట్రో సుమారు రూ.1400 కోట్ల ఆదాయం పొందినప్పటికీ.. చెల్లించాల్సిన అధిక వడ్డీలు ఈ ఆదాయాన్ని మించిపోతున్నాయి. దీంతో మెట్రో నిరంతరం భారీ నష్టాల్లో కూరుకుపోతోంది. భవిష్యత్తులో ఈ ఆర్థిక సంక్షోభం నుంచి హైదరాబాద్ మెట్రో ఎలా బయటపడుతుందో చూడాల్సి ఉంది. ప్రభుత్వం లేదా ఎల్ అండ్ టీ సంస్థ నుంచి ఎలాంటి సహాయం అందుతుందో వేచి చూడాలి. ఈ నేపథ్యంలోనే.. మెట్రో టికెట్ ధరలు పెంచనున్నారన్న వార్తలు వైరల్ అవుతుండగా.. అలా అయినా నష్టాలను కొంతమేర పూడ్చొచ్చన్న ఆలోచన చేస్తున్నట్టుగా సమాచారం.

# ఉత్తరాంధ్రలో కోలుకొనేది ఎలా

విశాఖపట్టణం, ఏప్రిల్ 26,

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్రలో కోలుకునే పరిస్థితులు కనిపించడం లేదు. అక్కడి నేతలు కూడా పెద్దగా యాక్టివ్ గా లేరు. శాసనమండలిలో నేతగా ఉన్న బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మినహా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి ఏ వైసీపీనేత వాయిస్ వినిపించడం లేదు. ఎందుకో తెలియదు కానీ.. మొదటి నుంచి అంటే ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటి నుంచి సౌండ్ లేకుండా పోయింది. తమ్మినేని సీతారాం, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ తో పాటు పలువురు కీలక నేతలు ఈ ప్రాంతంలో ఉన్నప్పటికీ వారు పెద్దగా యాక్టివ్ గా లేకపోవడంతో అసలు ఉత్తరాంధ్రలో పార్టీ ఉందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి ఉత్తరాంధ్రలో 2019 ఎన్నికల్లో గణనీయమైన ఫలితాలను సాధించిన ఫ్యాన్ పార్టీ 2024 ఎన్నికలకు వచ్చేసరికి పూర్తిగా డీలా పడిపోయింది. విశాఖను రాజధానిగా ప్రకటించినప్పటికీ అక్కడి ప్రజలు ఏ మాత్రం సానుకూలంగా వైసీపీ పక్షాన నిలవలేదు. భూ కబ్జాలు, ఆక్రమణలతో పాటు అనేక విషయాలు పార్టీకి ఓటమిని తెచ్చి పెట్టాయన్న అభిప్రాయం వైసీపీలోనే వ్యక్తమవుతుంది. ఇచ్ఛాపురం నుంచి విశాఖ వరకూ కూటమి పార్టీలు దాదాపుగా క్లీన్ స్వీప్ చేశాయనే చెప్పాలి. శ్రీకాకుళంలో పది, విజయనగరంలో తొమ్మిది, విశాఖలో పదిహేను శాసనసభ నియోజకవర్గాలు ఉండగా మొత్తం ముప్ఫయి నాలుగు స్థానాలుండగా మొన్నటి ఎన్నికల్లో కూటమికి మూడు జిల్లాల్లో ముప్ఫయి రెండు స్థానాలు రాగా, వైసీపీకి కేవలం రెండు స్థానాలు మాత్రమే వచ్చాయి. అది కూడా ఎస్.టి నియోజకవర్గాలే కావడం గమనార్హం. ఈసారి ఈప్రాంతంలో నియోజకవర్గాలు పెరిగే అవకాశముంది. ఇటీవల మాజీ మంత్రి కన్నబాబును ఉత్తరాంధ్ర జిల్లాలకు జగన్ కన్వీనర్ గా నియమించారు. అయితే ఈ ప్రాంతంలో ఎక్కువ మంది సీనియర్ నేతలుండటంతో వారిని కలుపుకుని పోవడం కూడా కన్నబాబుకు కష్టంగా మారిందంటున్నారు. అదే సమయంలో సీనియర్ నేతలు ఎవరూ పార్టీకి కష్టపడి పనిచేసి పూర్వ వైభవం తేవాలన్న ఉద్దేశ్యంలో అయితే మాత్రం లేరనే అర్థమవుతుంది. తమకు విశ్రాంతి దొరికిందని ఇంట్లోనో, లేక హైదరాబాద్ లోనో విశ్రాంతి తీసుకుంటున్నారు తప్పించి పార్టీని తిరిగి నిలబెట్టే ప్రయత్నం చేయడం లేదు. కూటమి పార్టీల్లో ఉన్న లొసుగులను కూడా వారు తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేయడం లేదంటే వారు ఎంతటి నిరాసక్తతలో ఉన్నారో చెప్పకనే అర్థమవుతుంది. విశాఖపట్నంలో అతి తక్కువ ధరకు భూములను కొత్తకంపెనీకి అప్పజెప్పినా కనీసం ఉద్యమం చేయాలన్న ధ్యాస వారిలో కనిపించ లేదంటే వారు ఏ పరిస్థితుల్లో ఉన్నారో అర్థమవుతుంది. అధికారంలో ఉండగా అంతా మాదే అన్నట్లు వ్యవహరించిన వారు సయితం ఇప్పుడు మొహం చాటేస్తున్నారు. ఈ పరిస్థితిపై కనీసం వైఎస్ జగన్ కూడా ఫోకస్ పెట్టడం లేదు. వస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గాలి వీస్తుందని, ఒక ప్రాంతంలో వచ్చి మరొక ప్రాంతంలో మరొకలా ఉండదని జగన్ భావించి లెక్కలు వేసుకుని మౌనంగానే ఉంటున్నారని తెలిసింది. జగన్ కామ్ గా ఉన్న వైనాన్ని చూసి నేతలు ఎవరూ బయటకు అస్సలు రాకపోవడంతో ఉత్తరాంధ్రలో వైసీపీ పూర్తిగా పడకేసిందన్నది వాస్తవం.

# రాహుల్ గాంధీ హైదరాబాద్ రాకను ఎద్దేవా చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ ఏప్రిల్ 26,

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఎద్దేవా చేసారు. ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీకి ప్రశ్నల వర్షం కురిపించారు. దారితప్పి తెలంగాణకు వస్తున్న ఎన్నికల గాంధీకి స్వాగతం..” అంటూ ఎద్దేవా చేసారు. మోసపూరిత హామీలు, అబద్ధపు వాగ్దానాలతో తెలంగాణ ప్రజలను రాహుల్ గాంధీ మోసగించారని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేసారు. హైదరాబాద్ పర్యటనలో లాఠీ దెబ్బలు తిన్న సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులను రాహుల్ గాంధీ పరామర్శించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం 16 నెలల పాలనలో ప్రజలను రాచిరంపాన పెట్టింది. హైడ్రా, మూసీ పేరుతో ప్రజల మీదికి బుల్డోజర్లు పంపింది. లగచర్ల బంజారా ఆడబిడ్డలపై అర్ధరాత్రి వేళ అఘాయిత్యాలకు ఒడిగట్టింది. సర్కారు దుశ్చర్యకు అడ్డంకిగా ఉన్నారని బంజారా యువతపై థర్డ్ డిగ్రీ ప్రయోగించింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగించిన ఈ రాక్షసకాండను జాతీయ మానవ హక్కుల కమిషన్ నిర్ధారించింది. కరెంట్ పోయిందని సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే అరెస్టులు.. వేధింపులు.. బెదిరింపులని అన్నారు.

పచ్చని అడవిని సర్వనాశనం చేస్తున్నారని సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు నిరసనకు దిగితే వారిపై లాఠీల వోతలు.. అక్రమ కేసులు పెట్టారు. తెలంగాణ ప్రజలు సోనియాగాంధీని, ప్రియాంకా గాంధీని, రాహుల్ గాంధీని నమ్మి అధికారమిస్తే ఉమ్మడి రాష్ట్రంలో కన్నా తీవ్ర నిర్బంధం, అణచివేతను బహుమతిగా ఇచ్చారు. బిహార్ లో గ్రూప్ -1 బాధితుల గోడు వినాలని వారి పక్షాన గళమెత్తిన మీరు.. తెలంగాణలో గ్రూప్ -1 అభ్యర్థుల ఆందోళనలపై ఎందుకు మౌనంగా ఉన్నారు? రాహుల్ గాంధీ, సోనియా గాంధీ గారు ఇచ్చిన ఆరు గ్యారంటీల పరిస్థితి ఏమిటి ? రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని సగానికే పరిమితం చేశారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన రైతుబంధు పథకానికి తూట్లు పొడిచి ఆ పథకాన్ని నిర్వీర్యం చేశారు.. అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీయరెందుకు? కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఏమైంది? మహిళలకు నెలకు రూ.2500 ఏమయ్యాయి? 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు ఎప్పుడు ఇస్తారు ? ఆరు గ్యారంటీలు, 420 హామీలను ఎప్పుడు అమలు చేస్తారు? ఎర్ర బుక్కు పట్టుకుని రాజ్యాంగాన్ని రక్షించాలంటూ దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానవ హక్కులను మంటకలుపుతూ.. దమనకాండ కొనసాగిస్తూ.. ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు.. ? మీ మౌనం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

# శాంతిభద్రతలను పరిరక్షించటమే మాబ్ ఆపరేషన్ డ్రిల్ ముఖ్య లక్ష్యం. : పెద్దపల్లి డీసీపీ కరుణాకర్

గోదావరిఖని:

అక్రమంగా గుమ్మిగుడిన జన సమూహాలను కంట్రోల్ చేయుటకు, అవాంఛనీయ సంఘటనలు పోలీసుల దృష్టికి వచ్చినప్పుడు, (144) 163(బి ఎన్ ఎస్ ఎస్) సెక్షన్ అమల్లో ఉన్న సందర్భంలో ప్రజల శాంతి భద్రతల నేపథ్యంలో పోలీసులు ఏ విధంగా స్పందించాలి, అక్రమ జన సమూహాలను ఏ విధంగా చెదరగొట్టాలి అనే వ్యూహంలో భాగంగా రామగుండము పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రామగుండము గోదావరిఖని లోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియం గ్రౌండ్ లో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ ఆధ్వర్యంలో గోదావరిఖని సబ్ డివిజన్ గోదావరిఖని 1 టౌన్, రామగుండంసర్కిల్ సివిల్ పోలీసులకు మాబ్ ఆపరేషన్-మాక్ డ్రిల్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఈ కార్యక్రమం కు పెద్దపల్లి డిసిపి కరుణాకర్ ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బంది తో మాట్లాడారు.

ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ....ప్రజల, ప్రభుత్వ ఆస్తులు ద్వంసం చేస్తూ విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ, జన సమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను ఎలా నియంత్రించాలన్న వాటిపై మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ప్రాక్టీస్ ముఖ్య ఉద్దేశాన్ని సిబ్బందికి డీసీపీ గారు వివరించారు. మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశం శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు, ఘర్షణలు తలెత్తినప్పుడు శాంతిభద్రతలను పరిరక్షించడానికి పోలీస్ శాఖ ఎలా వ్యవహరిస్తుంది? ఘర్షణలకు పాల్పడిన వారిపై ఏవిధంగా చర్యలు తీసుకుంటారు? అనే దాని గురించి అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించినట్లు డీసీపీ చెప్పారు.

మాబ్ ఆపరేషన్ డ్రిల్ లో ఓ వైపు ప్లకార్డులు చేతపట్టిన ఆందోళనకారులు, అల్లరి మూకలు మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు జన సమూహాలను కంట్రోల్ చేసేందుకు మొదటగా హెచ్చరికలు వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతి, ఉన్నతాధికారుల అనుమతితో భాష్పవాయువు ప్రయోగించడం, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ వారిపై ప్రయోగించడం, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీ ఛార్జీ చేపట్టడం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయడం అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం వంటివి ఆర్ ఎస్ఐ శివ కుమార్, హెడ్ కానిస్టేబుల్ రఫీ లు సివిల్ సిబ్బందితో ప్రాక్టీస్ చేపించడం జరిగింది.

ఈ కార్యక్రమం లో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి, రవీందర్ రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు, గోదావరిఖని సబ్ గోదావరిఖని ఎస్ఐ రమేష్, భూమేష్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, మానస, రామగుండం ఎస్ఐ సంధ్య రాణి, అంతర్గం ఎస్ఐ వెంకట్, ఆర్ఎస్ఐ శివ కుమార్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇక బడా నేతలే...

తిరుపతి, ఏప్రిల్ 26,

ఏపీలో కూటమి సర్కార్ దూకుడు పెంచింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, నేరాలు-ఘోరాలను వెలికితీసేందుకు యాక్షన్ ప్లాన్ ను స్పీడప్ చేసిందని పొలిటికల్ సర్కిల్స్ లో చర్చ నడుస్తోంది. దీంతో కూటమి సర్కార్ కొలువైన దగ్గరి నుంచే వైసీపీ అవినీతి గుట్టలను బద్దలు కొడుతూ ఒక్కో రాయిని పెకిలించి వేస్తోంది. అలా ఇప్పటివరకు అనేక కేసుల్లో ఇరుక్కున్న విపక్షానికి చెందిన నేతలను అరెస్ట్ చేస్తూ వస్తున్నారు పోలీసులు. ఏపీలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో మొదలైన అరెస్టుల పర్వం ఇంకా కంటిన్యూగా కొనసాగుతోంది. పిన్నెల్లితో పాటు నందిగం సురేష్, వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళి, బోరుగడ్డ అనిల్, మాజీ వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ వంటి వారు అరెస్ట్ అయ్యారు. ఇందులో కొందరు ప్రస్తుతం రిమాండ్ లో ఉన్నారు. మరికొందరు మాజీలు అరెస్టు భయంతో కోర్టుల చుటూ తిరుగుతున్నారు. ఇప్పటికే మాజీ మంత్రి విడదల రజినిపై ఉన్న కేసులో ఆమె మరిది గోపిని అరెస్టు చేశారు. అలాగే మాజీ ఇంటిలిజెన్స్ చీఫ్ ఖూఫీ ఆంజనేయులును నటి జత్వాని కేసులో అరెస్టు చేసి రిమాండ్ కి పంపారు పోలీసులు. ఇక లిక్కర్ స్కాం కేసులో ఇప్పటికే కీలక సూత్రధారి అయిన కేసిరెడ్డిని అరెస్ట్ చేసిన సిట్ అధికారులు ఈ కేసులో 8వ నిందితుడిగా ఉనన కేసిరెడ్డి తోడల్లుడు బూనేటి చాణక్యని కూడా అరెస్ట్ చేశారు సిట్ అధికారులు. వసూళ్లు చేసిన కమిషన్ల మొత్తాన్ని చాణక్య?రాజ్ కసిరెడ్డికి అందించేవారని..అక్కడి నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ సాయిరెడ్డి, భారతి సిమెంట్స్ లో పనిచేసే బాలాజీ, అలాగే వైఎస్ అనిల్ రెడ్డికు చేరేవని సిట్ విచారణలో తేలిందట. వీరి ద్వారా వివిధ రూపాల్లో కమిషన్లు.. అంతిమంగా అప్పటి సీఎం జగన్‌కు చేరేవని సిట్ విచారణలో తేలిందని సమాచారం. అయితే బూనేటి చాణక్య రిమాండ్ రిపోర్టులో అనేక సంచలన అంశాలు పొందుపరిచారట సిట్ అధికారులు. దాని ప్రకారం..వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 2019 తొలినాళ్లలో హైదరాబాద్‌లోని ఓ హోటల్లో సజ్జల శ్రీధర్ రెడ్డి నేతృత్వంలో ఒక భేటీ జరిగిందట. మద్యం కుంభకోణానికి అక్కడే బీజం పడిందట. ఇక రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డిని గురువారంనాడు సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. కేసులో 3నెలల క్రితం సబ్ కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడైన అప్పటి ఆర్డీవో మురళి ఏసీబీ అదుపులో ఉన్నారు. పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డి పట్టుబడడంతో త్వరలో మరిన్ని పెద్దతలకాయలను సీఐడీ పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉందని టాక్. పెద్దిరెడ్డితో పాటు ఆయన కుమారుడు, ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన సోదరుడు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకానాథరెడ్డిని అదుపులోకి తీసుకోవచ్చున్న టాక్ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది. ముఖ్యంగా మాజీ మంత్రి విడదల రజిని, కాకాణి గోవర్ధన్ రెడ్డిలపై కేసులు నమోదు అవ్వడంతో త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉందంటూ పొలిటికల్ సర్కిల్స్ లో చర్చ నడుస్తోంది. అలాగే లిక్కర్ స్కాంలో మిథున్ రెడ్డి అరెస్ట్ అయ్యే ఛాన్స్ ఉందని సమాచారం. అయితే ఈ అరెస్టులతో కూటమి సర్కార్ రాజకీయాలకు..ఓ రకమైన సందేశం ఇస్తుందా అనే చర్చ జరుగుతోంది. ఎందుకంటే ఒకప్పుడు నేతల మధ్య మాటల యుద్ధం అంటే రాజకీయంగా ఉండేది.

కొంతకాలంగా రాజకీయమే యుద్ధంగా మారుతోందట. వ్యక్తిగత విషయాలను టార్గెట్ చేస్తూ..వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు కొందరు నేతలు. ఇక వాళ్లు వాడే భాష జుగుప్సాకరం, అనభ్యకరం, అభ్యంతకరంగా ఉందన్నది మరికొందరి అభిప్రాయం. దీంతో సింపథీ వర్కౌట్ కాకపోగా..ఒకరకమైన చర్చ జనాల్లో మొదలవుతోంది. దీంతో ఇలాంటి ఇక చెల్లవ్ అని పరోక్షంగా చెప్పేందుకే..వరుస అరెస్టులు జరుగుతున్నాయా అనేది మరికొందరి వాదన. మొత్తానికి ఏపీలోని ప్రతిపక్ష నేతలకు అరెస్టుల భయం పట్టుకుందట. ఏ రోజు.. ఏ క్షణంలో తమ చేతులకు పోలీస్ సంకెళ్లు పడతాయోనని తెగ టెన్షన్ పడుతున్నారట. తాజాగా అరెస్టుల పర్వం మరోసారి స్పీడప్ కావడంతో విపక్ష నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయట. అయితే తొలుత చిన్న లీడర్లను అరెస్ట్ చేస్తున్న పోలీసులు?వారిచ్చే కీలక సమాచారంతో బిగ్ లీడర్స్ టార్గెట్ గా పావులు కదుపుతున్నారట. వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాల కేసుల్లో రాబోయే రోజుల్లో బిగ్ షాట్స్ అరెస్ట్ తప్పదనే చర్చ నడుస్తోంది. దీంతో నెక్ట్స్ టార్గెట్ ఎవరు? నెక్ట్స్ అరెస్ట్ ఎవరిదంటూ ఏపీ పొలిటికల్ సర్కిల్స్ లో తెగ చర్చ నడుస్తోందట.

# భగీరధ కాలనీగా మారిన పాకిస్తాన్ కాలనీ

విజయవాడ, ఏప్రిల్ 26,

ఏపీలో( పాకిస్తాన్ పేరుతో ఒక కాలనీ ఉంది. మీరు వింటున్నది నిజమే. విజయవాడలోని పాకిస్తాన్ కాలనీపేరుతో ఒక ప్రాంతం ఉంది. ఎప్పటినుంచో ఆ పేరు కొనసాగుతోంది. అయితే ఆ పేరు మార్చాలని స్థానికులు చాలా ఏళ్లుగా కోరుతూ వస్తున్నారు. కానీ ఎట్టకేలకు వారి విన్నపాన్ని మన్నించింది ఏపీ ప్రభుత్వం. ఆ కాలనీ పేరును మార్చింది. స్థానికులకు ఇష్టమైన మరో పేరును ప్రకటించింది. విజయవాడలోని 62వ డివిజన్ పరిధిలో ఈ పాకిస్తాన్ కాలనీ ఉంది. ఆ కాలనీ పేరును తాజాగా మార్చారు. భగీరథ కాలనీగా నామకరణం చేశారు. అదే సమయంలో స్థానికుల ఆధార్ చిరునామాను సైతం మార్చినట్లు జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రకటించారు.

దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. పాకిస్తాన్ కాలనీగా ఉన్న ఈ కాలనీ పేరు మార్చాలని గత కొద్ది రోజులుగా స్థానికులు డిమాండ్ చేస్తూ వచ్చారు. ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులకు విన్నపాలు చేసేవారు. ఎట్టకేలకు ఆ పేరు మార్పు సహకారం అయింది. పాకిస్తాన్ కాలనీ పేరు వెనక చాలా చరిత్ర ఉంది. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్తాన్ పై భారత్ విజయం సాధించింది. ఆ తరువాత పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయింది. ఆ సమయంలో ఈరుద్దేశాల సరిహద్దుల్లో ఎన్నో కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. అప్పట్లో కొన్ని కుటుంబాలు ఇండియాకు వచ్చి తలదాచుకున్నాయి. అటువంటి సమయంలోనే 40 కుటుంబాలతో విజయవాడలోని పాయకాపురంలో ఈ కాలనీ ఏర్పాటు అయింది. 1984లో 40 గృహాలు, మూడు రోడ్లతో నిర్మించిన ఈ కాలనీకి పాకిస్తాన్ కాలనీగా పేరు పెట్టారనే ఒక వాదన ఉంది. ఇక్కడ మరో రకమైన ప్రచారం కూడా జరుగుతోంది. దేశ విభజన సమయంలో కొన్ని కుటుంబాలు నిర్వాసితులుగా, శరణార్థులుగా.. పాకిస్తాన్ లోని సింధు ప్రావిన్స్ నుంచి గుజరాత్ మీదుగా భారత్ లోకి వచ్చారని చెబుతున్నారు. వందలాది కుటుంబాలు వలస వచ్చాయని.. చెన్నై కోల్కత్తా రైలు మార్గంలో ఉన్న విజయవాడ ప్రధాన కూడలిగా ఉండడంతో.. ఈ కుటుంబాలన్నీ ఇక్కడకు వచ్చాయని ఒక ప్రచారం. అలా ఇక్కడ స్థిరపడడంతో పాకిస్తాన్ కాలనీ పేరిట గృహ సముదాయాన్ని ఏర్పాటు చేసుకున్నారనేది ఒక కథనం. అయితే దశాబ్దాల కిందట వచ్చిన వీరు స్థానికులతో కలిసి పోయారు. ఎక్కడి వారు గా మారిపోయారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత పాకిస్తాన్ కాలనీ కాస్త భగీరథ కాలనీగా మారింది. కొత్త పేరుతో ఈ ప్రాంతంలో నివాసం ఉండే దాదాపు 60 మందికి ఆధార్లో అడ్రస్ మార్చినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ తెలిపారు. గత కొన్నేళు ్లగా ఈ కాలనీ పేరు మార్చాలని కోరుతూ స్థానికులతో పాటు రాష్ట్ర సగర్ రాజపుత్ సేవా సమితి సభ్యులు పోరాడుతూ వచ్చారు. దానికి స్పందిస్తూ ప్రభుత్వం కాలనీ పేరు మార్చుతూ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అయితే దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పేరు మార్పుతో.. స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ బస్సును నడిపించాలని ప్రభుత్వ విప్ కు వినతి

# లాంఛనంగా ఆర్టీసీ బస్సును ప్రారంభించనున్న అడ్లూరి

పెగడపల్లి

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని రాములపల్లి, నంచర్ల, దేవికొండ, వెంగళాయి పేట గ్రామాల నుండి పెగడపల్లి మోడల్ స్కూల్ వరకు సోమవారం నుండి ఆర్టీసీ బస్సును నడపనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు కేటాయించిన ఆర్టీసీ బస్సును నంచర్ల ఎక్స్ రోడ్ కమాన్ వద్ద ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆర్టీసీ బస్సును లాంఛనంగా ప్రారంభించి, నంచర్ల వరకు ప్రయాణించనున్నారని ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ తెలిపారు. గత కొన్ని సంవత్సరాల నుండి ఈ గ్రామాలకు ఆర్టిసి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించి సమస్యను పరిష్కరించాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులను ఆయా గ్రామాల ప్రజలు కోరగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పెగడపల్లి ఏఎంసి చైర్మన్ బుర్ర రాములు గౌడ్ ధర్మపురి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ను జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలో కలిసి

జగిత్యాల నుండి గొల్లపల్లి మీదుగా రాములపల్లి, నంచర్ల, దేవికొండ, వెంగళాయి పేట గ్రామాల నుండి పెగడపల్లి మోడల్ స్కూలు వరకు ఆర్టీసీ బస్సును నడిపించాలని వినతి పత్రం అందజేసి కోరగా, వెంటనే స్పందించిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ టీజీఎస్ఆర్టిసి జగిత్యాల డిపో మేనేజర్ కు ఫోన్ లో మాట్లాడి లెటర్ ఎండార్స్ చేసి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. సోమవారం నుండి ఉదయం 9:30 కి సాయంత్రం 5:30 కి ఆర్టీసీ బస్సును నడిపిస్తామని జగిత్యాల డిపో మేనేజర్ తెలిపారు. ప్రభుత్వ విప్ అడ్లూరి ఎండార్స్ చేసిన వినతి పత్రాన్ని మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ జగిత్యాల డిపో మేనేజర్ కు వినతి పత్రాన్ని అందజేశారు.

టీజీఎస్ఆర్టిసి జగిత్యాల డిపో మేనేజర్ కు బస్సును నడిపించాలని ఆదేశించి, బస్సు సౌకర్యం కల్పిస్తున్న ధర్మపురి శాసనసభ్యులు ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ కు దేవికొండ, నంచర్ల, రాములపల్లి, వెంగళాయి పేట, పెగడపల్లి గ్రామాల ప్రజల పక్షాన పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఒరుగల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంధి మల్లారెడ్డి, చాట్ల విజయభాస్కర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కడారి తిరుపతి, పూసాల తిరుపతి, ఏఎంసి డైరెక్టర్లు చెట్ల కిషన్, లింగంపల్లి మహేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# కాలువలోకి దూసుకెళ్లిన శ్రీ సిటీ కంపెనీ బస్సు

నాగలాపురం(మ) వేమ్బాకం పంచాయతీ హెచ్‌ఎసీ కాలనీ సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. శ్రీసిటీలోని ఓ కంపెనీ బస్సు రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. వాహనంలో 30 మంది ఉండగా 10 మందికి స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ అరవింద్ అతివేగమే ప్రమాదానికి ఎస్ఐ సునీల్ తెలిపారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

# పాయకరావుపేటలో మంత్రి అనిత పర్యటన

అనకాపల్లి

శనివారం నాడు పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి అనిత పర్యటించారు. కోటఉరట్ల మండలం రామచంద్రపురం గ్రామంలో దుర్గా గాయిత్రి దేవి అమ్మవారిని దర్శించికున్న హోం మంత్రి అనితకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. పందూరు గ్రామంలో 5 కోట్ల 75 లక్షల నిధులతో నిర్మిస్తున్న బ్రిడ్జిని శంకుస్థాపన చేసారు. గత కొన్ని సంవత్సరాలగా బ్రిడ్జి లేక పందూరు,పాత గొట్టివాడ,ములగలలోవ గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పందూరు బ్రిడ్జికి శంకుస్థాపన చేయడంతో హోం మంత్రి అనిత కు మూడు గ్రామాల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. తరువాత నక్కపల్లిలో మత్స్యకార భరోసా భృతి పంపిణీ చేసారు.

# గుడివాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సస్పెన్షన్.

గుడివాడఏరియా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఇందిరాదేవిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సస్పెండ్ చేశారు. విధులకు హాజరు కాకుండానే హాజరైనట్టుగా. రిజిస్టర్లో సంతకాలు చేసినట్టు అవినీతి నిరోదక శాఖ (ఏసీబీ) ప్రాథమిక విచారణలో తేలడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఇందిరాదేవి విదులకు హాజరుకాకుండానే రిజిస్టర్లో సంతకం చేస్తున్నారని ఓ వ్యక్తి ఇచ్చిన పిర్యాదు ఆధారంగా డీఎస్ఏచ్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. గత ఏడాది జనవరి-మార్చిలో పలు విడతల్లో 22 రోజుల పాటు ఆమె విధులకు హాజరు కాలేదని తేలింది. ఆయా రోజుల్లో ఇందిరాదేవి సంతకాలతో పాటు ముఖ ఆధారిత విధానం (ఎస్ఆర్ఎస్) ద్వారా కూడా హాజరు నమోదు చేసినట్లు గుర్తించారు. ఎస్ఆర్ఎస్ ద్వారా ఆయా రోజుల్లో సూపరింటెండెంట్ మచిలీపట్నంలో ఒకరోజు, విశాఖపట్నంలో 10 రోజులున్నట్లు నిర్ధారణ అయ్యింది. దీనిపై ఇందిరాదేవి.. రాష్ట్ర వైద్యశాఖ అధికారులకు ఇచ్చిన రాతపూర్వక వివరణ సమంజసంగా లేకపోవడంతో ఆమెను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాలిచ్చారు.

భారత శక్తి



## హిందూవుల భారీ ర్యాలీ

కొత్తగూడెం

పాకిస్తాన్ కు వ్యతిరేకంగా కాశ్మీర్ లోని పహేల్గాం లో హిందువులపై ఉగ్రవాదులు జరిపినటువంటి కాల్పులకు వ్యతిరేకంగా ఆ యొక్క దాడిని ఖండిస్తూ ఈరోజు కొత్తగూడెంలో భారీ ఎత్తున హిందూ సమాజం ఓల్డ్ డిపో నుంచి ర్యాలీ మొదలుకొని గణేష్ టెంపుల్ రైతు బజార్ సూపర్ బజార్ వద్ద మానవహారం నిర్వహించి బస్టాండ్ మీదుగా పోస్ట్ ఆఫీస్ సెంటర్ వరకు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున నినాదాలు ఇస్తూ సెక్యులర్ ముసుగులో హిందువులను అణచివేస్తున్నారు అంటూ ప్లకార్డ్లతో పెద్ద బజారు చిన్న బజారు వ్యాపారస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నున్న పోలీసు స్టేషన్ పరిదిలోని వాంబే కాలనీలో కార్డన్ & సెర్చ్.

ఎన్.టి.ఆర్.జిల్లా

శాంతి భద్రతలు పరిరక్షణ చర్యలలో భాగంగా, సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురిచేసే వారిని గుర్తించే దిశగా ప్రజలకు మేమున్నాము అనే భరోసా ఇచ్చేందుకు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, ఆదేశాల మేరకు ఇన్ చార్జ్ డి.సి.పి. జి. గుణ్ణం రామకృష్ణ, నార్త్ ఏ.సి.పి. డా.కె. స్రవంతి రాయ్, పశ్చిమ జోన్ ఇన్స్పెక్టర్లు కృష్ణ మోహన్ , బి.వెంకటేశ్వర్లు, లక్ష్మి నారాయణ, చిన్న కొండల రావు, గురుప్రకాష్ వారి సిబ్బందితో మొత్తం 100 మంది అధికారులు మరియు సిబ్బందితో కలిసి ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమిషనరేట్ లోని నార్త్ డివిజన్, నున్న పోలీసు స్టేషన్ పరిదిలోని వాంబేకాలనీ ఎ బ్లాక్ పరిసర ప్రాంతాలలో ఈ రోజు తెల్లవారుజము 05.00 గంటల నుండి 08.00 కార్డన్ ఁ సెర్చ్ నిర్వహించడం జరిగింది.

ఈ తనిఖీలలో 73 వాహనాలను తనిఖీ చేయగా సరైన పత్రాలు లేని 16 వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. సుమారు 512 ఫ్లాట్ లను మరియు 1042 మంది నివాసితులను తనిఖీ చేసి వారిలో ఐరిస్ వాహనం ద్వారా 83 మందిని తనిఖీ చేసి ఇద్దరు రౌడీ షీటర్లు, ఒక క్రైమ్ సస్పెక్ట్ షీటర్ మరియు ఇద్ధరు పాత కేసులలో నింధితులను మొత్తం 5 మందిని గుర్తించడం జరిగింది.

ఈ సందర్భంగా ఏ.డి.సి.పి. శ్రీ గుణ్ణం రామకృష్ణ గారు మాట్లాడుతూ.... నగర పోలీసు కమిషనర్ గారి ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని గుర్తించబడిన పరిసర ప్రాంతాలలో అణువణువు, క్షుణ్ణంగా సోదాలు చేయడం జరుగుతుందని, గంజాయి, ఇతర మత్తు పధార్ధాల విక్రయాలు మరియు వినియోగంపై, అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీయడం జరిగిందని, శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, రాత్రి సమయాలలో చిన్న చిన్న సంఘటనలు పెద్ద సంఘటనలుగా ప్రజల్లో వ్యాప్తి చెందుతుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి ప్రతి రోజూ అన్నీ ముఖ్య ప్రదేశాలలో కార్డన్ ఁ సెర్చ్, ఆకస్మిక తనిఖీలు, వాహన తనిఖీలు, డ్రంక్ ఁ డ్రైవ్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగ్తుందని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి ఘర్షణలకు ఆస్కారం లేకుండా, అసత్య ప్రచారాలు నియంత్రించేలా పోలీసులు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇకనుంచి తరచుగా కార్డరన్ సెర్చ్ నిర్వహించడంతోపాటు అన్ని ప్రాంతాల్లో తనిఖీలు డ్రంక్ అండ్ డ్రైవ్ జరుగుతుంది. నేరాలు, ఘర్షణలు నియంత్రణకు పూర్తిస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది

## కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు: తలసాని

సికింద్రాబాద్రాష్ట్ర సాధన కోసం పుట్టిన ప్రాంతీయ పార్టీ 25 వసంతాల వేడుకలను జరుపుకోవడం ఒక చరిత్ర అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్ మారేడ్ పల్లి లోని కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆదివారం వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. 27 వ తేదీన ఉదయం 10.00 గంటలకు డివిజన్ లలో పార్టీ పతాకాలను ఎగురవేసి సభకు బయలుదేరాలని పిలుపునిచ్చారు. జెండా ఆవిష్కరణ చేసే ప్రాంతాలలో జెండాలు, తోరణాలతో సుందరంగా అలంకరణ చేయాలని చెప్పారు. సభకు వచ్చే వారికోసం పార్టీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే చారిత్రాత్మక సభకు బస్తీలు, కాలనీల నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సభ విజయవంతం చేసేందుకు బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఆవిర్భవించిన ఉద్యమ పార్టీగా టీఆర్ఎస్ ఆవిర్భవించిందని చెప్పారు. 14 సంవత్సరాల పాటు అనేక పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రంను సాధించడం జరిగిందని తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ నాయకత్వం లో ఎంతో అభివృద్ధి సాధించిందని, దేశానికే ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. కానీ ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎంతో విసిగిపోయారని, ఎందుకు కాంగ్రెస్ ను గెలిపించామా అని మదనపడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిధులు లేక అభివృద్ధి పనులు నిలిచిపోయి ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో తాము మోసపోయామని అన్ని వర్గాల ప్రజలు గుర్తించారని, తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని చెప్పారు.

# దువ్వాడ కొంపముంచిన అడల్టరీ

విజయనగరం, ఏప్రిల్ 26,

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ రాజకీయ జీవితం డోలాయమానంలో పడింది. ఆయన రాజకీయ జీవితానికి ఫుల్ స్టాప్ పడేలా ఉంది. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి దువ్వాడ శ్రీనివాస్ ను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. వ్యక్తిగత కారణాలతో తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఎమ్మెల్సీ దువ్వాడ చెబుతున్నారు. అయితే పార్టీ క్రమశిక్షణ అతిక్రమించినందుకే వేటు వేసినట్లు హైకమాండ్ ప్రకటించింది. అదే సమయంలో మంత్రి లోకేష్ ను పొగడడం వల్లే దువ్వాడ శ్రీనివాసును సస్పెండ్ చేశారని టిడిపి, జనసేన సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నాయి. ఇంకోవైపు వైసీపీ సోషల్ మీడియాలో మాత్రం దువ్వాడను ఏనాడో సస్పెండ్ చేయాల్సిందేనన్న పోస్టులు కనిపిస్తున్నాయి.అయితే రకరకాల విశ్లేషణలు ఉన్నాయి కానీ.. అసలు దువ్వాడను ఎందుకు సస్పెండ్ చేశారు అన్నది స్పష్టత లేకుండా పోతోంది. వాస్తవానికి దువ్వాడపై ఎప్పుడో సస్పెన్షన్ విధించాల్సి ఉన్న.. ఆయన వైఖరి మారుతుందేమోనన్న ఆలోచనతో ఇన్నాళ్లు హై కమాండ్ వేచి చూసినట్లు తెలుస్తోంది. రోజురోజుకు ఆయన పరిస్థితిపై విమర్శలు ఎక్కువ అవుతుండడంతో చివరికి వేటు వేశారని తెలుస్తోంది. భార్య పిల్లలతో తగాదా పెట్టుకున్నారు దువ్వాడ శ్రీనివాస్. ప్రేయసి మాధురితో కలిసి చట్టా పట్టాలు వేసుకుని తిరుగుతున్నారు. రోజురోజుకు వారు స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నారు. సోషల్ మీడియాలో రచ్చకెక్కుతున్నారు. మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. అది పార్టీకి చెడ్డ పేరుగా మారుతోంది. వాస్తవానికి కుటుంబ వివాదం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో టెక్కలి ఇన్చార్జి పోస్టు నుంచి దువ్వాడ శ్రీనివాసును తొలగించారు. అయితే అది పనిష్మెంట్ గా భావించలేదు దువ్వాడ. మళ్లీ ఎన్నికల నాటికి తనకే టికెట్ అన్న ధీమా ఆయనది. అందుకే కొంచెం విపరీతంగా ప్రవర్తించారు. అందుకే హై కమాండ్ తోక కత్తిరించినట్లు వైసిపి వర్గాలు చెబుతున్నాయి.మరోవైపు టెక్కలి నియోజకవర్గంలో సైతం దువ్వాల మాధురి తల దూర్చుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ ఇన్చార్జిగా పేరాడ తిలక్ ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో తిలక్కు శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేశారు. దువ్వాడ శ్రీనివాస్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేశారు. కానీ ఇద్దరూ ఓడిపోయారు. టెక్కలి ఇన్చార్జిగా దువ్వాడ శ్రీనివాసును తప్పించారు. పేరాడ తిలక్ కు ఆ బాధ్యతలు అప్పగించారు. కానీ ఇటీవల మాధురి సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. పుష్ప డైలాగును గుర్తుచేసేలా..' దమ్ముంటే తెచ్చుకోరా టిక్కెట్టు.. తెచ్చుకుంటే వదిలేస్తే పోస్టింగు' ఆల్టో పెట్టిన సోషల్ మీడియా పోస్ట్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారితీసింది. దీనిపై టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ తిలక్ తో పాటు చాలామంది వైసీపీ నేతలు హై కమాండ్కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపైనే హై కమాండ్ సీరియస్ గా స్పందించి చర్యలు తీసుకున్నట్లు సమాచారం.మరోవైపు అడల్టరీ పేరుతో దువ్వాడ శ్రీనివాస్ జంట చేస్తున్న హడావిడి అంతా ఇంతా కాదు. సోషల్ మీడియాతో పాటు మీడియా ఛానళ్లకు వారు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. అయితే ఇవి మహిళల విషయంలో ఇబ్బందికరంగా ఉన్నాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా నేతలు జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. వారి ప్రవర్తనతో పార్టీకి చెడ్డ పేరు వస్తోందని.. ముఖ్యంగా మహిళలు యావగించుకుంటున్నారని.. చర్యలు తీసుకోకపోవడంతో హై కమాండ్ తీరును ఎక్కువమంది తప్పు పడుతున్నారని ఫిర్యాదు చేశారు. అందుకే అధినేత జగన్మోహన్ రెడ్డి చర్యలకు ఆదేశించినట్లు ప్రచారం జరుగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# భారత్ సమ్మిట్‌లో ఇండియా మ్యాప్‌ని అలా? రేవంత్ సర్కారు కొత్త తలనొప్పి

హైదరాబాద్, ఏప్రిల్ 26,

జమ్మూ కాశ్మీర్‌లో పహల్గామ్‌లో జరిగిన మారణహోమంపై దేశమంతా రగిలిపోతున్న వేళ.. తెలంగాణ కాంగ్రెస్ మరో వివాదంలో చిక్కుకుంది. 'గ్లోబల్ జస్టిస్ అందించడమే ప్రధాన లక్ష్యం' అనే ఇతివృత్తంతో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా ఏప్రిల్ 25 నుంచి ఏప్రిల్ 26 వరకు "భారత్ సమ్మిట్ 2025" నిర్వహిస్తుండగా.. సుమారు 100 దేశాల నుంచి 450 మంది విదేశీ ప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమ్మిట్‌లో.. ఏర్పాటు చేసిన భారతదేశ చిత్ర పటం తప్పుగా ఉండటం ఇప్పుడు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. భారత సమ్మిట్‌లో పాల్గొన్న ఫొటోలను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేయగా.. ఈ వివాదం చెలరేగింది. రాజగోపాల్ రెడ్డి ఫొటోల్లో దూరంగా ఓ ఇండియా చిత్రం కనిపిస్తుండగా అందులో జమ్మూ కాశ్మీర్‌ను పూర్తిగా ముద్రించనట్టుగా కనిపిస్తోంది. దీంతో.. ఒక్కసారిగా వివాదం చెలరేగింది. బీజేపీ నేతలే కాకుండా చాలా మంది నెటిజన్లు.. ఈ విషయంపై తీవ్ర స్థాయిలో విమర్శలతో విరుచుకుపడ్డారు. ఈ పరిణామంతో కాసేపటికే ఆ పోస్ట్‌ని రాజగోపాల్ రెడ్డి డిలీట్ చేశారు.అయినప్పటికీ.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పోస్ట్ చేసిన ఫొటోలను స్క్రీన్ షాట్ తీసిన.. బీజేపీ నేతలు, కార్యకర్తలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ రచ్చ చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీ దేశద్రోహి, ప్రజావ్యతిరేక స్వభావాన్ని బహిర్గతం చేసే ఓ క్లాసిక్ ఉదాహరణ అని బీజేపీ నేతలు ఆరోపిస్తూ.. పోస్టులు పెడుతున్నారు. ఈ మేరకు బీజేపీ తెలంగాణ అఫీషియల్ ఖాతాలో స్క్రీన్ షాట్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యాఖ్యలు పోస్టు చేశారు. తెలంగాణ ప్రజల పన్నుల నుంచి వచ్చిన ప్రభుత్వ నిధులను వినియోగిస్తూ.. కేవలం కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రమే ఆహ్వానితులుగా సమ్మిట్‌ను నిర్వహించారని ఆరోపించారు. ఇది కేవలం రాజకీయ నిర్లక్ష్యం మాత్రమే కాదు, ఇది దేశ ద్రోహం అని బీజేపీ తెలంగాణ అభివర్ణించారు.కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మ్యాప్‌లో లద్దాఖ్, పాక్ ఆక్రమిత కశ్మీర్ ను ఉద్దేశపూర్వకంగా తొలగించారని బీజేపీ తెలంగాణ మండిపడింది. ఇది ప్రపంచానికి చాలా ప్రమాదకరమైన, నీచమైన సందేశాన్ని పంపుతోందని నిప్పులు చెరిగింది. అంటే ఇవి ఇకపై భారత్‌లో భాగం కావని వారి ఉద్దేశమంటూ విమర్శించింది. ప్రజల పన్ను డబ్బులతో నిర్వహించిన ఈ కార్యక్రమం మన జవాన్ల త్యాగాలను అవమానించడం మాత్రమే కాకుండా, భారత దేశ సార్వభౌమాధికారాన్ని నేరుగా దెబ్బతీయడంగా బీజేపీ తెలంగాణ తీవ్ర స్థాయిలో దుయ్యబట్టింది. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అన్ని రెడ్ లైన్స్ దాటి పోయిందని.. ఇది దేశద్రోహ చర్య అని స్పష్టంగా కనిపిస్తోందని బీజేపీ తెలంగాణ దుయ్యబట్టింది.కాంగ్రెస్ పార్టీ ఇలాంటి వివాదాల్లో చిక్కుకోవడం ఇది మొదటిసారి కాదు. గత ఏడాది డిసెంబర్‌లో కర్ణాటకలోని బెళగావిలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాల్లోనూ ఇదే తరహా వివాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో భారత దేశ పటాన్ని కశ్మీర్, లేహ్ లేకుండా ముద్రించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. బీజేపీ నాయకులు అప్పట్లో కాంగ్రెస్ పార్టీ కావాలనే దేశానికి వెన్నుపోటు పొడుస్తోందని తీవ్రంగా దుయ్యబట్టారు. ఇప్పుడు తాజాగా చోటుచేసుకున్న ఈ ఘటన కూడా అదే తరహా దేశద్రోహ చర్య అని బీజేపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ వెంటనే స్పందించి వివరణ ఇవ్వాలని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్లు పెరుగుతున్నాయి. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో రాజకీయంగా ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాలి.

# టార్గెట్ స్లీపర్ సెల్స్

హైదరాబాద్, ఏప్రిల్ 26,

2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారు. పుల్వామా 2019 తర్వాత జరిగిన అత్యంత దారుణమైన దాడుల్లో ఇది ఒకటి. ఈ దాడి తర్వాత, కర్ణాటక సర్కార్ అప్రమత్తమైంది. ముఖ్యంగా బెంగళూరులో భద్రతను పటిష్టం చేసుకునేందుకు వేగంగా చర్యలు చేపట్టింది.పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్ పౌరులకు అన్ని వీసాలు రద్దు చేసింది కేంద్రం. పాక్ పౌరులు దేశం విడిచి వెళ్లాలని ఆదేశాలు జారీచేశారు. మెడికల్ వీసాలకు మాత్రం ఏప్రిల్ 29 వరకు అనుమతి ఇచ్చారు. భారత పౌరులు పాకిస్తాన్ వెళ్లరాదని కేంద్రం సూచించింది. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి, పాకిస్థానీయులను వెంటనే పంపించాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే పాకిస్తాన్ నుండి అక్రమ వలసదారులను, స్లీపర్ సెల్స్‌ను వెతికే పనిలో పడ్డారు కర్ణాటక పోలీసులు.సార్క్ వీసా మినహాయింపు పథకం కింద పాకిస్తానీ జాతీయులు భారతదేశంలోకి ప్రవేశించకుండా నిషేధించాలన్న కేంద్రం ఆదేశాలను అనుసరించి, చెల్లుబాటు అయ్యే పత్రాలు లేని వారిని గుర్తించి బహిష్కరించడంలో కర్ణాటక ప్రభుత్వం అన్ని విధాలుగా జాగ్రత్త తీసుకుంటుందని కర్ణాటక హోం మంత్రి జి. పరమేశ్వర స్పష్టం చేశారు. అక్రమ నివాసితులపై ఉచ్చు బిగించడంతోపాటు.. సరైన డాక్యుమెంటేషన్ లేని పాకిస్తాన్ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని పరమేశ్వర తెలిపారు. "కేంద్ర నిఘా సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, కర్ణాటకలో, ముఖ్యంగా బెంగళూరులో చట్టవిరుద్ధంగా నివసిస్తున్న పాకిస్తానీ జాతీయులను గుర్తించి, అదుపులోకి తీసుకుని, బహిష్కరణ కోసం వారిని హైకమిషన్‌కు అప్పగిస్తామని ఆయన అన్నారు.కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడానికి, కర్ణాటక రాష్ట్ర పోలీసులు లాడ్జీలు, అతిథి గృహాలు, ఇతర స్థావరాల్లో ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. స్లీపర్-సెల్ కార్యకలాపాల గురించి ఏదైనా సమాచారం అందిన వెంటనే చర్య తీసుకోవడానికి నగరవ్యాప్తంగా స్థానిక పోలీసు స్టేషన్లలో అఃఎ, ఎః అధికారులను మోహరించారు.బెంగళూరులో పాకిస్తానీయులు ఉన్నారంటూ ఇటీవలి శాసనసభ సమావేశంలో పరమేశ్వర తెలిపారు. కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 137 మంది అక్రమ వలసదారులను గుర్తించి అరెస్టు చేసిందని, వారిలో 25 మంది పాకిస్తానీ జాతీయులు అని వెల్లడించారు. ఇందులో 84మందిని బెంగళూరు నగరంలోనే అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పాకిస్తాన్ నుండి వచ్చి సరియైన పత్రాలు లేని నివాసితులకు బెంగళూరు మహానగరం ప్రాథమిక కేంద్రంగా మారిందన్నారు.2024 చివరలో, ఇంటెలిజెన్స్ బ్యూరో సూచన ప్రకారం బెంగళూరు శివార్లలోని జిగాని పారిశ్రామిక బెల్ట్‌లో అధికారులు సోదాలు నిర్వహించారు.

ఆ సమయంలో నకిలీ పత్రాలతో చట్టవిరుద్ధంగా నివసిస్తున్న ఒక పాకిస్తానీ జాతీయుడు, మరో ముగ్గురు అనుమానితులను అరెస్టు చేశారు. వారికి నకిలీ పాస్‌పోర్ట్‌లు, గుర్తింపు తారుమారుకి దోహదపడే పెద్ద రహస్య నెట్‌వర్క్‌తో సంబంధాలున్నాయని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఇటువంటి స్లీపర్ సెల్స్ నెలలు, సంవత్సరాలు సైలెంట్‌గా ఉంటారని, పెద్ద టాస్క్‌లో భాగం అయ్యేవరకు నగరంలోని సాధారణ జనంతో కలిసిపోతారని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నారు. స్లీపర్ సెల్స్‌పై ఫుల్ ఫోకస్ పెట్టిన బెంగళూరు పోలీసులు.. ఎలాంటి కమ్యూనల్ హింసకు తావు లేకుండా?. వారి అంతు తేల్చగలరా అన్నది ముమ్ముందు తేలనుంది.

## వృద్ధురాలిపై ముగ్గురు మహిళల దాడి

నిజామాబాద్

నవీపేట్ మండల కేంద్రంలో సినీ ఫక్కీ లో చోరీ జరిగింది. ఓ వృద్ధురాలి నగలు ముగ్గురు కిలాడి లేడీలు అపహరించారు. బస్ స్టాండ్ లో కిష్టాబాయ్ అనే వృద్ధురాలిపై దాడి చేసారు. కంట్లో కారం చల్లి విచక్షణారహితంగా దాడి జరిపారు. కత్తి చూపించి బంగారు నగల అపహరించారు. వృద్ధురాలు అరుపులు కేకలు పెట్టడంతో కిలాడి లేడీ లు పారిపోయారు. స్థానికులు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నగలు స్వాధీనం చేసుకున్నారు.

## భవంతి ఎక్కి యువకుడి ఆత్మహత్యాయత్నం

కోదాడ

కోదాడ పట్టణంలో యువకుడు బిల్డింగ్ ఎక్కి ఆత్మహత్యయత్నంచేసాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో మునగాల మండలం ముకుందపురం గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో యశశ్విని (22) మృతి చెందింది. మృతురాలు స్వగ్రామం తణుకు గా గుర్తించారు. యువతి,యువకులు ప్రేమికురాలు కావడంతో యువతి తరుపు బంధువులు మందలించడంతో బిల్డింగ్ పైకెక్కి యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. యువతి తరుపు బంధువులు దాడి చేయడంతో మనస్తాపానికి గురైన బిల్డింగ్ పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసాడు. ఘటన స్థలానికి చేరుకున్న టౌన్ సిఐ శివశంకర్ నాయక్ యువకుడి సురక్షితంగా టౌన్ స్టేషన్కి తరలించారు. ఇద్దరు హైదరాబాద్ లో సాఫ్ట్వేర్ ఉద్యోగులగా గుర్తించారు.

## జూన్ 2 నుంచి భూ భారతి పోర్టల్ అమలు

నల్గొండ

భూ భారతి చట్టం గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. పెద్ద అడిశర్లపల్లి మండల కేంద్రంలో భూభారతి (భూమి హక్కుల చట్టం-2025) పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు అవగాహన కల్పించారు. భూమి ఉన్న రైతులు, భూమి లేని రైతులు సైతం భూ భారతి చట్టం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భూ భారతి పోర్టల్ మాత్రం జూన్ 2 నుంచి అమలులోకి రానుందని తెలిపారు. ధరణిలో లేని అనేక వెసులుబాట్లు భూభారతిలో ఉన్నాయని.. ధరణి పోర్టల్ లో రికార్డులను సవరించే అవకాశం లేదని, భూభారతి లో రికార్డులను సవరణ చేసుకోవచ్చని తెలిపారు. భూములపై జరిగిన లావాదేవీలన్నింటిని ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న సంబంధిత గ్రామపంచాయతీ నోటీస్ బోర్డులో అందరికీ తెలిసేలా ప్రచురించడం జరుగుతుందని చెప్పారు. గతంలో సాధాబైనామా, పౌతి,లమ్యుటేషన్ తదితర అన్నింటికీ రైతులు సమస్యలు ఎదుర్కొన్నారని.., భూ భారతిలో అలాంటి ఇబ్బంది లేదని, కింది స్థాయిలో అన్యాయం జరిగితే పై స్థాయికి అప్పీల్ కు వెళ్లే అవకాశం ఉందని తెలిపారు.

## బీఆర్ఎస్ సభకు ఆహ్వానాలు

కరీంనగర్

టిఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏళ్ళు అవుతున్న సందర్భంగా ఆదివారం రజతోత్సవ సభకు భారీగా సన్నాహాలు జరుగుతున్నాయి. కార్యకర్తల తరలింపుకై ప్రత్యేక ఆహ్వానాలు అందిస్తున్నారు. గ్రామాల్లో దండోరాతో చాటింపు చాటారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గంగాధర మండలం బూరుగుపల్లిలో డప్పు కొట్టి దండోరా వేయించారు. సిరిసిల్లలో ఇంటింటికీ తిరిగి బొట్టు పెట్టి ఆహ్వాన లేఖలు బిఆర్ఎస్ నాయకులు అందచేసారు. కరీంనగర్ మంచి ఎల్కతుర్తి వరకు దారి పొడవున స్వాగత తోరణాలు గులాబీ జెండాలతో పార్టీ నాయకులు నింపేసారు.

## అమానుషంగా కుక్కి ఆవుల రవాణా

ఆదిలాబాద్

ఇచ్చోడ మండలం గాంధీనగర్ గ్రామం వద్ద అతి క్రూరంగా పశువులను అక్రమ రవాణా చేస్తున్న లారీను డ్రైవర్ నడి రోడ్డుపై విడిచి పెట్టి పారిపోయాడు. అనుమానం వచ్చి పోలీసులు లారీని తనిఖీ చేయగ దయనీయమైన స్థితిలో 42 ఎద్దులు, 10 ఆవులు వున్నాయి. అతి క్రూరంగా పశువులను లారిలో కుక్కడంతో ఊపిరి ఆడక ఒక ఆవు మృతి చెందింది. మరికొన్ని పశువులు అస్వస్థతకు గురయ్యాయి. పశువులకు ప్రథమ చికిత్స చేయించి, గోశాలకు తరలించారు. పశువుల అక్రమ రవాణాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాశ్మీర్ నుంచి క్షేమంగా తిరుగొచ్చిన మెదక్ వాసులు

మెదక్

కాశ్మీర్లో చిక్కుకుని పోయిన మెదక్ వాసులు సురక్షితంగా స్వగృహాలకు చేరుకున్నారు. రోటీన్ పనిలో పడిపోయారు. మెదక్ పట్టణం నుండి కపిల్ చిట్ ఫండ్ కంపెనీ ద్వారా టూర్ ఏర్పాటు చేశారు. మెదక్ నుంచి ఈ నెల 22 ఉదయం 2 గంటల సమయంలో చిట్ఫండ్ మేనేజర్ పవన్ ఐదుగురి బృందం మెదక్ నుంచి బయలు దేరారు. మరునాడు శ్రీనగర్ చేరుకున్నారు. పహేల్గావ్ లో జరుగుతున్న ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో వీరిని హోటల్లోనే చిక్కుకుని పోయారు. ఏం జరుగుతుందో తెలియక ఆందోళన చెందారు. మరోవైపు కుటుంబ సభ్యులు బంధువులు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఎంపీ రఘునందన్ రావు వారికి భరోసా కల్పించారు. శ్రీనగర్ నుండి శనివారం తెల్లవారుజామున సురక్షితంగా మెదక్కు చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి థాంక్స్ చెప్పారు.

================================

# కాళేశ్వరం కథ కంచికేనా

కరీంనగర్, ఏప్రిల్ 26,

కాళేశ్వరం.. ఆసియాలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్‌గా గత కేసీఆర్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. ఈ ప్రాజెక్టుతో కొత్తగా లక్ష ఎకరాలు సాగులోకి వచ్చినట్లు చెప్పుకుంది. కాళేశ్వరం నిర్మాణంతో తెలంగాణ సస్యశ్యామలమైందని కేసీఆర్‌తోపాటు, నాటి మంత్రులు ఊదరగొట్టారు. సుమారు రూ.లక్ష కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ప్రారంభించిన మూడేళ్లకే కుంగినోయింది. బుంగలు పడ్డాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి కాళేశ్వరం కుంగుబాటు కూడా ఓ కారణం.కాళేశ్వరం ఎంతో గొప్పలు చెప్పిన గత ప్రభుత్వం హయాంలోనే కీలకమైన లక్ష్మీ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. అన్నారం బ్యారేజీ పిల్లర్ల వద్ద బుంగలు పడ్డాయి. నిర్మాణ లోపాలు బయటపడ్డాయి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్, రాష్ట్ర రైతాంగానికి సాగునీరు అందించి రాజకీయంగా దీర్ఘకాల ప్రయోజనాలు అందిస్తుందని భావించింది. అయితే, 2023 ఎన్నికలకు ముందు మేడిగడ్డ బ్యారేజీలో పగుళ్లు బయటపడటంతో ఈ ప్రాజెక్ట్ బీఆర్ఎస్‌కు భారంగా మారింది. ఇప్పుడు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సమర్పించిన నివేదిక మరో షాక్ ఇచ్చింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని, వీటిని ఉపయోగిస్తే ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందని తేల్చింది.14 నెలల సుదీర్ఘ అధ్యయనం, పలు పరీక్షల తర్వాత ఔఆూం సమర్పించిన నివేదిక ప్రకారం, కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మూడు బ్యారేజీల డిజైన్, నిర్మాణంలో తీవ్ర లోపాలు ఉన్నాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సీకెంట్ పైల్స్ కూలిపోవడంతో పాటు, బ్యారేజీల ఎగువ, దిగువ భాగాల్లో రంధ్రాలు ఏర్పడినట్లు గుర్తించారు. ఈ బ్యారేజీలను యథావిధిగా ఉపయోగించకుండా, పూర్తిగా రీడిజైన్ చేసి నిర్మించాలని ఔఆూం స్పష్టం చేసింది. ఈ లోపాల కారణంగా బ్యారేజీలు శాశ్వత నష్టానికి గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది.నివేదికలో మరో కీలక అంశం బయటపడింది. బ్యారేజీల నిర్మాణానికి ముందు అవసరమైన భూసార పరీక్షలు నిర్వహించలేదు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సిఫారసు చేసిన స్థలాలకు బదులు, ఇతర ప్రాంతాలకు మార్చడం జరిగింది, ఇది నిర్మాణ స్థిరత్వాన్ని దెబ్బతీసింది. అంతేకాదు, జాతీయ ఆనకట్టల భద్రత చట్టం?2021 ప్రకారం, వర్షాకాలానికి ముందు బ్యారేజీల భద్రతా తనిఖీలు చేయాల్సిన నిబంధనను కూడా పాటించలేదని నివేదిక వెల్లడించింది.కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్‌కు ఔఆూం నివేదిక కీలక ఆధారంగా మారనుంది. ఈ నివేదిక బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలక నిర్ణయాలు తీసుకున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేసీఆర్‌లను ప్రశ్నల వరుసకు గురిచేసే అవకాశం ఉంది. రాజకీయంగా, ఈ నివేదిక బీఆర్ఎస్‌కు పెద్ద ఎదురుదెబ్బగా మారి, ప్రతిపక్ష పార్టీలకు రాజకీయ ఆయుధంగా మారవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ లోపాలను హైలైట్ చేస్తూ బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంది.ప్రాజెక్ట్ రైతులకు సాగునీరు అందించడంలో కీలక పాత్ర పోషించాలని భావించారు, కానీ ఈ బ్యారేజీలు పనికిరాకపోవడం రైతాంగానికి నష్టం కలిగిస్తుంది. ప్రభుత్వం ఇప్పుడు బ్యారేజీల రీడిజైన్, పునర్నిర్మాణంపై దృష్టి సారించాల్సి ఉంది. ఇది భారీ ఖర్చుతో కూడుకున్న పని. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో జరిగిన అవకతవకలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజల నుంచి డిమాండ్ పెరుగుతోంది.

# కశ్మీర్ ఉగ్రదాడి మృతులకు జర్నలిస్టుల నివాళి

పెద్దపల్లి ప్రతినిధి:

జమ్మూ కాశ్మీర్‌లోని పెహల్గాంలో అమాయక ప్రజలపై జరిగిన ఉగ్రదాడిని రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపంద చర్యగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్ అన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం ముందు టీయూడబ్ల్యూజే (ఐజేయు) సంఘం జర్నలిస్టులు కొవ్వొత్తులు వెలిగించి మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా బుర్ర సంపత్ కుమార్ మాట్లాడుతూ అమాయక పౌరులపై జరిగిన ఈ దాడులు బాధాకరమని, సమాజానికి ఎంతో నష్టం కలిగిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపి, వారి దుఃఖంలో పాలుపంచుకుంటున్నామని చెప్పారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దేశాభివృద్ధికి, మానవత్వానికి వ్యతిరేకమని ఆయన స్పష్టం చేశారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే వారిని గుర్తించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాంతియు త వాతావరణం నెలకొల్ప డానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబాలకు ఈ కష్ట సమయంలో ధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అందరూ కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. జమ్మూ కాశ్మీర్‌లో శాంతియుత వాతావరణం నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు చింతకింది చంద్రమొగిలి, గుడ్ల శ్రీనివాస్, యండీ.గౌస్ పాషా, ప్రవీణ్ రెడ్డి, వీరమల్ల విద్యాసాగర్ రావు, పంది కుమార్, ముత్యాల కృష్ణమూర్తి, కొలిపాక కృష్ణ, మోదుంపల్లి సాగర్, ఈదునూరి జైపాల్, తిరుమల సురేష్, మోలుగూరి కమల్, జాపతి సంజీవ్, కన్నూరి ఆంజనేయులు, యండీ.ఇబ్రహీం, మాజీద్ పాషా, యండీ.వలీ పాషా, తిరుపతి, కొలిపాక సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ వ్యూహాత్మక చర్యలు...

శ్రీనగర్, ఏప్రిల్ 26,

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 25 భారతీయులు, ఒక నేపాలీ పౌరుడు మరణించారు. ఇది గత రెండు దశాబ్దాలలో భారత్‌లో పౌరులపై జరిగిన అత్యంత ఘోరమైన దాడుల్లో ఒకటిగా నిలిచింది. ఈ దాడి కాశ్మీర్‌లోని బైసరాన్ మేడో వద్ద జరిగింది. దీనిని 'మినీ స్విట్జర్లాండ్' అని పిలుస్తారు. ఈ ఘటనకు ప్రతిస్పందనగా, భారత్ పాకిస్థాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడిని తీవ్రతరం చేసింది, సింధూ జలాల ఒప్పందంను నిలిపివేసింది, అట్టారీ?వాఘా సరిహద్దును మూసివేసింది. పాకిస్థాన్ దౌత్యవేత్తలను బహిష్కరించింది. అయినప్పటికీ, దేశవ్యాప్తంగా ప్రజలు ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, భారత్ ఎదుట ఉన్న సైనిక ఎంపికలు రాజకీయ, వ్యూహాత్మక చర్చలకు కేంద్రబిందువుగా మారాయి.భారత వాయుసేన రఫేల్, మిరాజ్ 2000 వంటి అత్యాధునిక ఫైటర్ జెట్లను ఉపయోగించి, పాకిస్థాన్‌లోని కీలక సైనిక కేంద్రాలు లేదా ఉగ్రవాద స్థావరాలపై కచ్చితమైన దాడులు చేయడం ఒక ఎంపికగా ఉంది. 2019 బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్‌ల తర్వాత సేకరించిన అనుభవాలను ఉపయోగించి, ఈ జెట్లు ప్రత్యర్థి రక్షణ వ్యవస్థలను ఛేదించే సామర్థ్యం కలిగి ఉన్నాయి. అయితే, ఇటువంటి దాడులు అంతర్జాతీయ ఒత్తిడిని తెచ్చిపెట్టవచ్చు. ముఖ్యంగా యునైటెడ్ నేషన్స్ లేదా ఇతర ప్రముఖ దేశాల నుంచి . ఈ ఎంపిక అమలు చేయాలంటే, భారత్ దౌత్యపరమైన ఒత్తిడిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. దాడులు కచ్చితమైన ఇంటెలిజెన్స్‌పై ఆధారపడి ఉండాలి.పాకిస్థాన్ ఇటీవల సిమ్లా ఒప్పందంను నిలిపివేస్తామని బెదిరించడంతో, నియంత్రణ రేఖ యొక్క పవిత్రతను ప్రశ్నార్థకం చేసింది. ఇది భారత్‌కు ఊూఅ దాటి ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసే అవకాశాన్ని అందిస్తుంది. ఇటీవలి ఊూఅ వద్ద పాకిస్థాన్ జరిపిన సీజ్‌ఫైర్ ఉల్లంఘనలు భారత్‌కు ఈ చర్యలకు నైతిక, వ్యూహాత్మక కారణాన్ని అందిస్తాయి. అయితే, కాశ్మీర్ కఠినమైన భౌగోళిక పరిస్థితులు, పాకిస్థాన్ దళాల బలమైన స్థానాలు, మరియు సుదీర్ఘ ఆపరేషన్ సమయం ఈ ఎంపికను సవాలుగా మార్చవచ్చు. ఈ కార్యకలాపాలు సమర్థవంతంగా అమలు చేయాలంటే, అధిక స్థాయి సమన్వయం మరియు రియల్?టైమ్ ఇంటెలిజెన్స్ అవసరం.2016 సర్జికల్ స్ట్రైక్స్ విజయవంతమైన నేపథ్యంలో, భారత్ పాకిస్థాన్‌లోని పెద్ద ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకొని మరోసారి సర్జికల్ స్ట్రైక్స్ చేపట్టవచ్చు. అయితే, పహల్గాం దాడి తర్వాత పాకిస్థాన్ అప్రమత్తంగా ఉండటం వల్ల ఈ దాడులు ఊహించని ప్రభావాన్ని సృష్టించకపోవచ్చు. విజయవంతమైన సర్జికల్ స్ట్రైక్స్‌కు రియల్?టైమ్ ఇంటెలిజెన్స్, శక్తివంతమైన స్పెషల్ ఫోర్సెస్, కచ్చితమైన ప్లానింగ్ అవసరం. ఈ ఎంపిక తక్కువ స్థాయి ఉద్రిక్తతలను సృష్టిస్తుంది. కానీ భారీ ఫలితాలను హామీ ఇవ్వదు, ముఖ్యంగా పాకిస్థాన్ రక్షణ వ్యవస్థలు హై అలర్ట్‌లో ఉన్నప్పుడు.ఊూఅ సమీపంలో ఉన్న పాకిస్థాన్ ఔట్‌పోస్ట్‌లు, సరఫరా మార్గాలు, లేదా ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకొని శతఘ్నులు, స్నైపర్ గన్స్, భారీ మోర్టార్‌లతో దాడులు చేయడం మరో ఎంపిక. ఈ దాడులు తక్కువ ఉద్రిక్తతలను సృష్టిస్తాయి మరియు అంతర్జాతీయ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఈ విధానం శత్రు యొక్క సామర్థ్యాలను క్రమంగా బలహీనపరచడంలో సహాయపడుతుంది. కానీ భారీ సైనిక దాడుల వలె గణనీయమైన ఫలితాలను ఇవ్వకపోవచ్చు. ఈ ఎంపిక అమలు సరిహద్దు వెంబడి ఉన్న భారత సైన్యం ఖచ్చితత్వం, సాంకేతిక సామర్థ్యాలపై ఆధారపడుతుంది.సైనిక చర్యలు తీసుకోవడం వల్ల అంతర్జాతీయ సమాజం నుంచి, ముఖ్యంగా ఐక్యరాష్ట్రాలు, చైనా, లేదా ఐరోపా దేశాల నుంచి ఒత్తిడి రావచ్చు. పాకిస్థాన్ ఇప్పటికే సింధూ జలాల ఒప్పందం నిలిపివేతను 'యుద్ధ చర్య'గా పేర్కొంది. ఈ ఒప్పందాన్ని పాకిస్థాన్‌కు జీవనాడిగా భావిస్తోంది, ఎందుకంటే ఇది 240 మిలియన్ల పాకిస్థానీయుల నీటి అవసరాలను తీరుస్తుంది. అదనంగా, పాకిస్థాన్ తమ వైపు నుంచి సిమ్లా ఒప్పందం సహా అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలను నిలిపివేస్తామని బెదిరించింది, ఇది భారత్‌కు సైనిక చర్యలకు మరింత నైతిక కారణాన్ని అందిస్తుంది. అయితే, భారత్ ఈ చర్యలను అమలు చేయాలంటే, దౌత్యపరమైన సమతుల్యతను కాపాడుకోవడం, అంతర్జాతీయ మద్దతును సమీకరించడం కీలకం. ఉదాహరణకు, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ ఈ దాడిని ఖండిస్తూ భారత్‌కు సంఘీభావం తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ దాడికి సంబంధించి "ప్రతి ఉగ్రవాదిని, వారి మద్దతుదారులను గుర్తించి, ఊహించని విధంగా శిక్షిస్తామని" ప్రతిజ్ఞ చేసింది. అయితే, సైనిక చర్యలపై ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరిస్తోంది, ఎందుకంటే ఏదైనా తప్పిదం ద్వైపాక్షిక ఉద్రిక్తతలను యుద్ధ స్థాయికి తీసుకెళ్లవచ్చు. ఏప్రిల్ 25న హోం మినిస్టర్ అమిత్ షా నివాసంలో సింధూ జలాల ఒప్పందం సస్పెన్షన్‌పై జరిగిన సమావేశం, ఈ చర్యల యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను సూచిస్తుంది. అదనంగా, సరిహద్దులో భారత సైన్యం హై అలర్ట్‌లో ఉంది, మరియు సైన్యం అధిపతి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు, ఇది సైనిక సన్నాహాలను సూచిస్తుందిపహల్గాం దాడి భారత్?పాకిస్థాన్ సంబంధాలను 2019 పుల్వామా దాడి తర్వాత స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు ద్వైపాక్షిక సంబంధాలు దాదాపు శూన్య స్థాయికి చేరుకున్నాయి. సైనిక చర్యలు తీసుకుంటే, అవి భారత్ యొక్క జాతీయ భద్రతా లక్ష్యాలను బలపరచవచ్చు కానీ ఆర్థిక, రాజకీయ ఖర్చులను కలిగిస్తాయి. దౌత్యపరమైన చర్యలు, సింధూ జలాల ఒప్పందం సస్పెన్షన్ వంటివి, పాకిస్థాన్‌పై దీర్ఘకాలిక ఒత్తిడిని సృష్టిస్తాయి, కానీ సైనిక చర్యలు తక్షణ ఫలితాలను అందించవచ్చు. భారత్ యొక్క తదుపరి చర్యలు దేశీయ ఒత్తిడి, అంతర్జాతీయ రాజకీయాలు, వ్యూహాత్మక లక్ష్యాల సమతుల్యతపై ఆధారపడి ఉంటాయి.

# రికార్డు స్థాయిలో లిక్కర్ సేల్స్

హైదరాబాద్, ఏప్రిల్ 26, (

వేసవికాలం రాగానే చాలామంది చల్లదనం కోరుకుంటూ ఉంటారు. ఈ క్రమంలో శరీరంలోని ఉష్ణోగ్రతను తగ్గించుకోవడానికి చల్లని పానీయాలను సేవిస్తూ ఉంటారు. అయితే కొందరు సాధారణ కూల్డ్రింక్స్ కు బదులు బీర్లను తాగాలని ఇష్టపడతారు. దీంతో వేసవి కాలంలో బీర్ల అమ్మకాలు విపరీతంగా పెరిగిపోతూ ఉంటాయి. అయితే తెలంగాణ ప్రభుత్వం కొన్ని నెలల కింద బీర్ల ధరలను పెంచింది. అయినా కూడా ధరలను లెక్కచేయకుండా బీర్ల అమ్మకాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇటీవల వీటి అమ్మకాలు రెట్టింపు స్థాయిలో ఉందని నివేదికలు తెలుపుతున్నాయి. మండే ఎండలతోనే చాలామంది చల్లదనం కోసం ఎక్కువగా బీర్లను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంతకీ బీర్ల అమ్మకాలు ఎలా ఉన్నాయంటే?తెలంగాణలో ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు 3 లక్షల బీర్ల కేసులు అమౌంట్ అవుతున్నట్లు తెలుస్తోంది. సాధారణ రోజులతో పోలిస్తే ఇవి రెట్టింపు అమ్మకాలు అని వ్యాపార వర్గాలు తెలుపుతున్నాయి. ఎండలు మండిపోవడంతోనే చాలామంది బీర్లు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని అంటున్నారు. బీర్ల కంటే లిక్కర్ ధరలు తక్కువ గా ఉన్న.. ఎక్కువ శాతం బీర్లను మాత్రమే కొనుగోలు చేస్తున్నారని అంటున్నారు. మరోవైపు శుభకార్యాలకు సమయం ఆసన్నం కావడంతో చాలామంది మద్యం కొనుగోలు చేసే సమయంలో బీర్లను మాత్రమే కొనుగోలు చేస్తున్నారని అంటున్నారు. ఈ తరుణంలో బీర్ల ఉత్పత్తికి డిమాండ్ పెరిగిపోతుందిఅయితే కేవలం వైన్స్ షాపుల ద్వారా మాత్రమే కాకుండా రెస్టారెంట్లు, బార్ల ద్వారా కూడా బీర్ల అ మ్మకాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. దీంతో ఎక్సైజ్ శాఖకు విపరీతమైన ఆదాయం వస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వేసవికాలంలో నిర్ణయించుకున్న లక్ష్యానికి చేరుతున్నట్లు ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 5.48 కోట్ల కేసుల బీర్లు అమ్ముడుపోయాయి. అయితే ఈ ఏడాది సమ్మర్ లో మాత్రమే కోటిన్నర బీర్ల అమ్మకాలు చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఐ ఎం ఎల్ లిక్కర్ కేసులు కూడా 4 కోట్ల కేసులు పెంచాలని అనుకుంటున్నారు. అయితే లిక్కర్ కంటే బీర్ల అమ్మకాలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.గత మార్చి 22వ తేదీన ఒక్కరోజే దాదాపు 4 లక్షల కేసుల బీర్లు అమ్ములు పోయాయి. ఆ తర్వాత రోజు నుంచి యావరేజ్ గా ప్రతిరోజు మూడు లక్షల కేసులు అమ్ముడుపోతున్నాయి. ఇక ఏదైనా సెలవులు వస్తే ఈ సేల్స్ మరింత స్థాయిలో పెరుగుతున్నాయి. ఇలాగే సేల్స్ పెంచుకుంటూ పోతే ఈ రెండు నెలల్లోనే టార్గెట్ ను రీచ్ అయ్యి అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ పేర్కొంటుంది. అయితే త్వరలో లిక్కర్ ధరలు పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే బీర్ల ధరలను పెంచింది. అయినా ధరలను లెక్కచేయకుండా బీర్లను ఎక్కువగా సేవిస్తూ ఉన్నారు. ఎండాకాలం కావడంతో పాటు ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడంతో చల్లదనం కోసం ఎక్కువగా బీర్లని కొనుగోలు చేస్తున్నారు.

# బ్యాన్ కీరవాణి....

హైదరాబాద్, ఏప్రిల్ 26, (

గత కొద్దిరోజుల నుండి ఆస్కార్ అవార్డు గ్రహీత కీరవాణి పై పలు ఆరోపణలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. మ్యూజిక్ డైరెక్టర్ గా ఎంతో బిజీ గా గడుపుతున్న ఆయన, ఈటీవీ షో లో 24 సీజన్స్ ని పూర్తి చేసుకున్న 'పాడుతా తీయగా' సింగింగ్ షోలో న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నాడు. ఈ షో ద్వారా రీసెంట్ గానే ఎలిమినేట్ అయినా ప్రవస్తి కీరవాణి, చంద్రబోస్ , సునీత వంటి వారిపై తీవ్రంగా విరుచుకుపడిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ వ్యవహారం పై కీరవాణి ఇప్పటి వరకు ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వలేదు. దశాబ్దాల నుండి ఇండస్ట్రీ లో ఉంటున్న కీరవాణి పై ఇప్పటి వరకు ఇలాంటి సంచలన ఆరోపణలు ఎవ్వరూ చెయ్యలేదు. ఆ అంశంపై కీరవాణి కి సపోర్ట్ చేసే వాళ్ళు కొంత మంది ఉంటే, వ్యతిరేకించే వాళ్ళు కూడా కొంతమంది ఉన్నారు.కానీ కీరవాణి ఒక సింగింగ్ షోలో క్రిస్టియన్ మతాన్ని పొగుడుతూ హిందూ మరియు ఇతర మతాలను అగౌరవపరిచాడు అంటూ కొన్ని హిందూ సంఘాలకు చెందిన ప్రముఖులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇంతకు ఆయన ఏమన్నాడంటే 'నేను అన్ని మతాలను సమానంగా గౌరవిస్తాను. కానీ క్రిస్టియన్ మతం అంటే కొంచెం ఎక్కువ ఇష్టం. ఎందుకంటే కేవలం ఈ మతం లో మాత్రమే క్షమించే తత్త్వం ఉంటుంది. మిగతా మతాల్లో అది కనపడదు' అంటూ చెప్పుకొచ్చాడు. దీనిపై నెటిజెన్స్ మామూలు రేంజ్ లో ఫైర్ కాలేదు. ముఖ్యంగా హిందూ మతానికి సంబంధించిన వారు అయితే కీరవాణి ని ఏకిపారేస్తున్నారు. ఇతని సినిమాలు బ్యాన్ చేయాలి అంటూ ట్వీట్స్ వేస్తున్నారు. ఒక గురువును కీరవాణి ని ఉద్దేశిస్తూ మాట్లాడిన కొన్ని మాటలు ఇప్పుడు సోషల్ మీడియా లో సంచలనంగా మారాయి. ఇంతకు అతను ఏమి మాట్లాడాడో క్రింది వీడియో లో చూడండి.ఇక కీరవాణి ప్రస్తుతం చేస్తున్న సినిమాల విషయానికి వస్తే మెగాస్టార్ చిరంజీవి తో 'విశ్వంభర' చేస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తి అయ్యింది. రీసెంట్ గానే 'రామ రామ' అనే పాట కూడా విడుదలై మంచి రెస్పాన్స్ ని సొంతం చేసుకుంది. అదే విధంగా పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' చిత్రానికి కూడా ఆయన సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే రెండు పాటలు విడుదలై ఆడియన్స్ నుండి మంచి రెస్పాన్స్ ని సొంతం చేసుకుంది. ఈ రెండు కాకుండా ప్రస్తుతం పాన్ వరల్డ్ చిత్రం మహేష్ బాబు, రాజమౌళి చిత్రానికి కూడా ఈయనే సంగీత దర్శకుడు.

# షర్మిల నోరు అదుపులో పెట్టుకో.

**- సాదినేని యామిని శర్మ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి**

విజయవాడపహల్గామ్ లో అత్యంత హృదయ విదారక ఘటనపై యావత్తు దేశంగ్ర్భ్రాంతిలో మునిగిపోయింది. ఉగ్రదాడిని దేశవ్యాప్తంగా ప్రజలందరూ ఖండిస్తుండగా కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. గడిచిన 10 సంవత్సరంలో దేశంలో ఎక్కడా ఉగ్ర దాడులు జరగకుండా బీజేపీ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంది. అనుక్షణం దేశ ప్రజలకు అండగా నిలుస్తున్న భద్రతా దళాలను నిందించడం సరికాదు. ఎన్నో ఉగ్ర దాడులను ముందుగానే పసిగట్టి ప్రజలను రక్షించాయి భద్రతా దళాలు. 10 సంవత్సరాలలో దాదాపు 15 కోట్లకు పైగా పర్యాటకులు జమ్మూ కాశ్మీర్ని సందర్శించారు. దేశ ప్రజల రక్షణకు మోదీ గారు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ప్రపంచ దేశాలన్నీ మన దేశం ఉగ్రవాదాన్ని ఉక్కు పాదంతో అణచివేయాలని తీసుకుంటున్న చర్యలను పొగుడుతున్నాయి. కేవలం హిందువనే కారణంతో కళ్ల ఎదుట భర్తను ఉగ్రవాదులు కాల్చి చంపారు అని బాధితులే స్వయంగా చెప్తుంటే షర్మిల మాత్రం ముస్లింలను వెనకేసుకురావడం దేనికి సంకేతం? తీవ్రవాదులు మగవారిని కాల్చి చంపే ముందు వారి పేర్లు, మతం కనుక్కుని మరీ హిందువులనే కారణంతోనే చంపారు. మరణించిన హిందువులకు అండగా నిలవాల్సింది

# బీఆర్ఎస్ పక్కా ప్లాన్

## అసంతృప్తి వర్గాలను దగ్గరకు తీస్తున్న దళపతి

వరంగల్, ఏప్రిల్ 26, (

బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు కౌంట్ డౌన్ మొదలైంది. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 24 ఏళ్లు పూర్తి చేసుకుని, 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో ఈనెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో పెద్ద ఎత్తున రజతోత్సవాలను నిర్వహిస్తోంది. 10 లక్షల జన సమీకరణతో కనీవినీ ఎరుగని రీతిలో సిల్వర్ జూబ్లీ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు స్పీడప్ చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు.దీంతో అంతా వరంగల్ సభవైపే ఆసక్తిగా చూస్తోంటే..గులాబీ బాస్ కేసీఆర్ మాత్రం మాత్రం మరో కోణంలో ఆలోచిస్తున్నారట. 27న జరిగే బహిరంగ సభ సందర్భంగా కాస్త డిఫరెంట్ గా ప్లాన్ చేశారట గులాబీ పార్టీ నేతలు. అధికార కాంగ్రెస్ పార్టీని డిఫెన్స్ లో పడేసేలా ఎవ్వరూ ఊహించని సరికొత్త వ్యూహాన్ని రచించారని తెలుస్తోంది.అధికార కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తిగా ఉన్న నేతలపై బీఆర్ఎస్ నేతలు దృష్టి సారించారట. ఈనెల 27న పార్టీ రజతోత్సవ సభలో ఆయా కాంగ్రెస్ నేతలను కారు ఎక్కించేయాలని భావించారని తెలుస్తోంది. తమ ఎమ్మెల్యేలు పార్టీ మారిన పది నియోజకవర్గాల్లో పాత కాంగ్రెస్ నాయకులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారనే విషయాన్ని గుర్తించిన బీఆర్ఎస్..వారితో కొద్ది రోజులుగా సంప్రదింపులు జరుపుతున్నారట.తమను సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పిలిచి మాట్లాడలేదని, బీఆర్ఎస్ లో గెలిచి కాంగ్రెస్ లోకి వచ్చిన ఎమ్మెల్యేలతో తమకు ఎదురవుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదనే అసహనంతో రగిలిపోతున్నారట ఆ 10 నియోజకవర్గాల కాంగ్రెస్ నేతలు. సరిగ్గా ఇక్కడే ప్రతిపక్ష బీఆర్ఎస్ చాలా వ్యూహాత్మకంగా అడుగులు వేసిందన్న చర్చ జరుగుతోంది. అలాంటి అసంతృప్త నేతలను కారెక్కిస్తే అధికార పార్టీకి బిగ్ షాకే ఇచ్చినట్టు ఉంటుందన్నది గులాబీ పార్టీ పెద్దల ఆలోచనగా తెలుస్తోందిగులాబీ పార్టీలోని ఓ కీలక నేత కాంగ్రెస్ అసంతృప్త నాయకులతో రాయబారం నెరిపినట్లు తెలుస్తోంది. పార్టీ ఫిరాయించి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయిని, అప్పుడు మీకే టిక్కెట్లు ఇస్తామని హామీ ఇచ్చారట. అంతే కాకుండా వచ్చే సాధారణ ఎన్నికల్లో కూడా టికెట్స్ మీకేనని గ్యారంటీ కూడా ఇచ్చి వారిని కారెక్కించేందుకు ఒప్పించే ప్రయత్నం చేశారట.

ఈనెల 27న ఎల్కతుర్తి రజతోత్సవ సభలో ఆ పది నియోజకవర్గాల్లో కనీసం ఏడెనిమిది నియోజకవర్గాల ముఖ్య నేతలకు పార్టీ అధినేత కేసీఆర్ చేత గులాబీ కండువాలు కప్పించాలి అని బీఆర్ఎస్ ప్లాన్ చేసిందని సమాచారం. అయితే ప్రతిపక్ష బీఆర్ఎస్ పన్నిన రాజకీయ వ్యూహాన్ని ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టినట్లు తెలుస్తోంది.కొన్ని రోజులుగా అధికార కాంగ్రెస్ అసంతృప్తి నేతలతో బీఆర్ఎస్ నేతలు రహస్యంగా సంప్రదింపులు జరపడం, పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నించడంపై కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలను అలర్ట్ చేశారట. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ కాంగ్రెస్ ముఖ్య నేతలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా రంగంలోకి దిగారన్న టాక్ విన్పిస్తోంది. పార్టీ ఫిరాయింపులు జరిగిన ఆ పది నియోజకవర్గాల్లోని అసంతృప్త నేతలను బుజ్జగించేందుకు ప్రయత్నాలను మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.బీఆర్ఎస్ లో గెలిచి కాంగ్రెస్ లోకి వెళ్లిన ఆ 10 మంది ఎమ్మెల్యేలను గులాబీ పార్టీ లోకి మళ్లీ రానిచ్చేది లేదంటున్న అక్కడి కాంగ్రెస్ నేతలపై ఆకర్ష్ అస్త్రం వేస్తోంది . మరి గులాబీ అస్త్రానికి ఆ నేతలు చిక్కుతారా .. కారెక్కుతార అన్నది ఇప్పుడు ఆసక్తి రేపుతోంది .. లేదంటే కాంగ్రెస్ బుజ్జగింపులకు తలొగ్గుతారా..ఈ నెల 27న ఓరుగల్లు వేదికగా ఏం జరగబోతుందో చూడాలి మరి.

# తెలంగాణలో పెరుగుతోన్న వడదెబ్బ మరణాలు..

హైదరాబాద్, ఏప్రిల్ 26

తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు చాలా పెరిగిపోతున్నాయి. సూర్యుడు ఏ మాత్రం జాలి, దయ, కరుణ లేకుండా తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ముఖ్యంగా తెలంగాణలో ఈ ఎండలు మరీ ఘోరంగా ఉన్నాయి. తెలంగాణలోని కొన్ని ప్రదేశాల్లో ఎండతీవ్రత 45 డిగ్రీలుగా ఉంది. దీంతో పలువురు మృత్యువాత పడుతున్నారు. వారం రోజుల్లో తెలంగాణలో హీట్ స్ట్రోక్ వల్ల దాదాపు 11 మంది చనిపోయారని రిపోర్ట్స్ చెప్తున్నాయి. అందుకే ప్రజలు హీటో స్ట్రోక్పై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు నిపుణులు. వేసవి కాలంలో వడదెబ్బను చాలామంది ఎదుర్కొంటారు. అయితే సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే అది ప్రాణాంతకమవుతుందని గుర్తించుకోవాలి. చాలామంది తెలియక దాని గురించి పెద్దగా పట్టించుకోరు. కానీ దానికి ప్రాణాలు హరించే సత్తా ఉందని తెలుసుకోవాలి. అందుకే హీట్ స్ట్రోక్ రాకుండా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ వస్తే ఏమి చేయాలో.. ఎలాంటి టిప్స్ ఫాలో అవ్వాలో ఇప్పుడు చూసేద్దాం. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు లేదా ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు.. శరీర ఉష్ణోగ్రతల్లో మార్పులు సంభవిస్తాయి. అవి హీట్రోస్ట్కి దారితీస్తాయి. ఎండలో తిరిగినప్పుడు లేదా.. ఎండలో ఎక్కువ పని చేసినప్పుడు ఇలా జరుగుతుంది. సాధారణంగా ఉండాల్సిన దానికంటే ఎక్కువగా శరీర ఉష్ణోగ్రతలు మారిపోయి వడదెబ్బకు దారితీస్తాయి. మేజర్ కేస్లలో హీట్ స్ట్రోక్ మెదడు, గుండె, మూత్రపిండాలు, కండారలపై తీవ్రమైన ప్రభావం చూపించి మృత్యువుకు దారి తీస్తాయి.

వడదెబ్బకు కారణాలివే..

అధిక ఉష్ణోగ్రతల్లో బయటకు వెళ్లడం, పని చేయడం వడదెబ్బకు దారితీస్తాయి. శరీరానికి కావాల్సిన నీటిని తీసుకోనప్పుడు.. డీహైడ్రేషన్ వల్ల కూడా హీట్ స్ట్రోక్ వస్తుంది. ఎండ ఎక్కువగా ఉన్న సమయాల్లో ఎక్కువగా శారీరకంగా కష్టపడినా కూడా దీని బారిన పడతారు. బిగుతుగా ఉండే డ్రెస్లు కూడా శరీరానికి గాలిని అందించకుండా ఉక్కబోతను పెంచి వడ దెబ్బ సమస్యలను రెట్టింపు చేస్తాయి. వివిధ ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి కూడా వడదెబ్బ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

వడదెబ్బ లక్షణాలివే..

శరీర ఉష్ణోగ్రత సడెన్గా పెరిగిపోతుంది. 104ఫీఈ లేదా 40ఫీఅ దాటిపోతుంది. చర్మం ఎర్రగా, వేడిగా మారుతుంది. ఎక్కువ చెమట రావడం వల్ల పొడిబారిపోతుంది కూడా. గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస తీసుకోవడంలో సమస్యలు కూడా వడదెబ్బ లక్షణాలే. తీవ్రమైన తలనొప్పి, కళ్లు తిరగడం, కన్ఫ్యూజన్ ఎక్కువ అవ్వడం, వాంతులు, కండరాలు వీక్గా మారడం, నడవలేకపోవడం కూడా హీటోస్ట్రోక్ లక్షణాలని చెప్తున్నారు నిపుణులు.

వడదెబ్బ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకపోవడమే మంచిది. ముఖ్యంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు ఇంట్లోనో లేదా ఆఫీస్లోనో ఉండండి. వీలైనంత వరకు నీటిని తాగండి. మీకు దాహంగా లేకున్నా శరీరానికి నీటిని అందించండి. హైడ్రేషన్ని అందించే ఫుడ్స్ కూడా తినొచ్చు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే వదులుగా, కంఫర్ట్గా ఉండే దుస్తులు వేసుకోండి. తలకు కచ్చితంగా క్యాప్ పెట్టుకోండి. లేదా స్కార్ఫ్ కట్టుకుని కళ్లకు షేడ్స్ పెట్టుకోండి. సన్స్క్రీన్ కచ్చితంగా ఉపయోగించాలి. దీనివల్ల శరీరం కూలింగ్ లక్షణాలు పొంది హీట్ బర్న్స్ రాకుండా చేస్తుంది. చల్లని నీటితో స్నానం చేయండి. వీలైనంతవరకు కూల్గా ఉండేందుకు ట్రై చేయండి. వేడి ఎక్కువగా ఉన్నసమయంలో శారీరక శ్రమ ఎక్కువగా లేకుండా చూసుకోండి. పిల్లలు, ఆరోగ్య సమస్యలున్నవారు, వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలి.

హీట్ స్ట్రోక్ వస్తే ఫాలో అవ్వాల్సిన టిప్స్..

ఒకవేళ ఎవరైనా వడదెబ్బతో ఇబ్బంది పడుతుంటే వారికి వెంటనే ఫస్ట్ ఎయిడ్ అందించాలి. బాధిత వ్యక్తిని ముందు నీడలోకి తీసుకెళ్లాలి. శరీరంపై బిగుతుగా ఉన్న దుస్తులు తీసేయాలి. చల్లని నీటిని కాకుండా నార్మల్ నీటిని చిన్న చిన్నగా వ్యక్తికి అందించాలి. గాలి ఆడేలా చూసుకోవాలి. వెంటనే వైద్యుల దగ్గరికి తీసుకెళ్తే మరీ మంచిది. సరైన జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బ రాకుండా చూసుకోవచ్చు. కానీ మీకు వడదెబ్బ వస్తుందని అనిపించిన వెంటనే నీడ ఉండే ప్రదేశాలకు వెళ్లిపోండి. తగినంత నీటిని అందించడం వల్ల శరీరంలోని ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయి. మీరు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాలు పోయే ప్రమాదముంది. కాబట్టి వీలైనంత వరకు నిపుణుల సూచనలు ఫాలో అయిపోండి.

## ఎరుపెక్కుతున్న కర్రెగుట్టలు

వరంగల్, ఏప్రిల్ 26,

నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్కు భద్రతా బలగాలు శ్రీకారం చుట్టాయి. దీంతో తెలంగాణ- ఛత్తీస్గఢ్ సరిహద్దు కర్రెగుట్టలు ఎరుపెక్కుతున్నాయి. ఛత్తీస్గడ్ రాష్ట్రం బీజాపుర్ జిల్లా.. తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లాల్లో విస్తరించి ఉన్న అడవుల్లోకి సాయుధ బలగాలు దూసుకెళ్తున్నాయి. తారసపడుతున్న మావోయిస్టులపై విరుచుకుపడుతున్నాయి. దీనికి సంబంధించిన ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు దాదాపు 100 పైగా ఐఈడీలను నిర్వీర్యం చేసినట్లు తెలుస్తోంది. కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న బలగాలకు అత్యవసర సామగ్రి, ఆహార పదార్థాలను వెంకటాపురం నుంచి హెలికాప్టర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.నడిపల్లి, పూజారికాంకేర్, నంబిలో ప్రధానంగా కాల్పులు జరుగుతున్నాయి. ఊసూరు, రాంపురం, భీమంరంపాడు, కస్తూరిపాడు, చినవుట్లపల్లి, పెదవుట్లపల్లి, గుంజపర్తి, గల్గం, ఎలిమిడి, చెలిమెల, డోలీ, పామునూరు తదితర గ్రామాల్లో ఐఈడీ శబ్దాలు, కాల్పుల మోతతో అక్కడి జనం వణికిపోతున్నారు.ఎండ తీవ్రతకు భద్రతా బలగాలు వడదెబ్బ బారినపడుతున్నాయి. కూంబింగ్లో అస్వస్థతకు గురైన సుమారు 15 మందిని వెంకటాపురం చేర్చారు. మావోయిస్టు పార్టీ మిలిటరీ విభాగం పీఎల్జీఏ లక్ష్యంగానే పోలీసు బలగాలు బచావో కర్రెగుట్టలు ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి..తెలంగాణలోని ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం మండలాలతోపాటు ఛత్తీస్గఢ్ వైపు బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్ సరిహద్దులుగా సుమారు 90 కిలోమీటర్ల పొడవున ఈ కొండలు విస్తరించి ఉన్నాయి. సముద్ర మట్టానికి సుమారు 9 వేల అడుగుల ఎత్తులో ఉన్నాయి..దాదాపు 10 నుంచి 15 కిలోమీటర్ల మేర విస్తీర్ణం ఉండటంతో.. కొన్నేళ్లుగా మావోయిస్టులు స్థావరంగా మార్చుకున్నారు. దాదాపు వెయ్యి మంది పీఎల్జీఏ సభ్యులు ఇక్కడే ఉన్నట్లు నిఘావర్గాల అనుమానిస్తున్నాయి.కేంద్ర కమిటీ అగ్రనాయకులు హిడ్మా, దేవ, వికాస్, దామోదర్ వంటి వారు ఈ గుట్టల్లోనే ఉన్నట్లు భద్రతా బలగాలు భావిస్తున్నాయి. దీంతో సుమారు 3 వేల మంది బలగాలు ఈ ఆపరేషన్లో నిమగ్నమైనట్లు సమాచారంకొందరు గుట్టల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. మరికొందరు ఊసూరు బ్లాక్తోపాటు ఇటు వాజేడు, వెంకటాపురం వైపు మకాం వేసినట్లు తెలుస్తోంది. అటువైపు ఛత్తీస్గఢ్ ప్రాంతంలో వేల సంఖ్యలో బలగాలు తిష్ఠ వేసి ఉన్న నేపథ్యంలో.. మావోయిస్టులు తెలంగాణ వైపు గుట్టలు దిగక తప్పదన్న అంచనాతో మాటు వేసినట్లు తెలుస్తోంది.మావోయిస్టు పార్టీలో పీఎల్జీఏనే మిలిటరీ ఆపరేషన్లు నిర్వహిస్తోంది. 1999 డిసెంబరు 2న ఉమ్మడి కరీంనగర్ జిల్లా మల్హార్ మండలం కొయ్యూరు ఎన్కౌంటర్లో పీపుల్స్వార్ కేంద్ర కమిటీ సభ్యులు నల్లా ఆదిరెడ్డి, ఎర్రంరెడ్డి సంతోష్రెడ్డి, శీలం నరేశ్ మృతిచెందారు. ఆ తరువాత పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీజీఏ) ఏర్పాటైంది.సీపీఐ-పీపుల్స్వార్తో మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ ఆఫ్ ఇండియా2004 సెప్టెంబరు 21న విలీనమై.. సీపీఐ-మావోయిస్టుగా అవతరించింది. ఈ క్రమంలో మిలిటరీ విభాగం పీఎల్జీఏగా అవతరించింది..పార్టీలోని సెంట్రల్ మిలిటరీ కమిషన్(సీఎంసీ)కి కోరుట్లకు చెందిన దేవ్జీ నేతృత్వం వహిస్తున్నారు. కానీ.. మోస్ట్ వాంటెడ్ హిడ్మా ఆధ్వర్యంలోని మొదటి ప్లటూన్ కీలకంగా ఉంది. దీన్ని నిర్మూలించగలిగితే మావోయిస్టు సీఎంసీ బలహీనపడుతుందని నిఘావర్గాలు నమ్ముతున్నాయి. ఈ నేపథ్యంలోనే కర్రెగుట్టల్లో హిడ్మా బృందం కోసం ముమ్మరంగా వేట కొనసాగిస్తున్నాయి.

## ఎల్కతుర్తి సభకు భారీ ఏర్పాట్లు.. పార్కింగ్ ప్రాంతాలు ఇవే

వరంగల్, ఏప్రిల్ 26

ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభా ప్రాంగణానికి చేరుకునేలా జోన్లవారీగా రూట్ మ్యాప్లను సిద్ధం చేశారు. 5 జోన్లను ఏర్పాటు చేస్తున్నారు. సభా ప్రాంగణానికి మొత్తం నాలుగు రహదారుల ద్వారా వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. అందులో మూడు జాతీయ రహదారులు సహా.. సభ జరిగే చింతలపల్లికి చేరుకునేలా ధర్మసాగర్ నుంచి వచ్చే మరో రూట్ను కూడా సిద్ధం చేశారు.

వాహనాల రాకపోకలు ఇలా..

వరంగల్ నుంచి.. ఇది 163వ జాతీయ రహదారి. ఈ రూట్ గుండా వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్నగర్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలు సహా హైదరాబాద్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు వచ్చే అవకాశం ఉంది.

సిద్దిపేట-హుస్నాబాద్ నుంచి.. ఇది 765వ డీజీ జాతీయ రహదారి. ఈ రూట్ నుంచి మెదక్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలు సహా వెస్ట్ ఆదిలాబాద్.. (ఆదిలాబాద్, నిర్మల్, బోథ్, ఖానాపూర్ నియోజక వర్గాలు) నుంచి కార్యకర్తలు వస్తారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.

కరీంనగర్ రూట్.. ఇది 563వ జాతీయ రహదారి. ఈ రూట్ గుండా ఉమ్మడి కరీంనగర్, ఈస్ట్ ఆదిలాబాద్ (సిర్పూర్ కాగజ్నగర్, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, కొంత పరకాల నియోజకవర్గాలు) నుంచి కార్యకర్తలు వచ్చే అవకాశం ఉంది.

ధర్మసాగర్ రూట్.. ధర్మసాగర్ నుంచి చింతలపల్లి సభ జరిగే ప్రాంగణానికి అనుకుని ఉన్న రోడ్డు ఇది. ఈ రూట్ నుంచి స్టేషన్ ఘనపూర్, జనగామ నియోజకవర్గాల నుంచి వాహనాలు వచ్చే అవకాశం ఉంది.

5 జోన్లు..

జోన్ 1- నేషనల్ హైవే 163 మీదుగా గుడెప్పాడ్, ఆరేపల్లి, హసన్పర్తి, ఎల్లాపూర్ వైపు నుంచి వచ్చే వాహనాలతోపాటు.. హసన్పర్తి, ఎల్లాపూర్ మీదుగా ఈ పారింగ్ స్థలానికి చేరుకునే అవకాశం ఉంది. కాకతీయ యూనివర్సిటీ క్రాస్ రోడ్ వరకు వివిధ మార్గాల ద్వారా చేరుకున్న వాహనాలు.. హసన్పర్తి, ఎల్లాపూర్ మీదుగా ఈ జోన్-1 పార్కింగ్కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

జోన్ 2- కరుణాపురం, దేవన్నపేట, మడిపల్లి అనంతసాగర్ మీదుగా ఇక్కడికి చేరుకునే అవకాశం ఉంది. మరో రూట్ వరంగల్ లోని నాయుడు పెట్రోల్ పంప్, భట్టుపల్లి, కడిపికొండ ఆర్వోబీ, మడికొండ మీదుగా.. దేవన్నపేట, మడిపల్లి, అనంతసాగర్ నుంచి ఈ జోన్-2కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. చింతగట్టు, జయగిరి, అనంతసాగర్ మీదుగా కూడా జోన్-2కు చేరుకోవచ్చు.

జోన్ 3- ధర్మసాగర్ మీదుగా దేవునూరు, దామెర, చింతలపల్లి నుంచి వచ్చే వాహనాలు చేసుకునేలా జోన్-3లో ఏర్పాట్లు చేశారు.

జోన్ 4- కరీంనగర్ జాతీయ రహదారి 563 మీదుగా వచ్చే వాహనాలు.. హుజూరాబాద్, కోతులనడుమ, గ్రానైట్ క్వారీ మీదుగా ఈ పార్కింగ్ జోన్-4కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

జోన్ 5- సిద్దిపేట జాతీయ రహదారి 765(డీజీ) మీదుగా సిద్దిపేట, హుస్నాబాద్, ములనూరు, గోపాల్పూర్ క్రాస్రోడ్, ఇందిరానగర్ మీదుగా జోన్-5కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. మరో రూట్లో వేలేరు, కొత్తకొండ, ముత్తారం వైపు నుంచి జోన్-5 పార్కింగ్కు చేరుకునేలా ఏర్పాట్లు జరిగాయి. మరో రూట్ కరీంనగర్ మీదుగా వచ్చే వాహనాలు కోతులనడుమ మీదుగా దారి మళ్లించుకుని గోపాల్పూర్, గోపాల్పూర్ క్రాస్రోడ్, సిద్దిపేట జాతీయ రహదారి మీదుగా ఇందిరానగర్ నుంచి జోన్-5కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

సభకు వచ్చే కార్యకర్తలు, ప్రజలు వీటిని గమనించాలని నేతలు కోరారు. వరంగల్ సీపీ, స్థానిక పోలీసులకు బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పెద్ది సుదర్శన్ రెడ్డి.. పార్కింగ్ జోన్ల గురించి వివరించారు. పోలీసులతో చర్చించి వీటిని ఫైనల్ చేశారు.

## ప్రమాదంలో హైదరాబాద్ అడుగంటిన భూగర్బ జలాలు: వాటర్ ట్యాంకర్లే దిక్కు.

హైదరాబాద్

విశ్వనగరంగా ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ లో నీటి కష్టాలు మొదలయ్యాయి చాలా చోట్ల భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. జనవరి నుంచి మార్చి నెలాఖరుకే గ్రేటర్ లో భూగర్భ జలాలు 25 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు చేరాయి. మే చివరి నాటికి ప్రమాదకర స్థాయిలో నీటి నిల్వలు మరింత పడిపోతాయని భూగర్భశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చే నెలలో ఎండలు మరింత ముదిరే ప్రమాదం ఉన్నందున ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్ ప్రజలు నిత్యం ఎన్నోరకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు ట్రాఫిక్ రద్దీ, అకాల వర్షాలు, వరదలు అయితే తాజాగా నగర వాసులకు మరో కష్టం వచ్చి పడింది. హైదరాబాద్ నగరంలో భూ గర్భ జలాలు అడుగంటినట్లు అధికారులు చెబుతున్నారు. గతేడాది జనవరితో పోలిస్తే.. ఈ ఏడాది జనవరిలో చాలా వరకు భూగర్భ జలాలు అడుగంటినట్లు గుర్తించారు. కూకట్పల్లి ప్రాంతంలో అత్యధికంగా 25.9 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు వెళ్లినట్లు అధికారులు అంచనా వేశారు. మరోవైపు కూకట్పల్లి జోన్లో భారీ భవనాల నిర్మాణం వల్ల నీటి లభ్యత తగ్గిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మే చివరినాటికి ఇక్కడ పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉండే అవకాశం ఉందని భూగర్భజల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

మరోవైపు కూకట్పల్లి జోన్లో భారీ భవనాల నిర్మాణం వల్ల నీటి లభ్యత తగ్గిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మే చివరినాటికి ఇక్కడ పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉండే అవకాశం ఉందని భూగర్భజల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్ నగర వ్యాప్తంగా 53 ప్రాంతాల్లో విశ్లేషించగా.. 33 ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గాయి. 2024 జనవరి కంటే జలాలు అడుగంటిపోగా మరో 20 ప్రాంతాల్లో మెరుగ్గా ఉన్నట్లు వెల్లడించారు. 2024 డిసెంబరు, ఈ ఏడాది జనవరి చివరి నాటికి హైదరాబాద్ నగరంలో 0.58 మీటర్ల మేర భూగర్భ జలాలు తగ్గినట్లు గుర్తించారు.

## బస్సు బోల్తా? పలువురికి గాయాలు

పల్నాడు, ఏప్రిల్ 26

పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి చీరాల వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు నకరికల్లు మండలం శాంతినగర్ వద్ద బోల్తా పడింది. బస్సు బోల్తా పడే సమయానికి 25 మంది బస్సులో ప్రయాణిస్తున్నట్టు సమాచారం. ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. అయితే బస్సు శిథిలాల మధ్య ఓ మహిళ ఇరుక్కుపోయింది. మహిళను కాపాడటానికి క్రేన్లను రంగంలోకి దించారు. బస్సు పగలగొట్టి రెండు గంటల పాటు కష్టపడి బస్సులో ఇరుక్కుపోయిన మహిళను కాపాడారు పోలీసులు. మితిమీరిన వేగంతోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. గాయపడిన వారిని హాస్పిటల్ కి తరలించారు

## కమాన్ పూర్ లో వైద్య విద్యార్థుల సందర్శన.

కమాన్ పూర్

రామగుండం సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రభుత్వ వైద్య కళాశాల 2023 బ్యాచ్ వైద్య విద్యార్థులు 150 మంది వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందు సింగ్ ఆదేశానుసారము కుటుంబ దత్తత కార్యక్రమం ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రాం కమాన్ పూర్ యందు చేపట్టడం జరిగింది. వైద్య విద్యార్థులు దత్తత తీసుకున్న కుటుంబాల వివరాలను సేకరించారు, మరియు గ్రామ ప్రజలు వేసవి లో వడదెబ్బ కు గురిగాకుండ ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, రాబోవు వర్షాకాలం లో వచ్చె మలేరియ డెంగు మొదలగు వ్యాదులు రాకుండ ఉ డేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వివరించడం జరిగింది., ప్రజలకు తగిన సలహాలు సూచనలతో పాటు ఏవైనా అనారోగ్య సమస్యలు ఉన్నట్లయితే, వైద్య విద్యార్థులను సంప్రదించిన తగిన సమయంలో స్పందించి వారి యొక్క చికిత్సను ప్రత్యేక వైద్య నిపుణులచే అందించగలమని, వైద్య విద్యార్థులు గృహ సందర్శన చేసినప్పుడు తెలియజేశారు. ఈ కార్యక్రమం కమ్యూనిటీ మెడిసిన్ ఇన్చార్జి హెచ్ ఓ డి డాక్టర్ శ్రీదేవి అధ్యక్షతన సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు డా. కావ్య రాసన్, డా. అఖిల్, గ్రేడ్ వన్ ఎం ఎస్ డబ్ల్యూ పి.రవీందర్ మరియు ఆరోగ్య పర్యవేక్షకులు టి.నాగరాజు, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్. రవి సింగ్ మరియు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మరియు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

====================

## అమల్లోకి హెచ్ఎండీఏ బిల్డ్ నౌ సేవలు

హైదరాబాద్, ఏప్రిల్ 26

భవన నిర్మాణలు, లేఔట్ల అనుమతుల మంజూరు విషయంలో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త సంస్కరణలు తీసుకువచ్చింది. వేగంగా, సులభంగా అనుమతులు పొందేలా 'బిల్డ్ నౌ' అప్లికేషన్ సేవలను ప్రవేశపెట్టింది. మొదట్లో జీహెచ్ఎంసీ పరిధిలోనే ఈ సేవలు అందబాటులో ఉండగా? తాజాగా హెచ్ఎండీఏ పరిధిలోనూ ఈ సేవలు ప్రారంభమయ్యాయి.టీజీ - బీపాస్ ద్వారా భవన నిర్మాణాలు, లేఔట్లకు అనుమతులు వచ్చేవి. అయితే ఇందులో ఇబ్బందులకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టడంతో పాటు అత్యంత వేగంగా అనుమతులు ఇచ్చేలా తెలంగాణ ప్రభుత్వం 'బిల్డ్ నౌ' వ్యవస్థను తీసుకువచ్చింది. తొలుత ఈ విధానాన్ని జీహెచ్ఎంసీ పరిధిలో అమలు చేయగా.. సత్ఫలితాలు వచ్చాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే ఈ అప్లికేషన్ ప్రత్యేకతలు, వివరాలెంటో ఇక్కడ తెలుసుకోండి?.

'బిల్డ్ నౌ' అప్లికేషన్ సేవలు - ముఖ్యమైన అంశాలు:

రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం 'బిల్డ్ నౌ' అనే అప్లికేషన్ తీసుకువచ్చింది.ఈ అధునాతన అప్లికేషన్ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

ముందుగా ఈ సేవలను జీహెచ్ఎంసీ పరిధిలో అమలు చేశారు. దీని ద్వారానే దరఖాస్తులను స్వీకరించి? భవన నిర్మాణ అనుమతులను మంజూరు చేశారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్చైన్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఆటోమేషన్ వంటి సాంకేతికతను ఉపయోగిస్తారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా అత్యంత వేగంగా అనుమతులు మంజూరు చేయడమే 'బిల్డ్ నౌ' సేవల ముఖ్య ఉద్దేశ్యం.

ప్రస్తుతం ఊఓఆం పరిధిలోనూ ఈ అప్లికేషన్ ద్వారానే అనుమతులు మంజూరు చేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లోనూ ఈ సేవలు అమలు చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఈ అప్లికేషన్ ద్వారా వేగంగా ప్రాసెస్ పూర్తవుతుంది. అనుమతి ప్రక్రియ అంతా ఒకే చోట పూర్తి చేయగల ఏకీకృత సింగిల్ విండో ఇంటర్ ఫేస్ అని అధికారులు చెబుతున్నారు.

గతంలో భవన నిర్మాణ అనుమతులు వారం నుంచి నెలరోజుల్లో వచ్చేవి. అయితే ఈ అప్లికేషన్ ద్వారా అత్యంత వేగంగా? నిమిషాల వ్యవధిలోనే ఔట్ పుట్ ఉంటుంది.

టీజీబీపాస్లో ఇన్స్టంట్ అప్రూవల్కు, మిగతా అనుమతులకు వేర్వేరు విండోస్ ఉండేవి. కానీ బిల్డ్ నౌలో అన్నింటికీ ఒకే విండోతో త్వరితగతిన అనుమతులు జారీ అవుతాయి. భవన నిర్మాణం పూర్తయ్యాక ఎలా ఉంటుందో కూడా త్రీడీలో డిస్ ప్లే అవుతుంది.

ఇప్పటి వరకు డ్రాయింగ్స్ పరిశీలనకే ఎక్కువ రోజులు పట్టేది. కానీ ఎలాంటి భవనాలకైనా ఈ కొత్త అప్లికేషన్ ద్వారా నిమిషాల్లోనే పరిశీలన పూర్తవుతుంది.

ప్రతి అప్లికేషన్ ను ధృవీకరించి ట్రాక్ చేసేందుకు బ్లాక్ చైన్ టెక్నాలజీ అవకాశం కల్పిస్తుంది. ఎలాంటి లోపాలు లేకుండా పని చేసేలా ఈ బిల్డ్ నౌ అప్లికేషన్ ను రూపొందించారు.

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, టీడీసీపీ, ఇతర స్థానిక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థలు, అగ్నిమాపకశాఖ, నీటిపారుదలశాఖ, రెవెన్యూ, మూసీ నది అభివృద్ధి సంస్థ, తదితర శాఖలన్నీ బిల్డ్ నౌతో అనుసంధానమై ఉంటాయి.

## గులాబీ పండుగకు సర్వం సిద్ధం

కోదాడరాష్ట్రంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్నా నాయకుడు కేసీఆర్ అని మాజీ ఎమ్మెల్యే , బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బొల్లం మల్లయ్య యాదవ్, మాజీ ఎంపీ, జిల్లా పార్టీ అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ లు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని గడపగడపకు వెళ్లి బొట్టుపెట్టి బిఆర్ఎస్ సభకు హాజరుకావాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ గారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... రేవంత్ సర్కార్ లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నమన్నారు.అసెంబ్లీ ఎన్నికల తరువాత పార్టీ కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపడంలో ముందు వరుసలో ఉంటుందని ఆయన అన్నారు.రేవంత్ రెడ్డి ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నట్లుగా భావిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆవిర్భవించి, ఆ లక్ష్యాన్ని సాకారం చేసి, నిన్న అధికార పార్టీగా రాష్ట్రాన్ని పదేండ్ల పాటు సుభిక్షంగా, సుఖ, సంతోషాలకు ఆలవాలంగా నిలబెట్టి, నేడు ప్రతిపక్ష పార్టీగా 16 నెలలుగా తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వ దుర్మార్గాన్ని అడుగడుగునా చీల్చి చెండాడుతూ తెలంగాణ ప్రాంత ప్రయోజనాలే ఆశగా, శ్వాసగా కేసీఆర్ నాయకత్వాన రజతోత్సవం జరుపుకొంటున్న వేళ చరిత్రాత్మకమైన భారీ బహిరంగసభకు భారీగా తరలిరావాలని అన్నారు.

# మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం:శీతల రోషపతి

సూర్యాపేట జిల్లా బ్యూరో(భారతశక్తి) ఏప్రిల్26:ప్రపంచ కార్మిక వర్గానికి పండగ రోజు మేడే ఒకటో తేదీన 1857 సంవత్సరం అమెరికాలోని చికాగో నగరంలో 12 గంటల నుండి 15 గంటలు వెట్టి చాకిరి చేయిస్తున్న శ్రమ దోపిడి దారులకు పని వ్యతిరేకంగా 8 గంటలు పని విధానం కొరకు జరిగిన పోరాటంలో బూర్జువా ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో అమరులైన కార్మిక వర్గానికి గుర్తుగా చేసుకోవటమే మేడే అని టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి గుర్తు చేశారు.



హుజూర్ నగర్ లో పరిశ్రమ ప్రాంతం కార్మికులతో మాట్లాడుతూ ఆరోజు జరిగిన పోరాట 160 సంవత్సరాలు అవుతున్నా ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా భారతదేశంలో శ్రమ దోపిడీ ఇంకా జరుగుతూనే ఉందని కష్టాన్ని తగ్గ ఫలితం ఇవ్వటంలో పరిశ్రమ యాజమాన్యం ముందుకు రాకపోవడం పరిశ్రమల మీద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణ లేకపోవటంతో కనీస వేతనం 26,000 ఇవ్వకపోవడం శ్రమను దోచుకుంటున్నారని అన్నారు. మే 1వ తేదీన జరిగే మేడే ప్రదర్శనలు అన్ని వర్గాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో టి ఎన్ టి యు సీనియర్ నాయకులు గుండెపోయిన వెంకన్న యాదవ్ బాబు రామయ్య వెంకన్న మనీ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో పోస్టల్ ఉద్యోగి తలకు తీవ్ర గాయం:పరామర్శించిన తపాలా ఎస్పి



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 26:రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుచున్న పోస్టల్ ఉద్యోగి దిగ్వాల్ సబ్ పోస్ట్ మాస్టర్ ఆంజనేయులు కుటుంబాన్ని సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ ఎల్ వి మురళి కుమార్ శనివారం నాడు సంగారెడ్డి గోకుల్ హాస్పిటల్ కి వెళ్లి పరామర్శించారు. శుక్రవారం నాడు దిగ్వాల్ లో విధులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో నంది కంది దగ్గర అనుకోకుండా జరిగిన రోడ్డు ప్రమాదంలో తపాలా ఉద్యోగి ఆంజనేయులు తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకున్న పోస్టల్ ఎస్పీఐ సి యూ లో ఉన్న ఆంజనేయులు ఆరోగ్య పరిస్థితినీ గోకుల్ హాస్పిటల్ డాక్టర్ ని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని కోరారు.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని చెప్పి ఓదార్చారు. అన్ని రకాలుగా సహాయక సహకారాలు వారి కుటుంబ సభ్యులకు అందిస్తామని పోస్టల్ ఎస్పీ తెలియజేశారు. ఎస్పీ వెంట డి పి ఏం శ్రీనివాస్ గౌడ్, శివ శంకర్ తదితరులున్నారు.

# భూభారతి చట్టంతో అధికారాల వికేంద్రీకరణ

## -పారదర్శకత, జవాబుదరితనమే భూ భారతి చట్ట%శీ% ముఖ్య ఉద్దేశం

## -రైతులకు అత్యంత ప్రతిష్టాత్మకమైనది భూభారతి చట్టం: జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి(పటాన్చెరు )భారత శక్తి, ఏప్రిల్ 26:భూ భారతి ( భూమి హక్కుల చట్టం- 2025) ను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు.పటాన్ చేరు మండలం కేంద్రంలోని అంబేద్కర్ ఫంక్షన్ హాల్, రామచంద్రాపురం లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్, అమీన్పూర్ మండలం సంబంధించి బాలాజీ కన్వెన్షన్ హాల్లో భూభారతి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో కలెక్టర్ పాల్గొన్నారు.పఠాన్ చెరువు అంబేద్కర్ ఫంక్షన్ హాల్ నందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా భూభారతి- నూతన






ఆర్వోఆర్ చట్టానికి సంబంధించిన అంశాలు, మార్గదర్శకాలపై వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ భూభారతి చట్టంతో అధికారుల వికేంద్రీకరణ జరిగిందని, పారదర్శకత జవాబుదారితనమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం అన్నారు. భూసమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (ఆర్ ఓ ఆర్) చట్టం - 2025 జనవరిలో గెజిట్ రూపంలో వచ్చిందని, సమగ్ర అంశాలను పొందుపరుస్తూ ప్రభుత్వం ఏప్రిల్ 14న ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ వివరించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరాలన్నారు.రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చురాని ,భూ సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగింది అన్నారు.భారతి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో జిల్లాలోని అన్ని మండలాల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం భూ భారతి చట్టంతోపాటు, నియమ నిబంధనలు ఒకేసారి తయారు చేసిందని, రికార్డుల నిర్వహణ, సవరణ, రిజిస్ట్రేషన్ ,మ్యుటేషన్, సాదా బైనామ ,పౌతి,వంటి అంశాలను కలెక్టర్ వివరించారు .ధరణిలోని సమస్యలను దృష్టిలో ఉంచుకొని రైతుల సంక్షేమం కోసం తీసుకువచ్చిన భూ భారతి చట్టం పై పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు.రైతులు, ప్రతి ఒక్కరికీ నూతన చట్టం భూభారతి, దానిలోని అంశాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జిల్లా స్థాయిలో రైతులకు, ప్రజలకు లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా న్యాయపరమైన సేవలు అందిస్తామన్నారు.ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే భూభారతిలో మూడంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని కలెక్టర్ అన్నారు. ప్రజలందరికీ ఉచిత న్యాయ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.ఇంతకు ముందు ఉన్న చట్టం లో కోల్పోయిన హక్కులు, కొత్త చట్టంలో ఎలాంటి హక్కులపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరు తమ తమ గ్రామాల్లో నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం గురించి ప్రజలకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, పటాన్చెరు, అమీన్పూర్, రామచంద్రపురం మండలాల తాసిల్దారులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, రైతులు రైతు సంఘ నాయకులు, రెవెన్యూ అధికారులు, సంబంధిత ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి, చలివేంద్రం కేంద్రమును ప్రారంభించిన జిల్లా కలెక్టర్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 26: శనివారం టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి, అధ్యక్షతన జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సాంగ్వాన్, ఇంచార్జ్ అదనప కలెక్టర్ చందర్ నాయక్ ముఖ్య అతిథులుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము నందు ఏర్పాటు చేసిన అంబలి, చలివేంద్రం కేంద్రమును కామారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సాంగ్వాన్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగినది.అనంతరం ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, కామారెడ్డి కలెక్టరేట్లో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని ఇట్టి సందర్భంగా పలు సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వచ్చే ప్రజలకు టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, అంబలి కేంద్రం వారి యొక్క దాహం తీర్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని అదేవిధంగా టిఎన్జీవోస్ ఆధ్వర్యంలో చలివేంద్రం, అంబలి కేంద్రం ఏర్పాటు చేయడం అనేది చాలా గొప్ప విషయమని అదేవిధంగా ఇట్టి కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్న టిఎన్జీవోస్ సంఘానికి అభినందనలు తెలిపారు.

అనంతరం జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం చలివేంద్రం, అంబలి కేంద్రంను టీఎన్జీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం టీఎన్జీవోస్ జిల్లా శాఖ యొక్క ఆనవాయితీగా వస్తుందని.ఇట్టి చలివేంద్రం, అంబలి కేంద్రం ఏర్పాటు చేయడానికి ప్రోత్సహిస్తున్న జిల్లా కలెక్టర్ కు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి,కార్యదర్శి ఎం నాగరాజు,సహాధ్యక్షులు ఎం చక్రధర్,కోశాధికారి ఎం. దేవరాజు,ఉపాధ్యక్షులు యు. సాయిలు, జె. శ్రావణ్ కుమార్, బి లక్ష్మణ్, రాజమణి, బి. రాజేశ్వర్, ఎంసీ పోచయ్య,జాయింట్ సెక్రెటరీలు రమణ, ఖదీర్, రాజమణి, రాజారెడ్డి,ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్,కల్చరల్ సెక్రెటరీ రాజ్ కువమార్,ఈసీ వెంబర్ శ్రీకాంత్, సాయినాథ్, అశ్వాక్,కామారెడ్డి అర్బన్ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, సృజన్ రెడ్డి, వారి కార్యవర్గ సభ్యులుఉపాధ్యక్షులు ఎం కిషన్,టిఎవిఎమ్ఎస్ఎ రాష్ట్ర కోశాధికారి కె శివకుమార్ సమీకృత జిల్లా కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 26: అర్హత కలిగిన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం దోమకొండ మండల కేంద్రం లోని షేక్ అల్మా బేగం, భర్త - సద్దాం పాషా ఇంటిని కలెక్టర్ పరిశీలించారు. తాను, తన భర్త కూలీ పనిచేస్తూ ఇద్దరు పిల్లల కుటుంబాలతో నివసిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలనీ కలెక్టర్ ను కోరారు. ప్రస్తుతం ఉన్న ప్లాస్టిక్ కవర్స్ లతో కప్పబడి ఉన్న ఇంటిలో గత 20 సంవత్సరాల నుండి నివసిస్తున్నామని, తన కున్న ఇంటి స్థలంలో ఇల్లు కట్టుకుంటానని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే 5 లక్షల రూపాయలతో పాటు ఇతర మార్గాల ద్వారా ఇల్లు నిర్మించుకుంటానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల



ప్రత్యేక అధికారిని జ్యోతి ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది ఉన్నారు.

# ఆపరేషన్ నిమిత్తమై సకాలంలో మహిళకు రక్తం అందజేసిన : ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 26: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు వైద్యశాలలో జ్యోతి కి ఆపరేషన్ నిమిత్తమై ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో దోమకొండ మండల కేంద్రానికి చెందిన ఇంజీరింగ్ విద్యార్థి దీకొండ రోహిత్ అశ్వత్ మానవతా దృక్పథంతో స్పందించి వెంటనే సకాలంలో రక్తాన్ని అందజేసి ప్రాణదాతగా నిలిచారని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు.యువత రక్తదానం పట్ల ఉన్న అపోహలను విడనాడాలని ఆపదలో ఉన్నవారికి రక్తాన్ని అందజేసి ప్రాణదాతలు కావాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛందంగా రక్తదానం చేయాలనుకున్నవారు వారి యొక్క వివరాలను 9492874006 నెంబర్ కు తెలియజేయాలని అన్నారు.

# పహల్గాం మారణ హెూమాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

## -మతోన్మాదాన్ని వ్యతిరేకించండి-లౌకిక వాదాన్ని బలపర్చండి

## -టీజేప సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా




సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) ఏప్రిల్ 26:జమ్ము కాశ్మీర్ పహల్గాంలో ఏప్రిల్ 22న జరిగిన నరమేధాన్ని టీజేఏ సూర్యాపేట జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ లోని టీజేఏ జిల్లా కార్యాలయంలో శనివారం తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా మాట్లాడుతూ జమ్మూ కశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ కొనసాగిస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలన్నారు.

సుందరమైన పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదుల ఉన్మాదపు చర్యను తీవ్రంగా ఖండించారు.అనంతరం టీజేఏ జిల్లా కమిటీ సభ్యులు నవాబ్ జాని మాట్లాడుతూ భూతల స్వర్గం కశ్మీర్ లోయ అందాన్ని చూడటానికి వచ్చి విషాదాన్ని ఎదుర్కొన్న పర్యాటక బాధితుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేస్తూ ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భారత ఇంటెలిజెన్స్ బ్యూరో మరియు కాశ్మీర్ పోలీస్ నిఘా వర్గాల వైఫల్యం భద్రతా లోపాలను ఎత్తి చూపుతోందని దేశంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భారత భూ భాగంలోకి చొరబడే ముష్కరుపై కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి పెట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా కమిటీ సభ్యులు నందిగామ నాగేంద్ర కుమార్, కొత్తపల్లి మధు సూధన్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ద్వారానే సమాజంలో అసమానతలు తొలగిపోతాయి : జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి)ఏప్రిల్ 26:ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా భోధించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరం లో కోదాడ నియోజకవర్గం పరిధిలోని కోదాడ, మునగాల, నడిగూడెం, అనంతగిరి, చిలుకూరు మండలాలకి చెందిన ఎం ఈ ఓ, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో ఫౌండేషన్ లీటరసీ న్యూమరసీ (ఎఫ్ ఎల్ యన్ ) పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చక్కగా చదువు చెప్తామని విద్యార్థుల్లో నమ్మకం కల్గించి వచ్చే విద్యా సంవత్సరంకి ఎక్కువ మంది విద్యార్థులు నమోదు అయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.ప్రతి రోజు విద్యార్థులకి తెలుగు రాయటం, చదవటం నేర్పించెందుకు ఉపాధ్యాయులు సమయం కేటాయించాలని సూచించారు. మొదటగా సులభమైన పదాలు నేర్పి తదుపరి కఠినమైన పదాలు నేర్పాలని అర్థం కానీ విద్యార్థులకి వీడియోల ద్వారా తెలుగు, హిందీ భాషలు నేర్పించాలని తెలిపారు. కోదాడ నియోజకవర్గంలో కొన్ని మండలాలలోని పాఠశాలలో మెరుగైన ఫలితాలు ఉన్నాయని, మిగతా పాఠశాల లో కూడ మెరుగైన ఫలితాలు సాదించాలి అని, దాని కొరకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు.ఉపాధ్యాయులు భాద్యతగా ఉంటూ గత సంవత్సరం లో జరిగిన వైఫల్యాలు సరిచేసి వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాష రాయటం, చదవటం అలాగే ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ లో కనీస సామర్థ్యాలు, అలాగే జడ్పి ఉన్నత పాఠశాలలో ఎల్ టి ఐ మొదటి 60 రోజులలో నేర్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులకి నేర్పించే పద్ధతులు మారినాయి కానీ ఫలితాలు రావటం లేదని ఇక నుండి మండల స్థాయి లో జిల్లా స్థాయి లో ఎఫ్ ఎల్ ఎన్ పై సమీక్షలు నిర్వహిస్తామని ప్రతి పరీక్షకి విద్యార్థుల చదువులో పురోగతి ఉండాలని తెలిపారు.ఇక నుండి ప్రతి సంవత్సరం మంచి గా చదివిన విద్యార్థులకి, మంచి ప్రదర్శన చూపెట్టిన ఉపాధ్యాయులకి మండల స్థాయి లో ఒక బహుమతి, జిల్లా స్థాయి లో 3 బహుమతులు అందజేస్తామని తెలిపారు.ప్రతి వారం వీక్లీ సెల్ఫ్ అసెస్ మెంట్ లో వెనకబడిన విద్యార్థులు ఎలా మెరుగుపర్చాలో అలోచించి మంచి సంకల్పంతో పని చేసి ఆలోచనలను ఆచరించేలా ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.ఎఫ్ ఎల్ ఎన్ పై 60 రోజుల




కార్యాచరణ లో భాగంగా బృందాలు ఏర్పాటు చేసి పేపర్లు తయారు చేసి ఆగస్టు 15 లోపు అందరికి కనీస సామర్థ్యాలు నేర్పించి జిల్లాలో తెలుగు రాయటం, చదవటం రాని వారు ఉండవద్దని,వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ద పెట్టి డిజిటల్ క్లాస్ లు నిర్వహించి అర్థం అయ్యేలా భోదించాలని తెలిపారు.మంచి ప్రదర్శన చూపెట్టిన విద్యార్థులకి పెన్నులు, పుస్తకాలు ఇచ్చి అభినందించాలని అన్నారు.విద్యార్థుల పట్ల టీచర్లు స్నేహ పూర్వకంగా ఉంటూ కనీస సామర్థ్యాలు నేర్పాలని ఎం ఈ ఓ లు,కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు విద్యార్థుల వారీగా,పాఠశాల వారీగా పరిశీలించాలని తెలిపారు.ఇప్పటి నుండిఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా అందరు ప్రతి విద్యార్థివి అసెస్ మెంట్ రిపోర్ట్, వార్షిక పరీక్షల రిపోర్ట్, విద్యార్థుల పని తీరు, తెలుగు ఇంగ్లీష్, గణితంలో కనీస సామర్థ్యాలు, ఎఫ్ ఎల్ ఎన్ అలాగే వార్షిక పరీక్షలు పై రిమార్కులు,విద్యా సంవత్సరంలో విద్యార్థులు ఉపాధ్యాయులు చేపట్టిన మంచి కార్యాచరణ, వెనకబడిన విద్యార్థుల జాబితా రూపొందించి వారిని ఎలా మెరుగుపర్చాలనే ప్రణాళికలు సిద్ధం చేసి హెడ్ మాస్టర్ కి అప్పగిస్తే హెడ్ మాస్టర్ పాఠశాల మొత్తం నివేదిక మండల విద్యాధికారికి సమర్పించాలని తెలిపారు. ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని తీవ్రంగా పరిగణించి విద్యార్థుల సంఖ్య పెంచాలని, పాఠశాల లో చేరిన వారికి మెరుగైన విద్యా భోదించాలని అన్నారు.ఈ సమావేశంలో డిఈఓ ఆశోక్, క్వాలిటీ కో ఆర్డినేటర్ జనార్దన్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రవణ్ కుమార్, ఇంక్లూజివ్ కో ఆర్డినేటర్ రాంబాబు, జనరల్ ఈక్వలిటీ కో ఆర్డినేటర్ పూలమ్మ, ఎం ఈ ఓ లు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆది వరాహ లక్ష్మి నరసింహ వేణుగోపాల స్వామి క్షేత్రములో ఘనంగా గోమాత పూజ



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) ఏప్రిల్26:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామంలో కొలువైన శ్రీ ఆది వరాహ లక్ష్మి నరసింహ వేణుగోపాల స్వామి దివ్య క్షేత్రము లో ప్రతి శుక్రవారం నిర్వహించే గోపూజ కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటలకు గోపూజ కార్యక్రమం భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది.అనంతరం శ్రీ గోదా వేణుగోపాల భజన భక్త బృందం వారిచే వైభవంగా భజన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ యరగాని గురవయ్య, ధర్మకర్తలుగంధం అంజయ్య, తిపురిశెట్టి హరీష్,మేరీగా కవిత, వేముల నరసింహారావు,కోల కృష్ణ ప్రసాద్, పెనుబెల్లి హనుమంతరావు,ఆలయ అర్చకులు హరీష్ కుమారా చార్యులు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణరావుమరియు కొత్త ప్రవీణ్ కుమార్ గుప్త, రాంబాబు, మణికంత, సంజయ్ కుమార్, ప్రదీప్ వర్మ, అనసూర్యమ్మ, లక్ష్మి,ప్రవళిక, ప్రియాంక మరియు ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు,

# చదువుల తల్లికి చేయూత

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, ఏప్రిల్ 26:బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు గౌతమి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 470 కి గానూ 467 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించిన విషయం తెలుసుకున్న బోనకల్లు మండలం రాపల్లి గ్రామానికి చెందిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, అతని సోదరుడు హర్షిక ఆగ్రోస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ తోట నాగకృష్ణ లు గౌతమిని సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ...... బోనకల్ మాజీ జడ్పిటిసి బానోతు కొండ ఇచ్చిన పిలుపుమేరకు గౌతమి కి ఆర్థిక సహాయంగా 10000 రూపాయలను అందించినట్లు తెలిపారు. ఎన్నో కష్టనష్టాలను ఓర్చి తల్లిదండ్రులు మరణించిన పట్టు విడవకుండా చదివి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంక్ సాధించడం అంటే ఆషామాషీ విషయం కాదన్నారు. కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చని గౌతమి నిరూపించిందన్నారు. ప్రస్తుత యువత గౌతమిని ఆదర్శంగా తీసుకొని ఉన్నద శిఖరాలకు ఎదగాలని వారు సూచించారు. రాబోయే రోజుల్లో కూడా గౌతమీకి సహాయ సహకారాలు అందిస్తామని వారు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. గౌతమిని సన్మానించిన వారిలో సాయి, తరుణ్ తదితరులు ఉన్నారు.



# భూభారతి చట్టంతో రైతు సమస్యలు పరిష్కారం

జయశంకర్ భూపాలపల్లి

సంవత్సరాలుగా భూమి సాగుచేసుకుంటున్నా పట్టాలు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, భూ భారతి చట్టంతో అలాంటి రైతులకు పట్టాదారు పాసుపుస్త కాలు జారీ చేయడం జరుగుతుందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం రేగొండ, గోరి కొత్తపల్లి మండలాల్లోని రైతు వేడుకల్లో నిర్వహించిన భూ భారతి అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ సంవత్సరాలు గా భూమి సాగు చేసుకుంటున్నా పట్టాలు రాక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దరణిలో అప్పీలు చేసుకునే అవకాశం లేకపోవడం వల్ల ప్రజలు సివిల్ కోర్టులకు వెళ్లాల్సి వచ్చేదని, దానివల్ల ఎన్నో వ్యవప్రయాసలు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేసి ప్రజలకు సులువుగా భూ హక్కులు కల్పించే చట్టాన్ని తెస్తామని ప్రకటించామని, ఇచ్చిన మాట మేరకు ఈ 14వ తేదీన డా బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా భూ భారతి చట్టం అందుబాటులోకి తెచ్చామని అన్నారు. చట్టంపై ప్రజలకు అవగాహన కల్పనకు అన్ని మండలాల్లో భూ భారతి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం పైలెట్ ప్యాజెక్టు క్రింద ఎంపిక చేసిన మండలాల్లో రైతులతో సభలు, సమావేశాలు నిర్వహిస్తూ రైతుల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామని, రైతులు ఇచ్చిన సలహాలు, సూచనలు పరిశీలించి చట్టంలో చేర్చనున్నట్లు తెలిపారు.

ధరణితో రెవెన్యూ అధికారులు, ఇటు ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని కొందురైతే ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. భూమిని నమ్ముకున్న ప్రతి రైతుకు అన్ని హక్కులు కల్పించి వ్యవసాయ పనిముట్లుకు రాయితీ ఇవ్వనున్నామని స్పష్టం చేశారు. సన్నరకం ధాన్యానికి మన నియోజకవర్గంలో 30 కోట్లు బోనస్ ఇచ్చామని తెలిపారు. అలాగే 380 కోట్లు రుణమాఫీ జరిగినట్లు తెలిపారు. భూ భారతి చట్టం వల్ల రైతులకు మేలు జరుగుతుందని వివరించారు.

# మే 6 నుండి 8వ తేదీ వరకు తిరుమలలో శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు

తిరుపతి జిల్లా ప్రతి నిధి, ఏప్రిల్ 26, (భారత శక్తి):శ్రీ పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు మే 6 నుండి 8వ తేదీ వరకు తిరుమలలో ఘనంగా జరుగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.మూడు రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల్లో తొలిరోజు శ్రీ మలయప్పస్వామివారు గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడవాహనంపై వేంచేపు చేస్తారు. మరోపక్క ఉభయ నాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. ఆ తరువాత కల్యాణమహొూత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తారు.

::ఆర్జిత సేవలు రద్దు ::

శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు సందర్భంగా మే 6 నుండి 8వ తేదీ వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

::పౌరాణిక ప్రాశస్త్యం :

పురాణాల ప్రకారం సుమారు ఐదు వేల ఏళ్ల కిందట, అంటే కలియుగం తొలినాళ్లలో సాక్షాత్తు వైకుంఠం నుండి శ్రీమహావిష్ణువు శ్రీ వేంకటేశ్వరునిగా భూలోకానికి తరలివచ్చారు. ఆ సమయంలో నారాయణవనాన్ని పరిపాలిస్తున్న ఆకాశరాజు తన కుమార్తె అయిన శ్రీ పద్మావతిని శ్రీవేంకటేశ్వరునికిచ్చి వివాహం చేశారు. ఆకాశరాజు వైశాఖశుద్ధ దశమి శుక్రవారం పూర్వ ఫల్గుణి నక్షత్రంలో నారాయణవనంలో కన్యాదానం చేసినట్లుగా శ్రీ వేంకటాచల మహాత్మ్యం గ్రంథం తెలుపుతోంది.ఆనాటి పద్మావతీ శ్రీనివాసుల కల్యాణోత్సవ ముహూర్తానికి గుర్తుగా ప్రతి వైశాఖ శుద్ధ దశమినాటికి ముందు ఒక రోజు, తరువాత ఒక రోజు కలిపి మొత్తం మూడురోజుల పాటు పద్మావతీ పరిణయోత్సవాన్ని టీటీడీ నిర్వహిస్తోంది. 1992వ సంవత్సరం నుంచి ఈ ఉత్సవం జరుగుతోంది. ఆనాటి నారాయణవనానికి ప్రతీకగా తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో శ్రీ పద్మావతీ పరిణయ వేడుకలు జరగడం విశేషం.

# రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలి : జిల్లా కలెక్టర్







(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 26: రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గాంధారి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను కలెక్టర్ పరిశీలించారు. అకాల వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున రైతులకు టార్పాలిన్స్ అందజేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటది వెంటనే మిల్లులకు తరలించాలని అన్నారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలు, కొనుగోళ్లు జరిగిన వాటి వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, జిల్లా సహకార అధికారి రామ్ మోహన్, తహసీల్దార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# వారసత్వ భూముల పట్టా మార్పిడికి క్షేత్ర స్థాయి విచారణ:జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) ఏప్రిల్ 26: భూ సమస్య ల పరిష్కారం కొరకు రైతులకి ప్రభుత్వమే ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. నడిగూడెం మండల కేంద్రంలోని కొల్లు పాపయ్య పంక్షన్ హాల్ లో నిర్వహించిన భూ భారతి చట్టం - 2025 అవగాహన సదస్సు ను జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలోని వైఫల్యాలను గుర్తించి ఎలా పరిష్కారం చేయాలో తెలంగాణ ప్రభుత్వం అలోచించి గౌరవ ముఖ్యమంత్రి గారు ధరణి పై కమిటీ వేసి 18 రాష్ట్రాలలో పరిశీలించి నిపుణులు, రిటైర్డ్ రెవిన్యూ అధికారులు, మేధావులు, సలహాలు సూచనలు తీసుకొని ముసాయిదాను తయారుచేపించి పబ్లిక్ డోమైన్ లో పెట్టి ప్రజల నుండి అభిప్రాయాలు, సూచనలు సేకరించి అద్భుతమైన భూ భారతి చట్టం రూపొ%శీ%ధించి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రియల్ 14 రోజున భూ భారతి చట్టం గౌరవ ముఖ్యమంత్రి గారి చేతులమీదుగా ప్రారంభించి 4 మండలాలో పైలెట్ ప్రాజెక్ట్ చేపట్టడం జరిగిందని, తదుపరి జిల్లాకి ఒక్క మండలం లో అమలు చేసి ఇంకా ఏమైనా సమస్యలు పరిష్కరించలేనివి ఉన్నాయో గుర్తించి భూ భారతి పోర్టల్ లో తగు మార్పులు చేసి తర్వాత జూన్ 2 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో అమలు చేయటం జరుగుతుందని తెలిపారు.గతంలో గ్రామ స్థాయి లో భూ సమస్యలను పరిష్కరించేందుకు వి ఆర్ ఓ, వి ఆర్ ఎ లు ఉండే వారని ధరణి చట్టం అమలులోనికి వచ్చిన తర్వాత వి ఆర్ ఓ వ్యవస్థ రద్దు కావటం తో ఆ రోజు నుండి నాలుగున్నర సంవత్సరాలుగా రైతులు భూ సమస్యలకి ఎవరికీ చెప్పాలో తెలియక తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ తిరిగితే మా దగ్గర అధికారాలు లేవని కలెక్టర్ దగ్గరికి వెళ్ళాలి అని చెప్పేవారని మారుమూల ప్రాంతం నుండి సూర్యాపేటకి రావాలంటే చాలా ఇబ్బంది పడ్డారని తెలియజేశారు.

భూ భారతి చట్టం అమలులోకి రాగానే వెంటనే భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు రూల్స్ తయారు చేసారని రెవిన్యూ వ్యవస్థ బలపర్చేందుకు అధికారాలు వికేంద్రికరణ చేస్తూ ప్రతి గ్రామానికి గ్రామ పాలనాధికారులను నియమించటం జరుగుతుందని తెలిపారు.పాత పాస్ పుస్తకం లో భూమి ఉన్నవారికి, విస్తీర్ణం మొత్తం నమోదు కానీ వారు భూ భారతి ద్వారా సమస్యలు పరిష్కారం అయి వారి పేర్లు రికార్డులలో నమోదు చేసి పాస్ పుస్తకాలు జారీ చేస్తామని తెలిపారు.రైతులు వ్యవసాయం గురించి ఆలోచించాలి కానీ భూమి హక్కులు గురించి ఆలోచించ కూడదు అని ప్రభుత్వం అన్ని భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టం రూపకల్పన చేసారని తెలిపారు.ఈ సందర్బంగా కలెక్టర్ భూ భారతి రైతులకి వరం లాంటిది అని పేర్కొన్నారు.ఒక తెల్ల కాగితం ద్వారా పెద్ద మనుషుల మధ్య కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధికరణ చేయుటకి సాదాబైనామా ద్వారా 2020 లో దరఖాస్తులు స్వీకరించారు కానీ ధరణి చట్టం వల్ల అమలు కాలేదు.ఇప్పుడు భూ భారతి ద్వారా సాదాబైనామా ధరఖాస్తులు ఆర్డీఓ క్షేత్ర స్థాయి లో పరిశీలించి న్యాయమైన వాటిని క్రమబద్ధికరించి పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేస్తారని తెలిపారు.ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా అసైన్మెంట్ కమిటీ లు వేసి రక్షించటం జరుగుతుందని తెలిపారు.ధరణిలో ఒకరి భూమిపై కోర్ట్ కేసు ఉంటే ఆ సర్వే నెంబర్ అంత నిషేధిత జాబితాలో బ్లాక్ చేయటం జరిగిందని భూ భారతి లో మాత్రం కోర్ట్ వివాదం ఉన్న భూమి మాత్రమే నిషేధిత జాబితాలో ఉంచటం జరుగుతుందని తెలిపారు.వారసత్వం భూములు పట్టా మార్పిడి చేసేటప్పుడు కొంత



మంది వారసులు మాత్రమే వచ్చి భూమిని పట్టా చేపించుకునే వాళ్లు అని తర్వాత మిగిలిన వారసులు వచ్చి మాకు తెలీయకుండా కొంతమంది మాత్రమే పట్టా చేపించుకున్నారని పిర్యాదు చేస్తే మా పరిధిలో లేదు కోర్ట్ ద్వారా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ లు చెప్పేవారు అని కానీ భూ భారతి ద్వారా తహసీల్దార్ వద్ద ఏమైనా తప్పు జరిగితే ఆర్డీఓ కి, ఆర్డీఓ వద్ద తప్పు జరిగితే కలెక్టర్ కి అప్పీల్ చేసేలా రెండు అంచేలా అప్పీల్ వ్యవస్థను భూ భారతిలో పొందుపర్చారని అన్నారు.రైతులకి పాస్ బుక్స్ ఉంటేనే సంతోషం అని భూ భారతి అమలు తర్వాత రెవిన్యూ బృందాలు గ్రామాల వారీగా భూ సమస్యలు పరిశీలించి రైతులకి మేలు జరిగేలా పాస్ పుస్తకాలు జారీ చేయటం జరుగుతుందని తెలి పారు.సమావేశం కి వచ్చిన ప్రతి ఒక్కరు భూ భారతి చట్టం గురించి తెలియని ప్రజలకి చెప్పాలని సూచించారు.తదుపరి అదనపు కలెక్టర్ పి రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి భూ సమస్యలు పరిష్కరించేందుకు సరళంగా, సులభంగా అర్థం అయ్యేలా భూ భారతి చట్టం రూపొందించటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ధరణి అమలు తర్వాత వి ఆర్ ఓ, వి ఆర్ ఎ లు రద్దు కావటం, తహసీల్దార్ లకి అధికారాలు లేకపోవటంతో చిన్న చిన్న సమస్యలు ఎవరికీ చెప్పాలో తెలియక రైతులు చాలా ఇబ్బంది పడ్డారని , ప్రతి చిన్న సమస్యకి సూర్యాపేట వచ్చి పిర్యాదు చేయాలంటే చాలా ఇబ్బంది పడ్డారని తెలిపారు. త్వరలో రెవిన్యూ వ్యవస్థ బలపర్చేందుకు జిల్లాలో 279 మంది గ్రామపాలనాధికారులు రాబోతున్నారని సమస్యలు గ్రామ స్థాయి లోనే పరిష్కరించటం జరుగుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయగానే సర్వే మ్యాప్ ని పాస్ పుస్తకంలో ప్రింట్ ఇస్తారని అన్నారు. భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కరించేలా జూనియర్ అసిస్టెంట్ నుండి కలెక్టర్ వరకు రాష్ట్ర స్థాయి లో, జిల్లా స్థాయి లో శిక్షణ నిర్వహించడం జరిగిందని తెలిపారు.తదుపరి కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ పిపిటి ద్వారా భూ భారతి చట్టంను రైతులకి క్లుప్తంగా సెక్షన్ ల వారీగా వివరించారు.నడిగూడెం మండలం కాగిత రామచంద్రపురం లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు.నీలం శైలజ భర్త లింగయ్య ఇంటి నిర్మాణ పనులను పరిశీలించి పునాది పూర్తి అవ్వగానే లక్ష రూపాయలు అకౌంట్ లో పడినాయా అని అడగగా లక్ష రూపాయలు వచ్చాయని సంతోషంగా కలెక్టర్ కి తెలిపారు.ఈ కార్యక్రమం లో ఆర్డీఓ సూర్యనారాయణ, మండల స్పెషల్ అధికారి సతీష్ కుమార్, తహసీల్దార్ సరిత,ఎంపిడిఓ సంజీవ య్య,మార్కెటింగ్ కమిటీ చైర్మన్ తిరుపతమ్మ,ఎడిఎ యల్లయ్య,పిఎసి ఎస్ చైర్మన్లు కొల్లు రామారావు, రాజేష్, ,పంచాయతీ కార్యదర్శిలు ఉమరాణి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వారికంటే ఐపీఎల్‌లో అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ భత్యమే ఎక్కువ: సునీల్ గావస్కర్

: భారత జట్టుకు ఎంపిక కావాలంటే ఇప్పుడు సులువైన మార్గం ఐపీఎల ఒకప్పుడు దేశవాళీ క్రికెట్‌లో మంచి ఆటతీరు కనబరిస్తే ఠక్కున అవకాశాలు వచ్చేవి. ఇప్పుడైతే ఐపీఎల్‌లో నిలకడగా ఆడుతున్నాడా? లేదా? అనేది మేనేజ్‌మెంట్ చూస్తుందనడంలో సందేహం లేదు. అలాగని రంజీల్లో ఆడేవారికి విలువ లేదా? అంటే ఉంది కానీ ఐపీఎల్‌తో పోలిస్తే అవకాశాలపరంగానే కాకుండా జీతభత్యాల్లోనూ వ్యత్యాసం ఉందనేది మాజీ క్రికెటర్ల అభిప్రాయం. ఈ అంశంపై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తన విశ్లేషణను వెల్లడించాడు.



"పెద్దగా పరిచయం లేని క్రికెటర్ కూడా ఐపీఎల్‌లో ఒక్క మంచి ఇన్నింగ్స్ ఆడినా చాలు గొప్ప గౌరవం అందుకొంటాడు. అదే జాతీయ ఛాంపియన్‌షిప్ రంజీ ట్రోఫీలో ఎంత రాణించినా కనీసం హెడ్‌లైన్స్‌లోనూ కనిపించడు. ఐపీఎల్‌లో అలా కాదు. ఇప్పటికే ఎన్నో సందర్భాలను మనం చూశాం. సీజన్‌లో ఒకటి లేదా రెండు మ్యాచుల్లో దూకుడుగా ఆడితే అతడి పేరు మారుమోగిపోతుంది. కెరీర్ మొత్తం రంజీ ట్రోఫీ ఆడినా అది సాధ్యం కాదు. ఐపీఎల్‌కున్న భారీ ఆదరణే దీనికి కారణం. బ్రాడ్‌కాస్ట్‌పరంగానూ స్పాన్సర్‌షిప్ హక్కులు రూ.కోట్లలో ఉంటాయి. ఐపీఎల్ కంటే ఎక్కువగా దేశవాళీలో ఆడే వారికి ఇది పెద్దగా రుచించని వాస్తవం. రంజీ ట్రోఫీ, విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ సీజన్‌లు అన్నీ కలిపి ఆడినా.. ఐపీఎల్‌లో అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌కు వచ్చే కనీస మొత్తం రూ.30 లక్షలకు దరిదాపుల్లో ఉండదు. ఈ అసమానతను తగ్గించాల్సిన అవసరం బీసీసీఐతోపాటు అన్ని రాష్ట్రాల క్రికెట్ బోర్డులపై ఉంది. ఇప్పటికే ముంబయి తమ రంజీ ప్లేయర్లకు బీసీసీఐతో సమానంగా చెల్లింపులు చేస్తోంది" అని గావస్కర్ వెల్లడించాడు.

ప్రస్తుతం స్టార్లుగా మారిన బుమ్రా, హార్దిక్, సిరాజ్, యశస్వి, కేఎల్ రాహుల్, చాహల్.. ఇలా చాలామంది జాతీయజట్టుకు ఎంపికైనవారే. తాజాగా 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ రూ.1.1 కోట్ల ప్యాకేజీని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

# ధోనీ ఎప్పుడూ వేలంలో పాల్గొనలేదు: సురేశ్ రైనా



: ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్‌కు వెళ్లడం దాదాపు కష్టమే. తొమ్మిది మ్యాచుల్లో కేవలం రెండే విజయాలు సాధించిన సీఎస్కే.. మిగిలిన ఐదు గెలిచినా నాకౌట్‌కు వెళ్తుందని చెప్పడం కష్టమే. అయితే, ఇతర జట్ల అవకాశాలను ఎలా ప్రభావితం చేస్తుందనేదే ఇక్కడ ఆసక్తికర అంశం. మెగా వేలం సందర్భంగా సరైన ఆటగాళ్లను ఎంపిక చేసుకోవడంలో సీఎస్కే వెనకబడిందని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా వ్యాఖ్యానించాడు. ధోనీ ఉన్నా.. మిగతా క్రికెటర్లు రాణిస్తేనే విజయం వరిస్తుందని పేర్కొన్నాడు. అయితే, ధోనీ ఎప్పుడూ వేలంలో పాల్గొనేవాడు కాదని గుర్తు చేశాడు.

"కాశీ సర్‌కు అడ్మినిస్ట్రేషన్‌కు 30ఏళ్లకుపైగా అనుభవం ఉంది. రూపా మేడమ్‌కు క్రికెట్ వ్యవహారాలు, ఆటగాళ్లను ఎలా కొనుగోలు చేయాలి, గ్రూప్‌ను ఎలా నిర్వహించాలనే విషయాలపై పట్టు ఉంది. అయితే, ఈసారి మాత్రం సరైన ఎంపికలు చేసినట్లు అనిపించలేదు. ఇది ప్రతిఒక్కరి భావన. ధోనీ ఉన్నా కూడా ఇలా ఎందుకు జరిగిందని కొందరు అడుగుతారు. నిజాయతీగా చెప్పాలంటే.. నేను ఎప్పుడూ వేలం ప్రక్రియకు హాజరుకాలేదు. అలాంటి చర్చల్లో భాగం కాలేదు. నేనెప్పుడైనా సరే రిటైన్ చేసుకున్న ప్లేయర్ల గురించే మాట్లాడేవాడిని. ధోనీ కూడా తన నిర్ణయం ఏంటో చెప్పేవాడు. అంతేకానీ, వేలంలో ఎప్పుడూ భాగం కాలేదు. కోర్ గ్రూప్‌లోని సభ్యులే ఆక్షన్‌లో పాల్గొంటారు. ధోనీ ఇలాంటి వేలానికి హాజరుకాడు. ఓ నలుగైదుగురు పేర్లను మాత్రమే సూచిస్తాడు. ఎవరిని రిటైన్ చేసుకోవాలో చెబుతాడు. 43 ఏళ్ల వయసులో అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా బరిలోకి దిగిన ధోనీ కష్టపడుతుంటే.. మిగతా పది మంది ఏం చేస్తున్నట్లు? అందులో కొందరికి రూ.18 కోట్లు, రూ.17 కోట్లు, రూ.12 కోట్లు దక్కాయి. మేనేజ్‌మెంట్ నమ్మి అవకాశం ఇచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాలి. కానీ, ప్రతిసారీ అదే తప్పులతో విఫలం కావడం చూస్తున్నాం" అని రైనా వ్యాఖ్యానించాడు.

### ఇప్పటికీ మాది మంచి జట్టే: ఫ్లెమింగ్

"ఈ ఓటమిపై మాట్లాడటం కష్టంగా అనిపిస్తోంది. మా దగ్గరున్న అత్యుత్తమ క్రికెటర్లతో సరైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నించాం. మా స్టైల్ క్రికెట్ ఆడాం. ఆక్షన్‌లో మంచి జట్టును తయారుచేసుకోవడం కీలకం. ఈ విషయంలో మాకంటే ఇతర టీమ్‌లు కాస్త మెరుగ్గా ఉన్నాయి. టాప్ ఆర్డర్ నుంచి కింది వరుస వరకూ ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. కీలక ఆటగాళ్లకు గాయాలు, కొందరు ఫామ్‌లో లేకపోవడం కూడా ప్రభావం చూపించింది" అని సీఎస్కే కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వెల్లడించాడు.

### ఇక ట్రయల్ రన్‌లా..: రాయుడు

"ప్రస్తుత సీజన్‌లో సీఎస్కే పరిస్థితి బాగోలేదు. అథమంలో అథమంగా మారింది. అయితే, ఇక నుంచి నేర్చుకొనేందుకు చక్కటి అవకాశం వచ్చినట్లే. ఎంఎస్ ధోనీ కూడా వచ్చే ఎడిషన్ కోసం జట్టును తయారుచేసే పనిలో పడతాడు. ఇప్పుడు డెవాల్డ్ బ్రెవిస్, ఆయుష్ మాత్రే వంటి కుర్రాళ్లు వెలుగులోకి వచ్చారు. భవిష్యత్తు సీజన్లలో వారే కీలకంగా మారే అవకాశం లేకపోలేదు. వ్యక్తిత్వపరంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పుడంతా ట్రయల్‌రన్‌లా సీఎస్కే జట్టును చూడొచ్చు" అని అంబటిరాయుడు ( ) వ్యాఖ్యానించాడు.




# సన్‌రైజర్స్ 'ప్లేఆఫ్స్' ఛాన్స్‌లు.. నితీశ్ మాటలు నిజం కావాలంటే?

హైదరాబాద్ గతేడాది ఐపీఎల్ ఫైనలిస్ట్. ఈసారి ప్లేఆఫ్స్ బెర్తు కోసం ఆపసోపాలు పడుతోన్న టీమ్. ఆడిన తొమ్మిది మ్యాచుల్లో కేవలం మూడే విజయాలు. తాజాగా చెన్నైపై విజయం అనంతరం సన్‌రైజర్స్ ఆటగాడు నితీశ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. 'గతేడాది ఆర్సీబీలా ఇప్పుడు మేం ఆడి ప్లేఆఫ్స్‌కు చేరతాం' అని అన్నప్పటికీ.. అదేమంత తేలికైన విషయం కాదు. ఐదింట్లో ఐదు గెలవాలంటే '100' శాతం కంటే అదనంగా శ్రమించాలి.

ఐపీఎల్ 18వ సీజన్ ప్లేఆఫ్స్ రేసు ఆసక్తికరంగా మారుతోంది. గుజరాత్ (12 పాయింట్లు), దిల్లీ (12), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (12), ముంబయి ఇండియన్స్ (10) టాప్ -4లో కొనసాగుతున్నాయి. మూడు విజయాలు సాధించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (6) ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది. ఇలాంటి జట్టుకు ప్లేఆఫ్స్ అవకాశాలు అతిస్వల్పం. మిగిలిన ఐదు మ్యాచులను ఎస్ఆర్‌హెచ్ గెలవాలి. అప్పుడు హైదరాబాద్ ఖాతాలో 16 పాయింట్లు అవుతాయి. ఇక్కడ విజయంతోపాటు మంచి రన్‌రేట్ సాధించాల్సి ఉంటుంది. ఎందుకంటే ప్రస్తుతం ఎస్ఆర్‌హెచ్ నెట్‌రన్‌రేట్ -1.103 చాలా తక్కువగా ఉంది. ఐదులో రెండు మ్యాచులను ఉప్పల్‌లో ఆడటం కలిసొచ్చే అంశం. అయితే, ఇక్కడ పిచ్‌లు విభిన్నంగా ఉంటాయని ఇప్పటికే రుజువైంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌ను ఎంచుకుంటే సన్‌రైజర్స్‌కు తిరుగుండదు.

### ఎవరితో ఎప్పుడు?

మే 2 : గుజరాత్ టైటాన్స్‌తో అహ్మదాబాద్ వేదికగా హైదరాబాద్ తలపడనుంది. ఇది బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే మైదానం. ఇప్పటి వరకు ఐపీఎల్‌లో ఇరు జట్లూ ఐదు సార్లు తలపడగా.. గుజరాత్ 3, హైదరాబాద్ ఒక్క మ్యాచ్‌లోనే గెలిచింది.

మే 5: ఉప్పల్ వేదికగా దిల్లీ క్యాపిటల్స్‌ను హైదరాబాద్ ఢీకొట్టనుంది. ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో మినహా.. గత నాలుగింట్లోనూ సన్‌రైజర్స్ ఓటమిపాలైంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా పిచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఐపీఎల్‌లో 25 మ్యాచుల్లో ఇరు జట్లూ తలపడగా.. హైదరాబాద్ 13 మ్యాచుల్లో గెలిచింది. దిల్లీ 12 మ్యాచుల్లో విజయం సాధించింది.

మే 10: కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుతో ఉప్పల్‌లోనే హైదరాబాద్ తలపడనుంది. ఇరు జట్లూ ఐపీఎల్‌లో 29 మ్యాచుల్లో ఢీకొన్నాయి. ఇందులో కోల్‌కతా 20 మ్యాచుల్లో గెలవగా.. హైదరాబాద్ కేవలం తొమ్మిదింట్లో విజయం సాధించింది.

మే 13: చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును సన్‌రైజర్స్ ఢీకొట్టనుంది. పిచ్ ఎలా స్పందిస్తుందో ఎవరూ చెప్పలేని పరిస్థితి. ఇక్కడ మ్యాచుల ఫలితాలు అలానే ఉన్నాయి. ఒక్కోసారి బ్యాటింగ్‌కు, మరొకసారి బౌలింగ్‌కు సహకరిస్తోంది. ఐపీఎల్‌లో ఇరు జట్లూ 25 సార్లు తలపడగా.. హైదరాబాద్ (13)దే ఆధిక్యం. బెంగళూరు 11 మ్యాచుల్లో గెలిచింది.

మే 18: లీగ్‌స్టేజ్‌లో ఇది చివరి మ్యాచ్. ఏకనా స్టేడియం వేదికగా లఖ్‌నవూ-హైదరాబాద్ మ్యాచ్ జరగనుంది. ఇది బౌలింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్. ఇక్కడ కనీసం 175 పరుగులు చేస్తే విజయం సాధించేందుకు అవకాశాలు మెండు. ఇప్పటి వరకు ఐపీఎల్‌లో ఇరు జట్లూ ఐదు మ్యాచుల్లో తలపడ్డాయి. ఇందులో లఖ్‌నవూ 4, హైదరాబాద్ కేవలం ఒక్క మ్యాచ్‌లోనే గెలిచింది.

# దేశం కంటే ఏదీ ముఖ్యం కాదు

%దిల్లీ: బెంగళూరు వేదికగా తన ఆధ్వర్యంలో జరిగే ఎన్‌సీ క్లాసిక్ జావెలిన్ త్రో ఈవెంట్‌కు పాకిస్థాన్ ఆటగాడు అర్షద్ నదీమ్‌ను ఆహ్వానించడంపై చెలరేగుతున్న దుమారంపై భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఆవేదన వ్యక్తం చేశాడు. పహల్గాం ఉగ్ర దాడికి రెండు రోజుల ముందు ప్రపంచ స్టార్ త్రోయర్లతో పాటు నదీమ్‌కు ఆహ్వానం పంపానని.. ప్రస్తుత పరిస్థితుల్లో అతడు పోటీపడే అవకాశమే లేదని చెప్పాడు. నదీమ్‌కు ఆహ్వానం పంపడంపై తనను, తన తల్లిని తీవ్రంగా దూషిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడంపై అతడు స్పందించాడు.



"ప్రపంచంలో మేటి జావెలిన్ త్రోయర్లను భారత్‌కు తీసుకురావాలన్నదే నా టోర్నీ లక్ష్యం. పహల్గాంలో ఉగ్ర దాడికి 48 గంటల ముందు సోమవారం అందరు అథ్లెట్లతో పాటు నదీమ్‌కు ఆహ్వానం పంపించాను. ప్రస్తుత పరిస్థితుల్లో నదీమ్ పోటీపడే అవకాశమే లేదు. దేశం కంటే ఏదీ ముఖ్యం కాదు. ఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల గురించే ఆలోచిస్తున్నా. దేశంలో అందరిలాగే నా మనసూ గాయపడింది. కోపం వస్తోంది. మన దేశం ప్రతీకారం తీర్చుకుంటుందని పూర్తి విశ్వాసంతో ఉన్నా. ఇన్నేళ్లు దేశ గౌరవం కోసం ఎంతో పోరాడాను. అయినా నా చిత్తశుద్ధిని ప్రశ్నిస్తుంటే ఎంతో బాధగా ఉంది. నన్ను, నా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శిస్తున్న వాళ్లకు వివరణ ఇచ్చుకుంటున్నందుకూ బాధేస్తోంది" అని అన్నాడు.

పారిస్ క్రీడల్లో స్వర్ణం గెలిచిన తర్వాత నదీమ్ కూడా తన తనయుడి లాంటి వాడే అని తన తల్లి సరోజ్ అన్న మాటలను ప్రస్తావిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఆమెను లక్ష్యంగా చేసుకోవడాన్ని నీరజ్ తప్పుపట్టాడు. "జనం ఎందుకు ఎప్పటికప్పుడు అభిప్రాయాలు మార్చుకుంటారో తెలియదు. ఏడాది క్రితం మా అమ్మ నదీమ్ గురించి ఏదో తెలియనితనంతో ఒక వ్యాఖ్య చేసింది. అప్పుడు అందరూ ఆమెను పొగిడారు. ఇప్పుడే అదే జనం ఆ మాటలను పట్టుకుని దూషిస్తున్నారు" అని నీరజ్ పేర్కొన్నాడు.

# ఆసియా అథ్లెటిక్స్‌కు నిత్య, నందిని, రజిత

దిల్లీ: ఈనాడు సీఎస్ఆర్ కార్యక్రమం 'లక్ష్య' క్రీడాకారిణులు నిత్య గంధె, అగసర నందిని (తెలంగాణ), కుంజా రజిత (ఆంధ్రప్రదేశ్) భారత జట్టులో చోటు సంపాదించారు. దక్షిణ కొరియాలో జరిగే ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో నిత్య, నందిని, రజిత భారత్ తరఫున బరిలో దిగనున్నారు. జాతీయ సీనియర్ ఫెడరేషన్ కప్‌లో సత్తాచాటిన 'లక్ష్య' అథ్లెట్లకు ఈ అవకాశం లభించింది. 200 మీ పరుగు, 4x100 మీ రిలేలో నిత్య పాల్గొననుంది.



హెప్టాథ్లాన్‌లో నందిని తన అదృష్టం పరీక్షించుకోనుంది. 4x400 మీ రిలేలో రజిత పోటీపడనుంది. 100 మీ హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజి (ఆంధ్రప్రదేశ్) బరిలో దిగనుంది. మే 27 నుంచి 31 వరకు జరిగే ఈ పోటీలకు 59 మంది క్రీడాకారులతో భారత బృందం వెళ్తుంది. భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఆసియా టోర్నీకి దూరంగా ఉండనున్నాడు.




# ఆసియా అథ్లెటిక్స్‌కు నిత్య, నందిని, రజిత

దిల్లీ: ఈనాడు సీఎస్ఆర్ కార్యక్రమం 'లక్ష్య' క్రీడాకారిణులు నిత్య గంధె, అగసర నందిని (తెలంగాణ), కుంజా రజిత (ఆంధ్రప్రదేశ్) భారత జట్టులో చోటు సంపాదించారు. దక్షిణ కొరియాలో జరిగే ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో నిత్య, నందిని, రజిత భారత్ తరఫున బరిలో దిగనున్నారు. జాతీయ సీనియర్ ఫెడరేషన్ కప్‌లో సత్తాచాటిన 'లక్ష్య' అథ్లెట్లకు ఈ అవకాశం లభించింది. 200 మీ పరుగు, 4x100 మీ రిలేలో నిత్య పాల్గొననుంది. హెప్టాథ్లాన్‌లో నందిని తన అదృష్టం పరీక్షించుకోనుంది. 4x400 మీ రిలేలో రజిత పోటీపడనుంది. 100 మీ హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజి (ఆంధ్రప్రదేశ్) బరిలో దిగనుంది. మే 27 నుంచి 31 వరకు జరిగే ఈ పోటీలకు 59 మంది క్రీడాకారులతో భారత బృందం వెళ్తుంది. భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఆసియా టోర్నీకి దూరంగా ఉండనున్నాడు. డైమండ్ లీగ్, ప్రపంచ ఛాంపియన్‌షిప్, ఎన్‌సీ క్లాసిక్‌లపై మరింతగా దృష్టిసారించడం కోసమే నీరజ్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. 2023లో బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్‌లో భారత్ 27 పతకాల (6 స్వర్ణాలు, 12 రజతాలు, 9 కాంస్యాలు)తో మూడో స్థానం సాధించింది. జపాన్ ప్రథమ, చైనా ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

సెమీస్‌లో ఖుషి, టీకమ్

అమ్మాన్ (జోర్డన్): ఆసియా అండర్-17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు ఖుషి చంద్, టీకమ్ సింగ్ సెమీఫైనల్లో ప్రవేశించారు. బాలికల 44 కిలోల విభాగంలో ఖుషి వియత్నాం బాక్సర్ గుయెన్ తి హంగ్‌ను చిత్తు చేసింది. బాలుర 52 కిలోల క్వార్టర్‌ఫైనల్లో టీకమ్ పాలస్తీనాకు చెందిన వొత్మన్ దియాబ్‌పై ఘన విజయం సాధించాడు. ఇప్పటికే భారత్ నుంచి పదకొండు మంది బాక్సర్లు ఈ టోర్నీ సెమీస్‌లో ప్రవేశించారు.

ఆసీస్ పర్యటన మంచి సన్నాహకం: హరేంద్రసింగ్

పెర్త్: భారత మహిళల హాకీ జట్టు సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఆస్ట్రేలియా పర్యటన ఉపయోగపడుతుందని చీఫ్ కోచ్ హరేంద్రసింగ్ అన్నాడు. సలీమా టెటె సారథ్యంలోని భారత్.. ఈనెల 26, 27 తేదీల్లో ఆసీస్-ఎబీ మే 1, 3, 4న సీనియర్ జట్టుతో తలపడనుంది. "బెంగళూరు శిక్షణ శిబిరంలో జట్టు తీవ్రంగా సాధన చేసింది. జట్టు సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఈ పర్యటన ఎంతో ఉపయోగపడుతుంది. క్రీడాకారిణులకు అంతర్జాతీయ మ్యాచ్ అనుభవం అందించడం.. జట్టు లోతును పెంచడం.. కొత్త కూర్పులను ప్రయత్నించడంపై దృష్టిసారించాం. ఆసీస్ సీనియర్, ఎ జట్లతో ఆడటం ద్వారా ఎంతో నేర్చుకోవచ్చు. రాబోయే ముఖ్యమైన టోర్నీలకు సిద్ధమవడానికి ఈ పర్యటన సన్నాహకంగా పనిచేస్తుంది'' అని హరేంద్రసింగ్ తెలిపాడు.

# అమెజాన్ గ్రేట్ సమ్మర్ సేల్.. శాంసంగ్ ఫోన్స్‌పై డిస్కౌంట్

: ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ 'గ్రేట్ సమ్మర్ సేల్'ను ప్రకటించింది. మే 1 నుంచి ఈ సేల్ ప్రారంభం కానుంది. అమెజాన్ ప్రైమ్ సభ్యులకు 12 గంటల ముందునుంచే సేల్ అందుబాటులోకి రానుంది. అంటే మే 1వ తేదీ అర్ధరాత్రి నుంచే ప్రైమ్ యూజర్లు ఆఫర్లు పొందొచ్చు. మిగిలిన యూజర్లు ఒకటో తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ సేల్‌లో పాల్గొనొచ్చు. సేల్‌లో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కస్టమర్లు 10 శాతం డిస్కౌంట్ పొందొచ్చు. క్రెడిట్ కార్డు, ఈఎంఐ లావాదేవీలపై డిస్కౌంట్ లభిస్తుంది. అమెజాన్-ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డుదారులకు 5 శాతం వరకు క్యాష్‌బ్యాక్, ఎక్స్ఛేంజ్ ఆఫర్స్, నో-కాస్ట్ ఈఎంఐ వంటివి ఉండనున్నాయి.




ముఖ్యంగా ఈ సేల్‌లో శాంసంగ్ ఫోన్లను అమెజాన్ తన మైక్రోసైట్‌లో హైలైట్ చేస్తోంది. శాంసంగ్ గెలాక్సీ ఎస్24 అల్ట్రా, గెలాక్సీ ఏ55 5జీ, గెలాక్సీ ఎం35 5జీ ఫోన్లను డిస్కౌంట్‌లో అందిస్తామని ప్రకటించింది. అయితే వాటి ధరలను మాత్రం వెల్లడించలేదు. వీటితో పాటు షావోమి, ఒప్పో, వివో ఫోన్లు సైతం తక్కువ ధరకే అందించనున్నారు. ఐఫోన్ 15, వన్‌ప్లస్ 13ఆర్, వన్‌ప్లస్ నార్డ్ 4, ఐకూ నియో 10ఆర్ వంటి ఫోన్లపై ఆఫర్లు లభించనున్నాయి. వీటితో పాటు ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌టీవీలు, ఎయిర్ కండీషనర్లపైనా ఆఫర్లు ఉండబోతున్నాయి. సేల్ ప్రారంభం కాబోయే కొన్ని గంటల ముందు మరిన్ని ఆఫర్లు వివరాలు వెల్లడి కానున్నాయి.

# 1% తగ్గిన మారుతీ సుజుకీ లాభం




దిల్లీ: దేశీయ వాహన దిగ్గజ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ), గత ఆర్థిక సంవత్సరం (2024-25) నాలుగో త్రైమాసికంలో రూ.3,911 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఇదే కాల లాభం రూ.3,952 కోట్లతో పోలిస్తే ఇది 1% తక్కువ. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.38,471 కోట్ల నుంచి రూ.40,920 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.34,624 కోట్ల నుంచి 8.5% పెరిగి రూ.37,585 కోట్లకు చేరాయి. స్టాండలోన్ ప్రాతిపదికన.. నికర లాభం రూ.3,878 కోట్ల నుంచి రూ.3,711 కోట్లకు తగ్గింది. మొత్తం విక్రయాలు రూ.36,697 కోట్ల నుంచి రూ.38,849 కోట్లకు పెరిగాయి.

6 లక్షల వాహనాల అమ్మకాలు

జనవరి- మార్చి త్రైమాసికంలో రికార్డు స్థాయిలో 6,04,635 వాహనాలను సంస్థ విక్రయించింది. దేశీయ విక్రయాలు 3%, ఎగుమతులు 8% చొప్పున పెరగ్గా, మొత్తం వృద్ధి 3.5 శాతంగా నమోదైంది. దేశీయ విక్రయాలు 5,19,546గా, ఎగుమతులు 85,089 వాహనాలుగా నమోదయ్యాయి.

పూర్తి ఆర్థిక సంవత్సరంలో: 2024-25లో కంపెనీ లాభం రూ.14,500 కోట్లుగా ఉంది. 2023-24లో వచ్చిన రూ.13,488 కోట్లతో పోలిస్తే ఇది 7.5% ఎక్కువ. మొత్తం ఆదాయం రూ.1,41,858 కోట్ల నుంచి రూ.1,52,913 కోట్లకు పెరిగింది. దేశీయంగా 19,01,681 వాహనాలను విక్రయించగా, 3,32,585 వాహనాలను ఎగుమతి చేయడంతో.. మొత్తం 22,34,266 వాహనాలను విక్రయించినట్లయ్యింది. ఇప్పటివరకు ఇవే అత్యధికమని సంస్థ పేర్కొంది.

ఒక్కో షేరుపై రూ.135 డివిడెండ్‌ను కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. 2023-24లో ఇది రూ.125 మాత్రమే. కంపెనీ నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కొయిచి సుజుకీ నియమితులయ్యారు.

గత ఆర్థిక సంవత్సరం స్థాయిలోనే..

గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మెరుగ్గా ఉండకపోవచ్చని ఎంఎస్ఐ ఛైర్మన్ ఆర్‌సీ భార్గవ పేర్కొన్నారు. 1-2% వృద్ధినే సియామ్ (వాహన తయారీదార్ల సంఘం) అంచనా వేస్తోందని గుర్తు చేశారు. ప్రస్తుత ఆర్థికంలో ఎగుమతులు 20% పెరగొచ్చని సంస్థ పేర్కొంది. దేశీయ విపణి స్తబ్దుగా ఉందని, అందువల్లే వృద్ధి చాలా పరిమితంగా ఉండొచ్చని అభిప్రాయపడింది. దేశంలో 12% కుటుంబాలకే కార్లు ఉన్నాయని వెల్లడించింది.

పన్ను ఉపశమనంతో చిన్న కార్లకు గిరాకీ పుంజుకోకపోవచ్చు

మారుతీ ఛైర్మన్ ఆర్‌సీ భార్గవ

దిల్లీ: రూ.12 లక్షల వరకు వార్షికాదాయంపై ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇచ్చినా.. చిన్న కార్లకు గిరాకీ పుంజుకోకపోవచ్చని మారుతీ సుజుకీ ఛైర్మన్ ఆర్‌సీ భార్గవ అభిప్రాయపడ్డారు. దేశీయ వాహన పరిశ్రమ వృద్ధికి చిన్న కార్లు చాలా కీలకమని, వీటికి గిరాకీ పెంచేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలో రూ.12 లక్షల కంటే ఎక్కువ వార్షికాదాయం కలిగిన కుటుంబాలు 12 శాతమే ఉన్నాయని, మిగతా 88% అంతకంటే తక్కువ స్థాయిలోనే ఉన్నాయన్నారు. వీరు రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ ఖరీదైన కార్లను కొనుగోలు చేయలేరని భార్గవ పేర్కొన్నారు. వీరికి అందుబాటు ధరల్లో ప్రారంభస్థాయి కార్లు లభించే చర్యలు అవసరమని స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.8000-9000 కోట్ల మూలధన పెట్టుబడులు పెడతామని వివరించారు.

సెప్టెంబరు నుంచి ఇ-విటారా విక్రయాలు

సెప్టెంబరు నుంచి విద్యుత్ మోడల్ ఇ-విటారా విక్రయాలు ప్రారంభమవుతాయని, 70,000 కార్లను ఎగుమతుల కోసమే ఉత్పత్తి చేయనున్నట్లు వివరించారు. ఏడాది చివర్లో మరో ఎస్‌యూవీ మోడల్‌ను తీసుకొస్తామని ప్రకటించారు.

# ఒలెక్ట్రా నుంచి జీఎఫ్‌ఆర్‌పీ రీబార్



, హైదరాబాద్: కాంక్రీట్‌లో వాడే స్టీల్ రీబార్‌కు ప్రత్యామ్నాయంగా గ్లాస్‌ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్ (జీఎఫ్‌ఆర్‌పీ) రీబార్‌ను ఆవిష్కరించినట్లు.. విద్యుత్తు బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ వెల్లడించింది. ఇక్కడ జరుగుతున్న ఎంఈఐఎల్ వార్షిక సమావేశాల్లో ఈ ఉత్పత్తిని ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సీఎండీ కేవీ ప్రదీప్, ఎంఈఐఎల్ గ్రూపు డైరెక్టర్లు సీహెచ్.సుబ్బయ్య, బి.శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఎంఈఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పి.వి.కృష్ణారెడ్డి అధికారికంగా విడుదల చేశారు. ఈసీఆర్ గ్లాస్, ఎపాక్సీ రెసిన్ మిశ్రమంతో దీన్ని తయారు చేసిన ఈ రీబార్ తుప్పుపట్టదని, విద్యుత్తు ప్రసారం కాదని ఒలెక్ట్రా తెలిపింది. ఖర్చు తక్కువ, నిర్వహణ సులువు అయిన ఈ రీబార్ కఠిన వాతావరణ పరిస్థితులను తట్టుకుంటుందని.. 950-1100 ఎంపీఏ 'టెన్సిల్ స్ట్రెంగ్త్' ఉన్నందున స్టీలు రీబార్ కంటే రెట్టింపు బలమైనదని వివరించింది. స్టీలుతో పోల్చితే బరువు నాలుగోవంతే ఉంటుంది కనుక రవాణా సులభమని పేర్కొంది. పారిశ్రామిక కట్టడాల్లో ఫ్లోరింగ్ అవసరాలకు, పేవ్‌మెంట్ల నిర్మాణానికి, వంతెనల డెక్‌లకు, సముద్రంలో నిర్మాణాలకు ఇది అనువుగా ఉంటుందని కేవీ ప్రదీప్ తెలిపారు.

# యుద్ధ భయాలతో..

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో తీవ్రవాదుల హత్యాకాండ నేపథ్యంలో భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో.. దేశీయ మదుపర్లు జాగ్రత్తపడ్డారు. విదేశీ, దేశీయ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లు చేపట్టినా, సాధారణ మదుపర్లు అమ్మకాలకు మొగ్గుచూపడంతో సూచీలకు వరుసగా రెండో రోజూ నష్టాలు తప్పలేదు. జనవరి- మార్చి త్రైమాసిక ఫలితాల ప్రభావంతో యాక్సిస్ బ్యాంక్ షేరు డీలా పడటమూ ప్రభావం చూపింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు తగ్గి 85.40 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.9% నష్టపోయి 65.96 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో చైనా, సింగపూర్ మినహా మిగతా దేశాల సూచీలు లాభాలతో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు లాభాల్లో ఆరంభమయ్యాయి. భారత కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి 11.30 గంటలకు అమెరికా మార్కెట్ల ప్రధాన సూచీలైన డోజోన్స్ నష్టాల్లో, నాస్‌డాక్, ఎస్అండ్‌పీ లాభాల్లో కదలాడుతున్నాయి.

మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ గత రెండు ట్రేడింగ్ రోజుల్లో రూ.8.88 లక్షల కోట్లు ఆవిరై రూ.4,21,58,900.91 కోట్ల (4.93 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. శుక్రవారం ఒక్క రోజే రూ.8.05 లక్షల కోట్ల సంపదను మదుపర్లు కోల్పోయారు.

స్వల్ప లాభాలతో మొదలై..: క్రితం ముగింపు 79,801.43 పాయింట్లతో పోలిస్తే, శుక్రవారం ఉదయం సెన్సెక్స్ 79,830.15 పాయింట్ల వద్ద స్వల్ప లాభంతో ఆరంభమైంది. వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఒకదశలో 78,605.81 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి చేరింది. చివరకు కాస్త పుంజుకున్నా, 588.90 పాయింట్ల నష్టంతో 79,212.53 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 207.35 పాయింట్లు కోల్పోయి 24,039.35 వద్ద స్థిరపడింది.

రాణించిన ఐటీ షేర్లు: సెన్సెక్స్ 30 షేర్లలో ఏడు మినహా మిగతావన్నీ నష్టాల్లో ముగిశాయి. ఈ ఏడింటిలో 3 ఐటీ రంగ షేర్లే. టీసీఎస్ 1.36%, టెక్ మహీంద్రా 1.06%, ఇన్ఫోసిస్ 0.6% పెరిగాయి. మరోవైపు అదానీ పోర్ట్స్ 3.61%, యాక్సిస్ బ్యాంక్ 3.48%, ఎటర్నల్ 3.41%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.85%, పవర్‌గ్రిడ్ 2.56%, బజాజ్ ఫైనాన్స్ 2.01%చొప్పున నష్టపోయాయి.

బీఎస్ఈ రంగాల సూచీల్లో సేవలు 3.11%, యుటిలిటీస్ 2.96%, స్థిరాస్తి 2.87%, విద్యుత్ 2.77%, ఇండస్ట్రియల్స్ 2.19%, భారీ యంత్రపరికరాలు 2.06% నష్టపోయాయి. ఐటీ రంగ సూచీ లాభాల్లో ముగిసింది.

బీఎస్ఈలో 3,246 కంపెనీల షేర్లు సానుకూలంగా, 719 షేర్లు ప్రతికూల ధోరణిలో ముగిశాయి. 119 కంపెనీ షేర్ల ధరల్లో మార్పులేదు.

# భారత వృద్ధికి 'చమురు ధరల' ఊతం




దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 6.5% వృద్ధిని నమోదు చేయొచ్చని అంతర్జాతీయ ఏజెన్సీ ఈవై అంటోంది. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య ఉద్రిక్తతలు తీవ్రతరమవుతున్నా.. చమురు ధరలు తక్కువగా ఉండడంతో, ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గి, దేశీయ వృద్ధికి మద్దతుగా నిలుస్తుందని అంటోంది. ఈవై విడుదల చేసిన 'ఈవై ఎకానమీ వాచ్' నివేదిక ఇంకా ఏం చెబుతోందంటే.. స్థిరమైన ద్రవ్య, పరపతి విధానాల ద్వారా 2025-26లో భారత్ 6.5% వాస్తవ వృద్ధిరేటును నమోదు చేయగలదు. రిటెయిల్ ద్రవ్యోల్బణం 4% కంటే దిగువనే ఉంటుంది. నీ భారత వృద్ధి 4 కీలక అంశాలపై ఆధారపడి ఉంది. తగ్గుతున్న ఎగుమతులు, అంతర్జాతీయ మందగమనం, ముడి చమురు ధరల పతనం, అంతర్జాతీయంగా అదనపు ఉత్పత్తి సామర్థ్యాల ప్రభావం.. దేశ వృద్ధిరేటుపై కనిపించొచ్చు. నీ అంతర్జాతీయ ముడి చమురు బ్యారెల్ ధర ఈ ఏడాది 60-65 డాలర్ల వద్దే ఉండొచ్చు. దిగుమతులపైనే అధికంగా ఆధారపడిన భారత్‌కు ఇది ప్రయోజనకరం. నీ అధిక టారిఫ్‌ల వల్ల ఎగుమతులు తగ్గినా.. జీడీపీపై ప్రభావం తక్కువగానే ఉండొచ్చు. అంతర్జాతీయ మందగమనం ప్రపంచ వృద్ధికి అడ్డంగా నిలబడ్డా.. భారత్‌కున్న బలమైన ద్రవ్య, పరపతి విధానాల వల్ల ఇబ్బంది ఎదురుకాకపోవచ్చు.

# పళ్లెంలో శత్రువులతో దుష్పరిణామాలెన్నో..

ఆరోగ్యకరమైన ఆహారంతోనే ఆరోగ్యకరమైన మెదడు సాధ్యం. అయితే, మనం తెలిసో తెలియకో మెదడుకు హాని కలిగించే పదార్థాలు తింటాం. వీటిని, మరీ ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల దీర్ఘకాలంలో జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. ఆందోళన, కుంగుబాటు లాంటి అవలక్షణాలూ దాపురిస్తాయి. అలా మెదడు సామర్థ్యం దెబ్బతింటుంది.



మద్యం వ్యసనంగా మారితే వినాశకారే. కాలక్రమంలో బ్రెయిన్ ఫాగింగ్ (దిమ్మ తిరిగినట్లు ఉంటుంది) కు దారితీస్తుంది. మద్యం తాగేవాళ్లకు దీర్ఘకాలంలో జ్ఞాపకశక్తి క్షీణత, కుంగుబాటు, ఆందోళన మొదలైన మానసిక సమస్యలు ముమ్మరిస్తాయి.

చక్కెరలు అధికంగా ఉండే పదార్థాలు క్యాన్సర్ కణాల పెరుగుదలకు దారి తీస్తాయి. జ్ఞాపకశక్తి మీద కూడా ప్రభావం చూపుతాయి.

రంగురంగుల ప్యాకెట్లలో విక్రయించే ప్రాసెస్డ్ ఫుడ్స్ తయారీలో ఉపయోగించే వర్ణాలు, రసాయనాలు తీవ్ర హానికరం. ఇవి మెదడుకు కీడుచేస్తాయి. వేయించిన (ఫ్రైడ్) ఆహారాలు పిల్లల్లో హైపర్ యాక్టివిటీకి కారణమవుతాయి.

%రెడీ-టు-కుక్ పదార్థాల్లో కూడా యాడిటివ్స్, ప్రిజర్వేటివ్స్ ఎక్కువగానే ఉంటాయి. వీటిని మెదడు సంబంధ వ్యాధులైన అల్జీమర్స్ లాంటివాటికి ప్రేరకాలుగా గుర్తించారు.

జంక్ ఫుడ్స్‌లో ఎన్నో రసాయనాలు, కృత్రిమ రుచి కారకాలు కలుపుతారు. ఇవి మెదడు రసాయన గుణాలను మార్చేస్తాయి. ఆందోళన, కుంగుబాటు లాంటి మానసిక సమస్యలకు దారితీస్తాయి. పైగా వీటిలో ఉప్పు కూడా ఎక్కువగానే ఉంటుంది.

ఇక ఉప్పు అనారోగ్యాలకు బాటలువేస్తుంది. శరీరం, మెదడు పనితీరు మీద దుష్ప్రభావం చూపుతుంది. జ్ఞాపకశక్తి క్షీణతతోపాటు మరెన్నో సమస్యలకు మూలం అవుతుంది.

హాట్‌డాగ్స్ లాంటివి కూడా ప్రాసెస్ చేసిన ప్రొటీన్ ఆహార పదార్థాల కిందికే వస్తాయి. శరీరంలో కండరాల నిర్మాణానికి, కణాలు ఆరోగ్యంగా పనిచేయడానికి ప్రొటీన్లు అత్యవసరం. కాకపోతే ప్రాసెస్ చేసిన ప్రొటీన్ పదార్థాల్లో ఎన్నో యాడిటివ్స్ ఉంటాయి. కాబట్టి, వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

# వెల్లుల్లి సలాడ్.. బీపీ పరార్..!

అధిక రక్తపోటు.. సరికొత్త సమస్య కానేకాదు. కాకపోతే, నానాటికీ పెరుగుతున్న అనారోగ్యకర ధోరణి. శారీరక శ్రమలేని జీవన విధానం చెడు కొవ్వును పెంచేస్తుంటే.. ఒత్తిడి మనసులను చిత్తుచేస్తున్నది. పోషకాలు కరువైన ఆహారం సరేసరి. ఇవన్నీ రక్తపోటుకు రాచమార్గాలే. వెల్లుల్లి, దోస సలాడ్‌తో హైబీపీని అడ్డుకోవచ్చంటారు ఆహార నిపుణులు.



వెల్లుల్లిని చిదిమి, అందులో దోసకాయ ముక్కలు వేసి %%% నాలుగు చుక్కల యాపిల్ సిడార్ వెనిగర్ జోడించి కలియతిప్పితే సలాడ్ సిద్ధం. దీనివల్ల ఎన్నో ఉపయోగాలు.

దోసలో మెగ్నీషియం, పొటాషియంతో పాటు తగినంత నీరు ఉంటుంది. ఒంట్లోని సోడియం నిల్వలను అదుపు చేసే సామర్థ్యం పొటాషియంకు ఉంది. దీనివల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది.

దోసకాయలోని పీచుపదార్థం దెబ్బకు చెడుకొవ్వు తగ్గుతుంది. ఊబకాయాన్ని ఎదుర్కొనేందుకు, మధుమేహాన్ని దూరం చేసేందుకు ఇది ఎంతో సాయపడుతుంది.

వెల్లుల్లిలోని అలిసిన్ అనే రసాయనం చెడు కొవ్వును తగ్గించడంలో, రక్తపోటును నియంత్రించడంలో సాయపడుతుంది.

రక్తాన్ని శుద్ధిచేసే గుణం వెల్లుల్లిలో అపారం. రక్తపోటును తగ్గించడమే కాకుండా, గుండెకూ బలాన్నిస్తుంది.

దోసలోని నీరు రక్తపోటును అదుపు చేస్తుంది. వారానికి అయిదు సార్లు ఈ వెల్లుల్లి దోస సలాడ్ తీసుకుంటే రక్తపోటు అదుపులో ఉంటుందనీ భరోసా ఇస్తున్నారు నిపుణులు. కాకపోతే, దీనికి ఆరోగ్యకర జీవనశైలి తోడు కావాలి.

# కార్డియాక్ అరెస్ట్ ముప్పు తప్పాలంటే వీటిని పాటిస్తే మేలు..!

పపంచవ్యాప్తంగా హృద్రోగాలు పెరుగుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. గుండె జబ్బులు లేనివారిలోనూ లక్షణాలు బయటపడిన గంటలోపే సడన్ కార్డియాక్ అరెస్ట్‌తో ప్రాణాలు పోతున్న ఘటనలు పెరుగుతున్నాయి. అప్పటిదాకా ఆరోగ్యంగా కనిపించిన వారు క్షణాల్లోనే కుప్పకూలి మృత్యువాతన పడుతుండటం కలకలం రేపుతోంది. గుండె లయ దెబ్బతినడంతో గుండె పనిచేయని పరిస్థితి తలెత్తి కార్డియాక్ అరెస్ట్‌తో మరణిస్తున్న కేసులు వెలుగుచూస్తున్నాయి.



యువతలోనూ సడన్ కార్డియాక్ అరెస్ట్ కేసులు పెరుగుతున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న యువ హృదయాలు తల్లడిల్లుతున్నాయి. గుండె లయ తప్పడంతో శ్వాస ఆగిపోవడంతో సడన్ కార్డియాక్ అరెస్ట్ ఘటనలు నమోదవుతున్నాయి. కరోనరీ ఆర్టరీ డిసీజ్ ఉన్న వారిలో 80 శాతం కేసులు వెలుగుచూస్తున్నాయని, యాంజియోగ్రాఫీ చేయిస్తే వీరిలో బ్లాక్స్ పేరుకుపోవడం కనిపిస్తుందని మ్యాక్స్ స్మార్ట్ సూపర్ స్పెషాలిటీ హస్పిటల్ ప్రిన్సిపల్ డైరెక్టర్, కార్డియాలజీ డైరెక్టర్ డాక్టర్ రాజీవ్ అగర్వాల్ పేర్కొన్నారు.

యువతలో సడన్ కార్డియాక్ అరెస్ట్ కేసులు పెరగడంతో వీటి ముప్పును, నివారించే చర్యల గురించి అవగాహన పెంచుకోవడం కీలకమని డాక్టర్ అగర్వాల్ చెబుతున్నారు. హృద్రోగ ముప్పునకు కరోనరీ ఆర్టరీ డిసీజ్ ముప్పు కారకాల్లో ప్రధానమైన బీపీని అదుపులో ఉంచుకోవాలి, ధూమపానం మానేయడం, మధుమేహ నియంత్రణ, ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడంతో పాటు శారీరకంగా చురుకుగా ఉండాలని డాక్టర్ అగర్వాల్ చెప్పుకొచ్చారు. వీటితో పాటు శరీరానికి అవసరమైనంత పోషకాహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. 20 ఏండ్లు దాటిన వారంతా తరచూ ఈసీజీతో పాటు ఇతర ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి.

# 4.3కోట్ల మంది భారతీయ మహిళల్లో తీవ్రమైన వ్యాధి..! అప్రమత్తంగా లేకపోతే..?

మారుతూ వస్తున్న జీవనశైలి కారణంగా ఆరోగ్య సమస్య పెరుగుతున్నాయి. గత దశాబ్దపు గణాంకాలను పరిశీలిస్తే.. వివిధ రకాల వ్యాధుల ప్రమాదం పెరుగుతూ వస్తున్నది. ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్ తదితర వ్యాధులు ఇబ్బందికరంగా మారాయి. అయితే, కొన్ని వ్యాధులు మహిళలకు ప్రభావితం చేస్తున్నాయి. సరైన రోగ నిర్ధారణ, చికిత్స లేకపోవడంతో వల్ల పరిస్థితి మరింత తీవ్రమవుతుందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో భారత్‌లో దాదాపు 4.3 కోట్ల మంది మహిళలు ఎండ్రోమెట్రియోసిస్‌తో బాధపడుతున్నట్లుగా శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. ఇది పునరుత్పత్తి సమస్యలకు ప్రధాన కారణంగా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, వంధ్యత్వం తదిత సమస్యలకు సైతం దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు. యువతులు సైతం దీని బారినపడుతున్నారు.

ఎండ్రోమెట్రియోసిస్ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 19 కోట్ల మంది ఎండోమెట్రియోసిస్ సమస్యతో బాధపడుతున్నట్లుగా గణాంకాలు పేర్కొంటున్నాయి. భారత్‌లో 15 నుంచి 49 సంవత్సరాల మధ్య వయసున్న 10శాతం మంది మహిళల్లో ఈ సమస్యను గుర్తించారు. జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్‌లోని భారతీయ పరిశోధకులు దేశంతో సహా ప్రపంచంలోని అనేక దేశాల్లో ఎండోమెట్రియోసిస్‌పై శ్రద్ధ చూపడం లేదని పేర్కొన్నారు. చాలా మంది మహిళలకు ఈ సమస్య ఉన్నట్లు తెలియకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. అవగాహన లోపంతో వ్యాధికి సకాలంలో చికిత్స అందడం లేదని నిపుణులు చెబుతున్నారు.

సమస్యలు ఇవే..

ఎండోమెట్రియోసిస్‌తో బాధపడుతున్న మహిళలు తరచుగా నొప్పి (పెల్విక్, బ్యాక్ అబ్డామిన్)తో బాధపడుతుంటారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. మెనుస్ట్రువల్ సైకిల్‌లో శరీరంలోని హార్మోన్ల మార్పుల కారణంగా ఎండోమెట్రియల్ ( వంటి కణజాలంలోని కణాలు పెరగడం ప్రారంభిస్తాయని, ఆ తర్వాత విచ్ఛిన్నమవుతాయి. దాంతో రక్తస్రావం సమస్యలను కలిగిస్తుంది.

పీరియడ్స్ సమయంలో రక్తం శరీరం నుంచి బయటకు వెళుతుంది. అయితే, కణాల విచ్ఛిన్నంతో కలిగే రక్తస్రావం శరీరం లోపల ఉండిపోతుంది. ఇది వాపుతో పాటు అనేక సమస్యలకు దారి తీస్తుంది. సమస్యను సకాలంలో గుర్తించి చికిత్స చేయకపోతే, పునరుత్పత్తి సమస్యలకు దారి తీస్తుంది.



నిపుణులు ఏమంటున్నారు?

గ్లోబల్ ఉమెన్స్ హెల్త్ ప్రోగ్రామ్ సీనియర్ రీసెర్చ్ ఫెలో డాక్టర్ ప్రీతి రాజ్‌బంగ్షి మాట్లాడుతూ పీరియడ్స్ సమయంలో నొప్పిపై శ్రద్ధ లేకపోవడం, ఎండోమెట్రియోసిస్ సమస్యపై అవగాహన లేకపోవడంతో వ్యాధి సకాలంలో గుర్తించలేకపోతున్నట్లు తెలిపారు. ఇది అంతర్గతంగా తీవ్రమైన సమస్యలను పెంచుతుందన్నారు. మహిళల్లో ఎండోమెట్రియోసిస్ ముందస్తు రోగనిర్ధారణ, చికిత్సను మెరుగుపరచాల్సిన అవసరం గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని పరిశోధనలు నొక్కి చెబుతున్నాయన్నారు. లక్షణాలపై శ్రద్ధ వహించడంతో పాటు వైద్యుల సలహాలు పాటించాలని సూచిస్తున్నారు.

ఎలా గుర్తించాలంటే..

ఎండోమెట్రియోసిస్‌తో బాధపడే మహిళల్లో పీరియడ్స్ సమయంలో తిమ్మిర్లు, నొప్పి, కడుపు, వెన్నులో విపరీతమైన నొప్పి, శృంగారంలో పాల్గొనే సమయంలో నొప్పి, పీరియడ్స్ సమయంలో అధిక రక్తస్రావం తదితర లక్షణాలు కనిపిస్తాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఎండోమెట్రియోసిస్‌తో జాగ్రత్తలు తీసుకోకపోతే గర్భం దాల్చడంలో ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరిస్తున్నారు. అయితే, కుటుంబంలో ఇప్పటికే ఎవరైనా ఇలాంటి సమస్య బారినపడ్డ వారుంటే ఉంటే.. మిగతా వారు ఎండోమెట్రియోసిస్ బారినపడే ప్రమాదం బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. రుతుస్రావం సమయంలో ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని సూచించారు.

# లేటెస్ట్ డైట్ ప్లాన్ : అట్లాంటిక్ డైట్‌తో ఆరోగ్య ప్రయోజనాలు

మరో లేటెస్ట్ డైట్ ఇప్పుడు ఇంటర్‌నెట్‌లో మార్మోగుతోంది. అట్లాంటిక్ డైట్ ఆరోగ్యానికి ప్రయోజనకరమని ప్రపంచవ్యాప్తంగా పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఆరోగ్యకరమైన ఆహారంగా పేరొందిన మధ్యప్రాచ్య ఆహారానికి అట్లాంటిక్ డైట్ దగ్గరగా ఉంటుంది. అట్లాంటిక్ డైట్ బరువు తగ్గేందుకు సహాయపడటంతో పాటు శరీరంలో మంచి కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను ప్రేరేపిస్తుంది.



అట్లాంటిక్ డైట్ వీటితో పాటు ఇతర ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుందని చెబుతున్నారు. ఈ డైట్ ఆరోగ్యానికి ఎలా మేలుచేస్తుందనే వివరాలను జామా నెట్‌వర్క్ ఓపెన్‌లో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది. స్పెయిన్‌లో అట్లాంటిక్ డైట్ ప్లాన్‌ను అనుసరించే 200 కుటుంబాలపై ఈ అధ్యయనం నిర్వహించారు.

ఆరు నెలల అనంతరం వీరిలో కొలెస్ట్రాల్ లెవెల్స్ తగ్గడంతో పాటు బీపీ, ఫాస్టింగ్ గ్లూకోజ్ లెవెల్స్, శరీర బరువు సరిగ్గా ఉన్నాయని గుర్తించారు. ఈ డైట్ ప్లాన్‌ను అనుసరించే వారిలో మెటబాలిక్ సిండ్రోమ్ తలెత్తే అవకాశాలు తగ్గాయని పరిశోధ్ కులు వెల్లడించారు. ఇక అట్లాంటిక్ డైట్‌లో భాగంగా స్థానికంగా లభించే పండ్లు, కూరగాయలు, సిరిల్స్, ఫిష్, డైరీ ఉత్పత్తులు, ఆలివ్ ఆయిల్‌తో పాటు పరిమిత మోతాదులో వైన్ కూడా తీసుకుంటారు. సీజనల్, స్థానికంగా లభ్యమయ్యే పండ్లు, కూరగాయలను అధికంగా తీసుకుంటూ తక్కువ ప్రాసెస్ చేసిన ఆహారాలను తీసుకుంటారు.

# ఆరోగ్యానికి మెగా బూస్ట్ : ఒమెగా 3 ఆమ్లాలు లోపిస్తే ఏం జరుగుతుందంటే..!

ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ మన ఆరోగ్యానికి ఎంతో కీలకం. మెదడు, గుండె పనితీరుకు ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలు అవసరం. కుంగుబాటు, ఆందోళన వంటి మానసిక సమస్యలను నివారించి రోజంతా చురుకుగా ఉండేందుకూ ఒమెగా 3 ఆమ్లాలు కీలకంగా పనిచేస్తాయి.




గర్భిణీ స్త్రీలు తగినంత ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు తీసుకుంటే పిల్లల్లో మెదడు చురుకుగా ఉండటంతో పాటు మెరుగైన కమ్యూనికేషన్స్, సోషల్ స్కిల్స్ ప్రేరేపిస్తాయి. శాకాహారుల్లో ఒమెగా-3 లోపం తలెత్తడం సహజం. ఇతర పోషకాహార లోపాన్ని భర్తీ చేయడంలో చూపిన ఆసక్తితో పోలిస్తే ఒమెగా 3 ఆమ్లాల లోపాన్ని పెద్దగా పట్టించుకోరు.

అయితే ఒమెగా-3 లోపంతో పలు శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ ఫ్యాటీ ఆమ్లం లోపిస్తే కుంగుబాటు, చర్మ, కేశ సమస్యలు, కండరాల నొప్పులు, కండ్లు పొడిబారటం, తీవ్ర అలసట, నీరసం, నిస్సత్తువ వంటి ఇబ్బందులు, లక్షణాలు వేధిస్తాయి. ఇక సాల్మన్ చేపలు, అవిశె గింజలు, చియా సీడ్స్, వాల్‌నట్స్, సోయాబీన్స్, బ్రస్సెల్స్ స్ప్రౌట్స్ వంటి ఆహార పదార్థాల్లో ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు సమృద్ధిగా లభిస్తాయి.

# వారి విడాకులు.. ఆ సమయంలో జీవితపాఠం నేర్చుకున్నా: శ్రుతి హాసన్



: కమల్‌హాసన్ కుమార్తెగా ఇండస్ట్రీకి పరిచయమై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నటి శ్రుతి హాసన్ సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ తాను ఎప్పుడూ దాన్ని దృష్టిలో పెట్టుకోలేదని తాజాగా వెల్లడించారు. ఇండస్ట్రీకి రావడానికి ముందు ఎన్నో విషయాలు తెలుసుకున్నట్లు తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రుతి తన చిన్ననాటి విషయాలు పంచుకున్నారు. తన తల్లిదండ్రులు విడాకులు తీసుకున్న సమయంలోనే తాను జీవిత పాఠం నేర్చుకున్నట్లు చెప్పారు.

“నేను ఇండస్ట్రీకి రావడానికి ముందు నా జీవితంలో ఏం జరిగిందో చాలామందికి తెలియదు. నా తల్లిదండ్రులు విడిపోవడం నన్ను ఎంతో బాధించింది. వారిద్దరూ విడిపోయాక నేను అమ్మతో ఉన్నాను. అప్పటివరకు ఉన్న జీవితం ఒక్కసారిగా మారిపోయింది. చెన్నై నుంచి ముంబయి వచ్చేశాం. విలాసవంతమైన జీవితం దూరమైంది. అప్పటివరకూ మెర్సిడెస్ బెంజ్ కారులో తిరిగిన నేను లోకల్ ట్రైన్‌లో ప్రయాణించాను. రెండు రకాల జీవితాలు చూశాను. ఇండస్ట్రీకి వచ్చాక నాన్నతో ఎక్కువగా ఉంటున్నాను. విదేశాల్లో సంగీతం నేర్చుకున్నాను. నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాను. స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్నాను'' అని చెప్పారు. శ్రుతిహాసన్ తల్లిదండ్రులు కమల్ హాసన్ సారిక 2004లో విడిపోయిన సంగతి తెలిసిందే.

ప్రస్తుతం శ్రుతి ‘కూలీ’ సినిమాలో నటిస్తున్నారు. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దీన్ని రూపొందిస్తున్నారు. నాగార్జున, ఉపేంద్ర తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న యాక్షన్ కథాంశంతో ఇది ముస్తాబవుతోంది. ఆగస్టు 14న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది.



# అల్లు అర్జున్‌కు విజయ్ దేవరకొండ గిఫ్ట్.. స్వీట్ బ్రదర్ అంటూ పోస్ట్..

అల్లు అర్జున్ విజయ్ దేవరకొండ . ఇద్దరికీ ఆడియన్స్‌లో ఉన్న క్రేజ్ తెలిసిందే. వీరిద్దరూ ఇప్పటికే పలు సందర్భాల్లో ఒకరిపై మరొకరు తమ అభిమానాన్ని చాటుకున్నారు. తాజాగా అల్లు అర్జున్‌కు విజయ్ దేవరకొండ గిఫ్ట్ పంపారు.

తాజాగా ఈ హీరో తన రౌడీ బ్రాండ్ స్టోర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా బన్నీకి రౌడీ బ్రాండ్ డ్రెస్‌లను, పిల్లల కోసం కొన్ని బర్గర్‌లను పంపారు. దీనికి సంబంధించిన ఫొటోను పంచుకున్న బన్నీ “మై స్వీట్ బ్రదర్.. ఎప్పుడూ నువ్వు సర్‌ప్రైజ్ చేస్తుంటావు. సో స్వీట్” అని తన స్టోరీలో పోస్ట్ పెట్టారు. గతంలోనూ అల్లు అర్జున్‌కు విజయ్ గిఫ్ట్‌లు పంపిన విషయం తెలిసిందే. ‘పుష్ప 2’ రిలీజ్ సందర్భంగా ‘పుష్ప’ పేరుతో కూడిన టీ షర్ట్‌లను పంపారు. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. ‘నా స్వీట్ బ్రదర్.. నీ ప్రేమకు కృతజ్ఞతలు” అని బన్నీ పేర్కొన్నారు. “లవ్ యూ అన్నా.. మన సంప్రదాయాలు కొనసాగుతాయి” అని విజయ్ రిప్లై ఇచ్చారు.

ఇక ప్రస్తుతం వీరిద్దరూ చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్నారు. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా ఓ భారీ ప్రాజెక్ట్ సిద్ధమవుతోంది. దీని ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీని తర్వాత త్రివిక్రమ్‌తో సినిమా ఉంది. విజయ్ దేవరకొండ ‘కింగ్‌డమ్’లో నటిస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో స్పై థ్రిల్లర్‌గా రూపొందుతోంది.

# ఆ సినిమాలోని కొన్ని సీన్స్‌లో నా యాక్టింగ్ నచ్చలేదు..: నాని



హైదరాబాద్: నాని (%ౌఊఅఱ%), విజయ్ దేవరకొండ (ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘ఎవడే సుబ్రమణ్యం’. నాగ్ అశ్విన్ దర్శకుడు. ఈ సినిమా విడుదలై 10 ఏళ్లైన సందర్భంగా ఇటీవల టీమ్ రీయూనియన్ నిర్వహించింది. నటీనటుల, దర్శక-నిర్మాతలతో పాటు సినిమా కోసం వర్క్ చేసిన టీమ్ అందరూ కలిశారు. ఈ రీ యూనియన్‌ని ఉద్దేశించి నాని తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పదేళ్ల తర్వాత టీమ్ అందరినీ కలుసుకోవడం ఎమోషనల్‌గా అనిపించిందన్నారు.

“విజయ్, నేను, నాగ్ అశ్విన్ ఇప్పటికీ టచ్‌లోనే ఉన్నాం. వీలున్నప్పుడు మాట్లాడుకుంటాం. సినిమాలు విడుదలైనప్పుడు సందేశాలు పంపించుకుంటాం. పదేళ్ల తర్వాత టీమ్ అంతా ఒకేచోట కలవడం ఆనందంగా అనిపించింది. స్కూల్ రీయూనియన్‌లా అనిపించింది. మా సినిమా కోసం వర్క్ చేసిన వాళ్లు చాలా మంది పెద్దవాళ్లు అయ్యారు. రీ యూనియన్‌లో సినిమా ప్రదర్శించారు. అందులోని కొన్ని సీన్స్ చూసినప్పుడు నా యాక్టింగ్ బాలేదనిపించింది. ఇంకాస్త బెటర్‌గా చేస్తే బాగుండేదనే ఫీలింగ్ వచ్చింది” అని నాని చెప్పారు.

‘హిట్ 3’ దర్శకుడు శైలేశ్ కొలను గురించి మాట్లాడుతూ.. “శైలేశ్‌కు నాతో ఎప్పటి నుంచో వర్క్ చేయాలనే ఆలోచన ఉంది. కాకపోతే మొదట్లో అతడు ఎప్పుడూ నాతో ఆ విషయాన్ని చెప్పలేదు. ‘హిట్ 1’, ‘హిట్ 2’ చిత్రాలకు సంబంధించిన ఐడియాలు శైలేశ్ చెప్పినప్పుడు ఆసక్తిగా అనిపించి ఆయా చిత్రాలను నిర్మించాను. ఆయా చిత్రాల గురించి మేమిద్దరం డిస్కస్ చేసుకునేవాళ్లం. అంతేకానీ, వాటిల్లో యాక్ట్ చేయమని నన్నెప్పుడూ అడగలేదు. ‘హిట్ 2’లో అతిథి పాత్ర గురించి మాట్లాడుకున్నప్పుడు.. ‘నేను చేయనా?’ అని అడిగా. దానికి అతడు ఎంతో ఆనందించాడు. సంతోషంతో ఒక ఎమోషనల్ సందేశం పంపించాడు. ఆరోజు అర్థమైంది. అతడికి నాతో సినిమా చేయాలని ఉందని. కాకపోతే దానిని నాతో చెప్పలేకపోయాడని” అని తెలిపారు. మే 1న ఈసినిమా విడుదల కానుంది. శ్రీనిధి శెట్టి కథానాయిక. ఇందులో నాని అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా కనిపించనున్నారు.



# మరోసారి ‘శతమానం భవతి’ జోడీ రిపీట్..

శర్వానంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఇందులో శర్వా సరసన అనుపమ పరమేశ్వరన్ నటించనున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా ఈ వార్తలను టీమ్ ఖరారు చేసింది. ఈ ప్రాజెక్ట్‌లోకి అనుపమకు స్వాగతం పలికింది. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. 60ల కాలం నాటి నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో శర్వా మునుపెన్నడూ పోషించని పాత్రలో కనిపించనున్నారు.

ఈ సినిమా కోసం హైదరాబాద్ సమీపంలో 15 ఎకరాల్లో ఓ భారీ సెట్‌ను సిద్ధం చేశారు. ఎక్కువ భాగం షూటింగ్ మొత్తం అక్కడే పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో వీరిద్దరూ కలిసి శతమానం భవతిలో నటించారు. 2017లో విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. ఇప్పుడు మళ్లీ ఈ జోడీ మరోసారి తెరపై సందడి చేయడానికి సిద్ధం కావడంతో అభిమానులు ఆనందిస్తున్నారు.

# ‘డాకు మహారాజ్’.. ఆ విషయంలో నెట్‌ఫ్లిక్స్ సారీ చెప్పింది: ఊర్వశీ రౌతేలా

బాలకృష్ణ హీరోగా నటించిన రీసెంట్ చిత్రం ‘డాకు మహారాజ్’ ఇందులో నటించి ప్రేక్షకులను అలరించారు బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలా ఈ సినిమా ఓటీటీ రిలీజ్‌కు సంబంధించిన పోస్టర్‌పై ఊర్వశీ రౌతేలా ఫొటో లేకపోవడం అప్పట్లో చర్చకు



దారితీసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై తాజాగా ఊర్వశీ రౌతేలా స్పందించారు. ఈ విషయంలో నెట్‌ఫ్లిక్స్ తమ టీమ్‌కు సారీ చెప్పిందన్నారు.

“ఒరిజినల్ రిలీజ్ పోస్టర్‌లో ఉన్న నా ఫొటోని తొలగించి నెట్‌ఫ్లిక్స్ అదే పోస్టర్ షేర్ చేసింది. నెట్‌ఫ్లిక్స్ కావాలనే అలా చేసిందని అందరూ అనుకున్నారు. అందులో ఎలాంటి నిజం లేదు. నెట్‌ఫ్లిక్స్ కావాలని ఇలాంటి నిర్ణయం తీసుకోలేదు. అది ఉద్దేశపూర్వకంగా ఆ పోస్టర్ షేర్ చేయలేదు. అనుకోకుండా జరిగింది. ఆ ఓటీటీ సంస్థ తప్పు గ్రహించి.. మాకు సారీ చెప్పింది. ఆ తర్వాత నా ఫొటోలతో ఉన్న కొత్త పోస్టర్లను షేర్ చేసింది. కాకపోతే, తొలిసారి షేర్ చేసిన పోస్టర్‌లో నా ఫొటో లేకపోవడంపై అభిమానులు ఆగ్రహానికి గురయ్యారు” అని ఆమె వెల్లడించారు. యాక్షన్ డ్రామా ఫిల్మ్‌గా ‘డాకు మహారాజ్’ తెరకెక్కింది. బాబీ దర్శకుడు. సంక్రాంతి కానుకగా ఇది విడుదలై బాక్సాఫీస్ వద్ద ఉత్తమ ప్రదర్శన కనబరిచింది. ఇందులో పోలీస్ పాత్రలో కనిపించారు ఊర్వశీ రౌతేలా. ‘దబిడి దిబిడి’ అనే సాంగ్ కోసం కూడా ఆమె వర్క్ చేశారు. ఈ పాట అంతటా వైరల్ అయింది. ‘డాకు మహారాజ్’ విడుదలయ్యాక నార్త్‌లో పలు ఇంటర్వ్యూలో ఊర్వశీ పాల్గొన్నారు. ఇందులో తాను టాప్ నటినని గొప్పలు చెప్పారు. అదే సమయంలో జరిగిన సైఫ్ అలీఖాన్‌పై దాడిని ఉద్దేశించి ఆమెను ప్రశ్నించగా.. తాను ధరించిన ఖరీదైన ఆభరణాల గురించి బదులిచ్చారు. ఆమె చేసిన వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర చర్చకు దారితీశాయి. నెటిజన్లు ఆమె తీరును తప్పుపట్టారు. ఈక్రమంలోనే విడుదలైన ‘డాకు మహారాజ్’ ఓటీటీ పోస్టర్‌పై కావాలనే నెట్‌ఫ్లిక్స్ ఆమె ఫొటోను తొలగించిందని మాట్లాడుకున్నారు.

# ‘అడాల్‌సెన్స్’.. బాలీవుడ్ ఆ ధైర్యం కూడా చేయలేదు: ఇమ్రాన్ హష్మీ

ఇటీవల నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలై సంచలనం సృష్టించింది వెబ్‌సిరీస్ ‘అడాల్‌సెన్స్’. ప్రతి ఎపిసోడ్‌ను సింగిల్ టేక్‌లో రూపొందించి అందరినీ మేకర్స్ ఆకట్టుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ సొంతం చేసుకున్న ఈ సిరీస్ గురించి బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ మాట్లాడారు. ఇలాంటి కథను తెరకెక్కించే ధైర్యం బాలీవుడ్ చేయలేదని అన్నారు.




“అడాల్‌సెన్స్’ దాని కథపరంగా సూపర్ హిట్ అయింది. అలాంటి కథను రూపొందిద్దామని బాలీవుడ్‌లో ఎవరినైనా సంప్రదిస్తే వారు మనల్ని పిచ్చోళ్లలా చూస్తారు. ఎందుకంటే హిందీ పరిశ్రమ కొత్తదనాన్ని మర్చిపోయింది. రిస్క్ తీసుకోవడం మానేసింది. ఎంత సృజనాత్మకంగా ఉన్నప్పటికీ ఒకరకమైన కంటెంట్‌ను రూపొందించడానికి భయపడుతోంది. సోషల్ మీడియా వినియోగం వ్లల కలిగే ప్రమాదాలను ‘అడాలసెన్స్’లో అద్భుతంగా చూపించారు. నాలుగు ఎపిసోడ్‌లను ఒక్కోదాన్ని ఒకే టేక్‌లో చిత్రీకరించి ఆశ్చర్యపరిచారు. ఇదే విషయాన్ని బాలీవుడ్ చిత్ర నిర్మాతలకు చెబితే.. ‘ఎపిసోడ్ చిత్రీకరణ మధ్యలో ఏదైనా తప్పు జరిగితే.. మళ్లీ మొదటి నుంచి తీయాలి.. బడ్జెట్ ఎంత అవుతుందో తెలుసా’ అంటారు. ఇలాంటివి రూపొందించాలంటే ధైర్యం కావాలి”.

“బాలీవుడ్ కొత్తదనానికి పూర్తిగా దూరమైంది. గతంలో వచ్చిన సినిమాల్లోని కంటెంట్‌లోనే మార్పులు చేసి మరోసారి రూపొందిస్తున్నారు. ఇది చాలా సేఫ్ గేమ్. రణ్‌బీర్ కపూర్ ‘యానిమల్’ వచ్చినప్పుడు అందరూ విమర్శించారు. కానీ, ఇప్పుడు అందరూ అదే ట్రెండ్ ఫాలో అవుతున్నారు. బీటౌన్ వాళ్లు ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. కానీ, సెట్ చేయలేకపోతున్నారు” అని చెప్పారు. నెట్‌ఫ్లిక్స్ (వేదికగా విడుదలైన ‘అడాల్‌సెన్స్’ రికార్డులు నెలకొల్పింది. విడుదలైన కొన్ని రోజుల్లోనే 100 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకొని నెట్‌ఫ్లిక్స్‌లో అత్యధిక వ్యూస్ సాధించిన సిరీస్‌ల జాబితాలో టాప్‌లో నిలిచింది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy